





www.vishvambhara.com
తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

మంగళవారం
25-06-2024

సంపుటి : 01 | సంచిక : 52 | పేజీలు : 12 | వెల : 5/-   తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


V3 NEWS

## బదిలీల జాతర!

- రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ ల బదిలీలు
- ఒకేసారి 44 మంది అధికారులను ట్రాన్స్‌ఫర్ చేసిన ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతి కుమారి
- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా అమ్రపాలి



5

## వైద్యారోగ్య మంత్రితో చర్చలు విఫలం

- కొనసాగుతున్న జూనియర్ డాక్టర్ల నిరసన
- తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్
- లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామన్న డాక్టర్లు



2

## సెమీస్‌కు టీమిండియా

- సూపర్ 8లో మూడు మ్యాచ్‌ల్లో హవా
- దుమ్మురేపిన కెప్టెన్ రోహిత్ శర్మ
- హెడ్ పోరాటం వృధా
- 27న ఇంగ్లాండ్‌తో సెమీ పోరు



11



## మోడీ 3.0 టీమ్

18వ లోక్‌సభ సెషన్స్ ప్రారంభం

అట్టహాసంగా ఎంపీల ప్రమాణ స్వీకారం

న్యూ లుక్‌లో అదరగొట్టిన కిషన్ రెడ్డి

సైకిల్‌పై పార్లమెంట్‌కు టీడీపీ ఎంపీ

లోక్‌సభలో 'నీట్' పరీక్ష నినాదం

18వ లోక్‌సభ సమావేశాల్లో తొలిరోజు పలు ఆసక్తికర సంఘటనలు చోటుచేసుకున్నాయి. తెలంగాణ, ఏపీ నుంచి లోక్‌సభ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో పలువురు పంచెకట్టులో సంప్రదాయబద్ధంగా సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు తెలుగులో ప్రమాణం చేశారు.

9



బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ లో కేర్చుకోవటాన్ని వ్యతిరేకించి 24 గంటలు కాకముందే సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి రేవంత్ రెడ్డి ఊహించని షాక్ ఇచ్చారు. జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను రేవంత్ కాంగ్రెస్ లోకి చేర్చుకుంటారని జీవన్ ఏమాత్రం ఊహించలేదు. పోయిన ఎన్నికల్లో సంజయ్ గెలిచింది జీవన్ పైనే. చాలాకాలంగా జీవన్-సంజయ్ మధ్య సంబంధాలు ఉప్ప నిప్పగా ఉన్నాయని పార్టీవర్గాలు చెబుతున్నాయి.

# జీర్ణించుకోలేని జీవన్ రెడ్డి

### పోచారం, సంజయ్...

ఎమ్మెల్సీ శత్రువులు హస్తం గూటికి..

స్వయంగా ఆహ్వానించిన రేవంత్ రెడ్డి

సీఎం నిర్ణయాలపై జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకు నిర్ణయం?

అనుచరులు, కార్యకర్తలతో వరుస భేటీలు

రేవంత్ రెడ్డిపై ఏఐసీసీకి ఫిర్యాదు

**విశ్వంభర, హైదరాబాద్ :**

సంజయ్ అంటే ఏమాత్రం పడని జీవన్ పిరాయింపులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. బీఆర్ఎస్ బాన్సువాడ ఎంఎల్ఏ పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ లో చేరటాన్ని జీవన్ తీవ్రంగా వ్యతిరేకించిన విషయం అందరికీ తెలిసిందే. పోచారం చేరికను జీవన్ వ్యతిరేకించారంటే రేవంత్ రెడ్డిని వ్యతిరేకించినట్లే అనుకోవాలి. అలాంటిది 24 గంటలు తిరగకముందే తన నియోజకవర్గం బీఆర్ఎస్ ఎంఎల్ఏ సంజయ్ ను కాంగ్రెస్ లో చేర్చుకోవటాన్ని జీవన్ తట్టుకోలేకపోతున్నారు. అందుకనే రేవంత్ వైఖరిపై మండిపోతున్నారట. సోమవారం ఉదయం నుండి నియోజకవర్గంలోని మద్దతుదారులంతా జీవన్ ఇంటికి వస్తున్నారు. ఎంఎల్సీ పదవికి జీవన్ రాజీనామా చేస్తారనే ప్రచారం కూడా పార్టీలో జరుగుతోంది. అయితే రాజీనామా అస్త్రం ఉత్త బెదిరింపు మాత్రమే అని కూడా కొందరు అంటున్నారు.

మిగతా2లో...

### సీఎం దూకుడుకు కారణం అధిష్టానమేనా..?

రేవంత్ పై జీవన్ అధిష్టానం దగ్గర ఫిర్యాదు చేసినట్లుగా పార్టీలో సీనియర్లు చెప్పుకుంటున్నారు. అయితే రేవంత్ కు వ్యతిరేకంగా జీవన్ ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోరన్నది వాస్తవం. ఎందుకంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ లో చేర్చుకోవటంపై అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ రాకుండా రేవంత్ ముందుకెళ్ళరన్న విషయాన్ని జీవన్ ఆలోచించకపోవటమే విచిత్రంగా ఉంది. మద్దతుదారులతో ఎన్ని మీటింగులు పెట్టుకున్నా, అధిష్టానంతో ఏమి ఫిర్యాదుచేసినా ఎలాంటి ఉపయోగం ఉండదు. అధికారంలో ఉన్న పదేళ్ళు కేసీయార్ టీడీపీని భూస్థాపితం చేసేయటం, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను లాగేసుకున్న విషయాన్ని జీవన్ మరచిపోయినట్లున్నారు.

## భారత దేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక మచ్చ

- ఆ పొరపాటు మళ్లీ జరగొద్దు
- సామాన్య ప్రజల సంకల్పం నెరవేర్చుదాం
- లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకెళ్దాం
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ



9

## కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- చరిత్ర పునరావృతం అవుతుంది
- కష్టసమయాలు బీఆర్ఎస్‌కు కొత్త కాదు
- కాంగ్రెస్‌కు కచ్చితంగా ప్రజలు బుద్ధి చెప్తారు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్



2

## నీట్ కుంభకోణంపై చర్చ జరగాలి

- దీనిపై ఎన్‌డీఏ మిత్రపక్షం, సీఎం చంద్రబాబు స్పందించాలి
- సీఎం చంద్రబాబుకి వినోద్ కుమార్ రిక్వెస్ట్
- ఈ సమస్యపై ఈడీ ఎందుకు మౌనం?
- బండి సంజయ్ కూడా ఎందుకు స్పందించడం లేదు



2

## రాష్ట్రంలో త్వరలో కొత్త విద్యుత్ పాలసీ

శ్రీశైలంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 119 | ₹204 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 141 | ₹233 |



## ఢిల్లీలో సీఎం రేవంత్ బిజీ.. బిజీ

### పలువురు కేంద్ర మంత్రులతో భేటీ

- రాజ్‌నాథ్ సింగ్, మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశం
- 2,450 ఎకరాల రక్షణ శాఖ భూములు బదలాయించండి
- రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ వినతి
- వరంగల్ సైనిక్ స్కూల్ అనుమతులు పునరుద్ధరించాలని కోరిన సీఎం

2



## రాజ్యాంగాన్ని ఏ శక్తి తాకలేదు

రాజ్యాంగం పై దాడిని ఆమోదించబోం

ప్రభుత్వాన్ని రక్షించుకునే పనిలో మోడీ

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ

9

# నేనంటే నేనే!

### బీజేపీలో అధ్యక్ష పదవికి ఫుల్ డిమాండ్?

క్యూలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, కీలక నాయకులు

ఢిల్లీకి క్యూకట్టిన రాష్ట్ర నేతలు .. లాబీయింగ్‌లతో హస్తినలో మకాం

**విశ్వంభర, హైదరాబాద్ :**

ఇపుడు విషయం ఏమిటంటే తెలంగాణ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తొందరలోనే పార్టీ బాధ్యతలనుంచి తప్పుకోబోతున్నారు. అందుకని తెలంగాణకు కొత్తగా అధ్యక్షుడిని నియమించే విషయంలో జాతీయ నాయకత్వం కొందరి పేర్లను పరిశీలిస్తోంది. కాబట్టి అధ్యక్షపదవి కోసం కొందరు సీనియర్లు, ఎంపీలుగా గెలిచిన వారిలో కొందరు గట్టి ప్రయత్నాల్లో ఉన్నారు. అధ్యక్షపదవికి ప్రయత్నాలు చేసుకుంటున్నారంటు కొందరి పేర్లు బాగా ప్రచారంలో ఉన్నాయి. ఎవరంటే మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, మెదక్ ఎంపీ రఘునందనరావు. వీరిలో అర్వింద్ తప్ప మిగిలిన ముగ్గురు మొదటిసారి ఎంపీలుగా గెలిచారు. ఈటల, అరుణ, రఘునందన్ గతంలో ఎంఎల్ఏలుగా పనిచేశారు. వీళ్ళల్లో కూడా డీకే, ఈటల మంత్రులుగా కూడా పనిచేశారు. ఈటల, ధర్మపురి

మిగతా2లో...

కొద్దిరోజులుగా తెలంగాణ బీజేపీలో ఒక ప్రచారం బాగా పెరిగిపోతోంది. అదేమిటంటే పార్టీ తెలంగాణ అధ్యక్షపదవి కోసం నేతలమధ్య విపరీతమైన పోటీ పెరిగిపోతోందని. ఒకపుడు పార్టీ అధ్యక్షపదవిని ఎవరు పెద్దగా పట్టించుకునే వాళ్ళు కారు. పోటీ అంతా ఒక దశాబ్దంగానే మొదలైంది. ఎందుకింత కారణం అంటే కేంద్రంలో అధికారంలోకి రావటమనే చెప్పాలి.




## మెగా డీఎస్సీ, పెన్షన్ల పెంపునకు ఆమోద ముద్ర

10

## ప్రయాణికులకు శుభవార్త

మళ్లీ పట్టాలెక్కిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్

10

## వైద్యారోగ్య మంత్రితో చర్చలు విఫలం

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు ఇచ్చిన నిరవధిక సమ్మె పిలుపుతో సోమవారం ఉదయం ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ వైద్యసేవలు దెబ్బతిన్నాయి. సిబ్బంది కొరత సంక్షోభాన్ని అధిగమించడానికి, ఉపాధ్యాయ సిబ్బందితో సహా సీనియర్ కేర్ ఇచ్చే వారందరినీ సెలవులను రద్దు చేసి, రెగ్యులర్ డ్యూటీకి రిపోర్టు చేయాలని ఆసుపత్రి యాజమాన్యాలు ఆదేశించాయి. గాంధీ ఆసుపత్రిలో, అధికారులు సోమవారం ఔట్ పేషెంట్ వింగ్ పనిచేసేలా చూసుకున్నారు. అయితే మెడికో సమ్మె కారణంగా 50కి పైగా ఎలక్టివ్ సర్జరీలను వాయిదా వేయవలసి వచ్చింది. తమ స్టైఫండ్‌లను సక్రమంగా చెల్లించేలా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, మెరుగైన హాస్టల్ సౌకర్యాలు, ఆసుపత్రి ఆవరణలో భద్రత, అనేక ఇతర సమస్యలతో జూనియర్ డాక్టర్లు ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వాలు మారినా తమ సమస్యలకు పరిష్కారం లభించడం లేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్స్ నెరవేర్చాలని ఆందోళన బాట పట్టారు.

**ఫలించని చర్చలు**

సోమవారం తెల్లవారుజాము నుంచి రెగ్యులర్ మెడికల్ విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్న జూనియర్ వైద్యులతో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ భేటీ అయ్యారు. మధ్యాహ్నం వారితో చర్చలు జారిపరు. కానీ చర్చలు సానుకూల ఫలితాలు ఇవ్వలేదు. తమ డిమాండ్లలో ఎక్కువ భాగం పరిష్కరించకపోవడంతో.. ఔట్ పేషెంట్ డ్యూటీలు, ఎలెక్టివ్ సర్జరీలు, ఇన్‌పేషెంట్ వార్డు విధులు సహా వైద్య సేవల నుంచి నిరవధిక బహిష్కరణ కొనసాగించాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టిజెయుడిఎ) సభ్యులు నిర్ణయించారు.

**జూనియర్ డాక్టర్ల డిమాండ్స్**

గత ఆరు నెలలుగా తమకు స్టైఫండ్ సరైన సమయానికి రావడం లేదన్నారు. ఉస్మానియా హాస్పిటల్ నూతన భవనం నిర్మించాలని ఆరేళ్లుగా కోరుతున్నా... ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ఉస్మానియా హాస్పిటల్ లో స్థలం లేక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని, డాక్టర్లకు కూడా ఎలాంటి సౌకర్యాలు ఉండటం లేదని పేర్కొన్నారు. వైద్య విద్యార్థులకు సీట్లు పెంచుతున్నారు కానీ హాస్టల్స్ పెంచడం లేదని... ఇరుకు గదులలో తాము ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే వైద్యులకు రక్షణ లేకుండా పోయిందని... తరచూ వైద్యుల పై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా నూతన భవనం తో పాటు, తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి, పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ సమ్మెను ఉధృతం చేస్తామని జూడాలు హెచ్చరించారు.


## రాష్ట్రంలో త్వరలో కొత్త విద్యుత్ పాలసీ

**విశ్వంభర, హైదరాబాద్:** షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో మరమ్మతుకు గురైన యూనిట్ 4 పనులకు త్వరితగతిన టెండర్లు పిలవాలని డిప్యూటీ సీఎం , విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు జెన్కో అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ హైడెల్ పవర్ జనరేషన్ ప్రాజెక్టులో పర్యటించి మంత్రి జూపల్లి, ఇంధన శాఖ సిఎండి ఎస్. ఏ. ఎం. రిజ్వీతో పాటు స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఒక సీజన్లో మూడు నెలల్లో 60 కోట్ల విలువైన విద్యుత్తును ఇక్కడ ఉత్పత్తి చేస్తాం. రెండు కోట్ల రూపాయల ఖర్చు అయ్యే మరమ్మతు పనుల విషయంలో నిర్ణయం తీసుకోవడంలో జాతీయ మూలంగా 60 కోట్ల విలువైన విద్యుత్తును కోల్పోవడం అర్థం లేని పని అని డిప్యూటీ సీఎం తెలిపారు భట్టి విక్రమార్క అన్నారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ హైడెల్ జెన్కో ప్రాజెక్టు తెలంగాణకు గర్వకారణమైంది అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతికంగా ప్రసిద్ధిగాంచిన హిటాచి సంస్థ ఈ ప్రాజెక్టును నిర్మించింది అన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం పొందే అవకాశం ఈ ప్రాజెక్టులో ఉంది అన్నారు. ఈ ప్రాజెక్టులో చోటు చేసుకున్న 2020 నాటి దుర్ఘటన అందరికీ బాధాకరమైన సంఘటనగా పేర్కొన్నారు. నాటి షార్ట్ సర్క్యూట్ ప్రమాదం నుంచి యూనిట్ ని కాపాడే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి, అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు ఎప్పుడు ఏం కావాలన్నా ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మారిన కాలమాన పరిస్థితుల్లో ప్రతి పనికి, అభివృద్ధికి విద్యుత్ అనేది ప్రధాన ఆధారంగా ఉంది అని తెలిపారు. జెన్కో ప్రాజెక్టుకు సంబంధించి ఎంత త్వరగా నిర్ణయాలు తీసుకుంటే అంత మంచిదని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉత్పత్తి ఇక్కడ సాధించవచ్చు అని తెలిపారు. ఫలితంగా తక్కువ ధరలకే తెలంగాణ ప్రజలకు విద్యుత్తును అందుబాటులోకి తీసుకొచ్చే అవకాశం ఉంటుందన్నారు. గత ప్రమాదం నుంచి పని ప్రాంతాల్లో భద్రతాపరమైన చర్యలకు సంబంధించి ఏం నేర్చుకున్నారని అధికారులను ప్రశ్నించారు. అంగారక గ్రహం పై రాకెట్లు పంపిస్తున్న సమయంలో, గుండు సూది కదిలిన కనిపించే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పుడు ప్లాంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, వాటిని అధికారులు కనెక్ట్ చేసుకోవడం వంటివి చేపట్టాలన్నారు. ప్లాంట్ లోకి వచ్చే ప్రతి మనిషికి చిన్న ఆక్సిజన్ సిలిండర్ తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. భద్రతా చర్యల విషయంలో నిధులు సమస్య కాదు, మనిషి ప్రాణం విలువైనది, స్వీపర్ నుంచి సీఈ వరకు ఇదే సూత్రం వర్తిస్తుందన్నారు.

## జీర్ణించుకోలేని జీవన్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఇపుడు జరుగుతున్నదంతా సంప్రదాయ రాజకీయాలు కావు. దేశంలో ఏ రాష్ట్రంలో చూసినా నడుస్తున్నది పవర్ పాలిటిక్స్ మాత్రమే. పవర్ పాలిటిక్స్ అంటేనే ప్రత్యర్థిపార్టీలను గుక్కతిప్పుకోనీయకుండా చేయటమే. పదేళ్ళ అధికారంలో ఉన్నపుడు కాంగ్రెస్ నేతల విషయంలో కేసీయార్ ఇలాగే చుక్కలుచూపించారు. పైగా రేవంత్‌కేసీయార్ బద్ధవిరోధులు. ఈ విషయాలన్నీ తెలిసికూడా జీవన్ బీఆర్ఎస్ ఎంఎల్ఏల చేరికలను తీవ్రంగా వ్యతిరేకించటమే విచిత్రంగా ఉంది. బీఆర్ఎస్ ఎంఎల్ఏలను లాక్కుని కారుపార్టీని వీక్ చేసి కేసీయార్ ను రేవంత్ దెబ్బకొట్టకపోతే ఇదే పనిని అవకాశం దొరికినపుడు కేసీయార్ చేస్తారు. ఆ విషయం కూడా జీవన్ మరచిపోయి రేవంత్ ను బహిరంగంగా వ్యతిరేకించటమే తాజా రాజకీయంలో ట్విస్టు.



## యూని క్యూ కార్యాలయం ప్రారంభం

**విశ్వంభర, ఎల్బీనగర్ :** యూని క్యూ కార్యాలయం సోమవారం చైతన్యపురిలోని మెట్రోపిలర్ నెం.1560 వద్ద బాదం కాంప్లెక్స్ రెండవ అంతస్తులో, వీ3 న్యూస్ కార్యాలయం పక్కన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా యూని క్యూ ఎండీ జీ సైదిరెడ్డి మాట్లాడుతూ.. తాము గృహరుణాలు, కారు, పర్సనల్ లోన్స్, ఎడ్యుకేషన్ రుణాలను అందించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు తమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూని క్యూ సిబ్బంది నాగలక్ష్మి, కొటేశ్వరీ, విష్ణు ప్రియ, గోవర్ధన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మహేష్ రెడ్డి, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

# నేనంటే నేనే!

(మొదటి పేజీ తరువాయి)

బీసీ నేతలైతే, అరుణ, రఘు ఓసీ సామాజికవర్గాలకు చెందిన వాళ్ళు.

**రేసులో ఉన్న నాయకులు వీళ్లే..**

ఎంపీల సంగతిని పక్కనపెట్టేస్తే ఎంఎల్ఏలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, మాజీ ఎంఎల్సీ ఎన్. రామచంద్రరావు, మాజీ ఎంఎల్ఏ చింతల రామచంద్రా రెడ్డి, యెండల లక్ష్మీనారాయణ, సీనియర్ నేతలు చింతా సాంబమూర్తి, జీ మనోహర్ రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు అధ్యక్షరేసులో ఉన్నారు. వీళ్ళంతా తమస్థాయిలో ఢిల్లీలోని పరిచయాలను ఉపయోగించుకుని ఎవరి ప్రయత్నాల్లో వాళ్ళున్నారు. అధ్యక్షపదవికి ఎందుకింత పోటీ పెరిగిపోతోంది ? ఎందుకంటే రెండు కారణాలు కనబడుతున్నాయి. మొదటిదేమో కేంద్రంలో అధికారంలో ఉండటం. ఇక రెండో కారణం ఏమిటంటే తొందరలోనే బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేస్తుందనే ప్రచారం. పోయిన ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుచుకున్న సీట్లు 8. ఈమధ్యనే జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పార్టీకి వచ్చిన సీట్లు 8. అసెంబ్లీ సీట్లలో బలం పెంచుకున్న బీజేపీ అదే విధంగా పార్లమెంటు ఎన్నికల్లో కూడా సత్తాచాటింది.

**గులాబీ పార్టీని భర్తీ చేసేలా కమలం పార్టీ వ్యూహం**

అలాగే 2019లో నాలుగు ఎంపీ సీట్లను గెలుచుకున్న పార్టీ 2024 ఎన్నికల్లో రెట్టింపు సంఖ్యలో అంటే ఎనిమిది సీట్లను గెలుచుకున్నది. ఏ రకంగా చూసినా బీజేపీ బలం




పెరుగుతోందనటంలో సందేహంలేదు. ఇదే సమయంలో పదేళ్ళు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ దెబ్బతినేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత పార్లమెంటు ఎన్నికల్లో పూర్తిగా కుదేలైపోయింది. మొత్తం 17 పార్లమెంటు సీట్లలో ఒక్కటంటే ఒక్కటి కూడా గెలుచుకోకపోవటంతో కేసీయార్ నాయకత్వంపై అనుమానాలు పెరిగిపోతున్నాయి. అందుకనే ప్రజాప్రతినిధులు కాంగ్రెస్, బీజేపీల్లోకి వెళ్ళిపోతున్నారు. ప్రధాన ప్రతిపక్షం కారుపార్టీ బాగా దెబ్బతినేస్తుండటంతో ఆ స్థానాన్ని భర్తీచేయాలని బీజేపీ నేతలు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే ఐదేళ్ళు బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయంగా పార్టీని బలోపేతం చేస్తే 2028 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రావటం ఖాయం అనే ఊపు కమలంపార్టీ నేతల్లో పెరిగిపోతోంది.

### బీఆర్ఎస్ కేడర్‌పై ఫోకస్

పార్టీని బలోపేతం చేయటంలో భాగంగానే ముందు కిందస్థాయి క్యాడర్ పై గురిపెట్టింది. బీఆర్ఎస్ ఎంఎల్ఏల్లో అత్యధికులు కాంగ్రెస్ లో చేరటానికే ఆసక్తి చూపుతున్నారు. కారుపార్టీ తరపున గెలిచిన 38 మందిలో ఇప్పటికి ఐదుగురు ఎంఎల్ఏలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకటరావు, పోచారం శ్రీనివాసరెడ్డి, సంజయ్ కుమార్ కాంగ్రెస్ లో చేరారు. ఇంకా చాలామంది కాంగ్రెస్ లో చేరబోతున్నట్లు జరుగుతున్న ప్రచారం అందరికీ తెలిసిందే. ఎంఎల్ఏలు ఎలాగూ తమ పార్టీలో చేరరని అనుకున్న బీజేపీ నేతలు బీఆర్ఎస్ కిందస్థాయి నేతలను చేర్చుకోవటంపైన ఎక్కువగా దృష్టిపెట్టింది. మున్సిపాలిటీ స్థాయిలోని కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థాయి సెకండ్ గ్రేడ్ నేతలను చేర్చుకుంటున్నది. ద్వితీయశ్రేణి నేతలే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపుకు పనిచేస్తారని బీజేపీ నాయకత్వం నమ్ముతోంది. ఇలాంటి కారణాల వల్లే తెలంగాణా అధ్యక్షపదవికోసం పార్టీలో విపరీతమైన పోటీ పెరిగిపోతోంది.

## ఢిల్లీలో సీఎం రేవంత్ బిజీ.. బిజీ

**విశ్వంభర, ఢిల్లీ:**

హైదరాబాద్‌లో రహదారుల విస్తరణ, ఇతర అవసరాలకు రక్షణ శాఖ భూములు 2,500 ఎకరాలను తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం కలిశారు. రావిరాల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వానికి చెందిన 2,462 ఎకరాల భూములను ఇమారత్ పరిశోధన కేంద్రం (ఆర్‌సీఐ) ఉపయోగించుకుంటున్న విషయాన్ని ముఖ్యమంత్రి రక్షణ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంతో పాటు నగరం చుట్టు పక్కల ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, ఫ్లై ఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రక్షణ శాఖ భూములు తమకు అవసరమని, ఆర్‌సీఐ రాష్ట్ర ప్రభుత్వ భూములు వినియోగించుకుంటున్నందున రక్షణ శాఖ భూములు 2,450 ఎకరాలు తమకు అప్పగించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, రక్షణ శాఖ భూముల పరస్పర బదిలీకి అంగీకరించాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. వరంగల్ నగరానికి గతంలోనే సైనిక్ స్కూల్ మంజూరు చేసినా గత రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణపరంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. వరంగల్ సైనిక్ స్కూల్ అనుమతుల గడువు ముగిసినందున అనుమతులు పునరుద్ధరించాలని లేదా తాజాగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ముఖ్యమంత్రి వెంట నాగర్‌కర్నూల్, ఖమ్మం, మహబూబాబాద్, జహీరాబాద్, భువనగిరి, నల్గొండ, వరంగల్, పెద్దపల్లి ఎంపీలు మల్లు రవి, రామసహాయం రఘురాం రెడ్డి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, కడియం కావ్య, గడ్డం వంశీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి ఉన్నారు.



**2.70 లక్షల ఇళ్లను మంజూరు చేయండి**

202425 ఆర్థిక సంవత్సరంలో బీఎల్‌సీ మోడల్‌లో తెలంగాణకు 2.70 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నిరుపేదలకు వారి సొంత స్థలాల్లో 25 లక్షల ఇళ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. కేంద్ర మంత్రి ఖట్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఆయన నివాసంలో కలిశారు. రాష్ట్రంలో తాము నిర్మించదల్చిన 25 లక్షల ఇళ్లలో 15 లక్షలు ఇళ్లు, పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోకి వస్తాయని, వాటిని లబ్ధిదారు ఆధ్వర్యంలోని వ్యక్తిగత ఇళ్ల నిర్మాణం (బీఎల్‌సీ) పద్ధతిలో నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. ప్రధానమంత్రి ఆవాస యోజనను (పట్టణ)పీఎంఏవై (యూ) కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకం తీసుకున్నందున, 202425 సంవత్సరానికి పీఎంఏవై (యూ) కింద మంజూరు చేసే ఇంటి నిర్మాణ వ్యయం నిధులు పెంచాలని, రాష్ట్రంలో తాము నిర్మించే ఇళ్లను పీఎంఏవై (యు) మార్గదర్శకాల ప్రకారం నిర్మిస్తామని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. పీఎంఏవై (యూ) కింద ఇప్పటి వరకు తెలంగాణకు 1,59,372 ఇళ్లు మంజూరు చేసి రూ.2,390.58 కోట్లు గ్రాంటు కింద ప్రకటించారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అయితే ఇందులో ఇప్పటి వరకు కేవలం రూ.1,605.70 కోట్లు మాత్రమే విడుదల చేశారని, మిగతా నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద చేపట్టే పనులు పూర్తి కానుందున మిషన్ కాల పరిమితిని 2025, జూన్ వరకు పొడిగించాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద తెలంగాణలో వరంగల్, కరీంనగర్ నగరాల్లో పనులు చేపట్టినట్లు ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ కింద వరంగల్‌లో 45 పనులు పూర్తయ్యాయని, రూ.518 కోట్ల వ్యయంతో చేపట్టిన మరో 66 పనులు కొనసాగుతున్నాయని, కరీంనగర్‌లో 25 పనులు పూర్తయ్యాయని, రూ.287 కోట్ల వ్యయంతో చేపట్టిన 22 పనులు కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. స్మార్ట్ సిటీ మిషన్ కాల పరిమితి ఈ ఏడాది జూన్ 30తో ముగుస్తోందని, ప్రజా ప్రయోజనార్థం పనులు ముగిసే వరకు మిషన్ కాలపరిమితిని మరో ఏడాది పొడిగించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

## నీట్ కుంభకోణంపై చర్చ జరగాలి

**విశ్వంభర, హైదరాబాద్:**

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) నుంచి వైదొలిగి స్వతంత్రంగా మెడికల్ అడ్మిషన్లు నిర్వహించేందుకు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని సీనియర్ బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీ వినోద్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన వినోద్... నీట్ యూజీ స్కామ్ దేశంలోనే అతి పెద్దదని, కోట్లాది రూపాయలు చేతులు మారాయని ఆరోపించారు. తెలంగాణలో గొర్రెల పంపిణీ పథకంపై కూడా విచారణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని మోహరించిన అధికార బీజేపీ... ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో 24 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల జీవితాలపై దుష్ప్రభావం చూపుతున్న ప్రశ్నపత్రం లీకేజీని పట్టించుకోలేదని విమర్శించారు. "ఈ సమస్యపై ఈడీ ఎందుకు మౌనంగా ఉంది? ఈడీ ఏమి చేస్తుందో ప్రశ్నించడానికి ప్రజలు సుప్రీంకోర్టును ఆశ్రయించవలసి వచ్చింది" అని ఆయన ప్రశ్నించారు. "తెలంగాణలో పదవ తరగతి పరీక్ష పేపర్ లీకేజీ అయిందని ఆరోపించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ విద్యార్థులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నీట్ 24 లక్షల మంది రాశారు.. వారందరికి లక్ష రూపాయల పరిహారం ఇవ్వాలని బండి ఎందుకు డిమాండ్ చేయరు అని నిలదీశారు. ఉత్తర భారత రాష్ట్రాల విద్యార్థులు తెలంగాణలోని అత్యున్నత వైద్య కళాశాలల్లో సీట్లు పొందుతున్నారని, స్థానిక




విద్యార్థులు వెనుకబడి ఉన్నారని, వ్యవస్థాగత అవినీతిని సూచిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. "డబ్బు ఉన్నవారు పరీక్ష పేపర్లు కొంటున్నారు, అయినప్పటికీ బిజెపి తమది సుపరిపాలన అని చెబుతోంది" అని విమర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న సమావేశాల్లో నీట్ కుంభకోణంపై పార్లమెంటులో చర్చ జరగాలని వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై స్పందించాలని ఎన్‌డీఏ మిత్రపక్షం, ఏపీ సీఎం చంద్రబాబును కోరారు. పరీక్ష నిర్వహణలో కేంద్రం పూర్తిగా విఫలమైందని, పేపర్లను లీక్ చేసిన వారికి మరణశిక్షతో సహా పరీక్షల అక్రమాలకు వ్యతిరేకంగా కఠినమైన చట్టాలను తీసుకురావాలని పిలుపునిచ్చారు. "నీట్‌ను రద్దు చేసి, సంబంధిత రాష్ట్రాలు మెడికల్ అడ్మిషన్లు నిర్వహించాలి" అని డిమాండ్ చేస్తూ... ఎంసెట్‌ను దాదాపు 60 సంవత్సరాల పాటు ఎక్కువ సమస్యలు లేకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించారని గుర్తు చేశారు. నీట్ నుంచి రాష్ట్రం బయటకు రావాలి. ఇందుకోసం రేవంత్ మంచి న్యాయవాదిని సుప్రీం కోర్టులో నియమించి రాష్ట్రం తరపున వాదనలు వినిపించాలి. రాష్టంలో ఎంసెట్ 60 ఏండ్లుగా బాగా జరిగింది.. అదే పద్ధతి మళ్ళీ రావాలి అని మాజీ ఎంపీ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు


**విశ్వంభర, హైదరాబాద్:** హస్తం పార్టీలో మళ్లీ ఆపరేషన్ ఆకర్ష్ మొదలైంది.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి వలసలు మొదలయ్యాయి.. మొదట్లో ముగ్గురు గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరగా.. ఇటీవల మాజీ అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. తాజాగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు.. అయితే కేసీఆర్ కుటుంబానికి సాన్నిహిత్యంగా ఉండే వారే పార్టీను వాడుతుండటం.. ప్రస్తుత ఫిరాయింపు రాజకీయ పరిస్థితులపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. చరిత్ర పునరావృతం అవుతుంది... అంటూ కాంగ్రెస్ ప్రోత్సహిస్తున్న పార్టీ ఫిరాయింపుల అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు. అధికారంలో ఉన్నామని వీర్రవీగుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని కాంగ్రెస్ కు హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల శక్తి ఎప్పుడు అధికారంలో ఉన్నవారి కన్నా కూడా బలంగా ఉంటుందని కేటీఆర్ అన్నారు.. 200406 సమయంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అనేక సార్లు పార్టీ ఫిరాయింపులకు పాల్పడింది. అప్పుడు కూడా బీఆర్ఎస్ ఇబ్బందులను ఎదుర్కొంది. ఇలాంటి కష్టసమయాలు బీఆర్ఎస్‌కు కొత్త కాదు. కానీ కాంగ్రెస్ పార్టీ నీతి లేని వ్యవహారాలపై తెలంగాణ ప్రజలు ఆందోళనను ఉధృతం చేశారు. ఈ దెబ్బకు కాంగ్రెస్ పార్టీ తల వంచక తప్పలేదన్నారు. ప్రస్తుతానికి తమ పార్టీ ఎమ్మెల్యేల ను ఫిరాయింపులకు పాల్పడేందుకు ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ పార్టీకి మళ్లీ కచ్చితంగా ప్రజలు బుద్ధి చెబుతారు. చరిత్ర పునరావృతం అవుతుంది.. అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

**ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేసింది మీరు కాదా..?**

బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ స్పందించారు. పార్టీలో చేరికల మీద బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మట్లాడుతున్నారు.. భట్టి.. ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేసింది మీరు కాదా..? అంటూ ప్రశ్నించారు. శాసనమండలిలో నా ప్రతిపక్ష నేత హోదా మీరు తొలగించలేదా..? అంటూ ప్రశ్నించారు. తమ పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను చేర్చుకుంది మీరు కాదా..? అంటూ పేర్కొన్నారు. బీఆర్ఎస్ కు పార్లమెంట్ ఎన్నికల్లో 8 సీట్లలో డిపాజిట్ పోయిందని ..ఇప్పుడు అనర్హత వేటు గురించి మట్లాడుతున్నారంటూ షబ్బీర్ అలీ ఫైర్ అయ్యారు.

## హైకోర్టును ఆశ్రయించిన మాజీ సీఎం కేసీఆర్

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో రైల్ రోకో సందర్భంగా తనపై నమోదైనటువంటి కేసు విషయమై ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ప్రజాప్రతినిధుల కోర్టులో తనపై ఉన్న కేసును కొట్టివేయాలంటూ అందులో కోరారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2011 అక్టోబర్ లో రైల్ రోకోకు కేసీఆర్ పిలుపునిచ్చారంటూ మల్కాజిగిరి పోలీసులు కోర్టుకు నివేదిక అందజేశారు. దీంతో పలు రైళ్ల రాకపోకలకు, రైల్వే ఉద్యోగులకు ఆటంకం కలిగించారని ఆ నివేదికలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన కేసీఆర్.. తాను ఎలాంటి రైల్ రోకోకు పిలుపునివ్వలేదంటూ పిటిషన్ లో పేర్కొన్నారు. ఎవరో ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కేసులు నమోదు చేశారన్నారు. ఈ కేసులో తనను 15వ నిందితుడిగా చేర్చారని.. అసలు తాను రైల్ రోకోలోనే పాల్గొనలేదంటూ అందులో వివరించారు. రైల్ రోకో ఘటన తరువాత మూడేళ్లకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని, ఈ కేసుకు ఎలాంటి బలం లేదని తెలిపారు. అందువల్ల కేసును కొట్టేయాలంటూ విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ పిటిషన్ పై మంగళవారం రాష్ట్ర హైకోర్టు విచారణ జరపనున్నట్లు తెలుస్తోంది. త్వరలో సుప్రీంకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ టికెట్ పై గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరిన విషయం తెలిసిందే. ప్రజల తీర్పునకు వ్యతిరేకంగా తమ పార్టీని వీడిని కాంగ్రెస్ లో చేరుతున్న ఎమ్మెల్యేల అనర్హత విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



# న్యాయవాది రవికుమార్‌కు నివాళి

## రవి లేని లోటు ఎవరూ పూడ్చలేనిది : శ్రవణ్ దాసోజు



**విశ్వంభర, నకిరేకల్ :** దాదాపు 40 సంవత్సరాలుగా నాకు అత్యంత సన్నిహిత మిత్రుడు, ఆత్మీయుడు, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన నకిరేకల్లు వాస్తవ్యుడు హైకోర్టు ప్రస్తుత న్యాయవాది శ్రీ ఎస్. రవికుమార్ క్యాన్సర్ మహమ్మారి బారిన పడి దుర్మరణం చెందడం అత్యంత బాధాకరమని, ప్రియ మిత్రుడు రవి ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, సహచర ఆత్మీయ మిత్రులకు డా. శ్రవణ్ దాసోజు హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేశారు. తన జీవితంలో ఎన్నో కష్టతరమైన సందర్భాలలో తనకు అండగా ఉన్న రవి లేని లోటు ఎవరూ పూడ్చలేనిదని ఆవేదన చేందారు. స్వతహాగా మధ్యతరగతి కుటుంబంలో నుంచి వచ్చిన రవి, ఉన్నతమైన సామాజిక విలువలతో తన జీవితాన్ని గడిపాడు. రవిలో నిరంతరం సమాజానికి ఏదో చేయాలని, పేద ప్రజలకు అండగా ఉండాలని తపన ఉండేది. అందుకే ఎంఎ, ఎల్ఎల్‌బీ చదివి అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్న సందర్భంలో 2004లో నకిరేకల్ మేజర్ గ్రామపంచాయతీకి సర్పంచ్‌గా ఎన్నికై, గతంలో ఎన్నడూ లేని విధంగా అద్భుతమైన అభివృద్ధిని సాధించాడు. రవి చేసిన సేవలను గుర్తించి, ఆనాటి ప్రభుత్వం ఉత్తమ సర్పంచ్‌గా రవిని సాదర పురస్కారంతో గౌరవించింది. తదనంతరం గౌరవ చిరంజీవి సామాజికన్యాయ సిద్ధాంతంతో ప్రారంభమైన ప్రజారాజ్యం పార్టీ పట్ల ఆకర్షితులై, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో తమతో కలిసి రవి క్రియాశీల బాధ్యతలు నిర్వర్తించారని గుర్తు చేసుకున్నారు. తదనంతరం తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. హైకోర్టు న్యాయవాదిగా, బీఆర్ ఎస్ పార్టీ లీగల్ విభాగంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. రవి స్వతహాగా క్షేత్రస్థాయి అవగాహనతో పలు అంశాల పట్ల పరిపూర్ణమైన అవగాహన ఉన్న మేధావి. తన అభ్యుదయ ఆలోచనలతో, ఆదర్శవంతమైన ఆచార వ్యవహారాలతో అనేకమందికి స్ఫూర్తి దాయకంగా నిలబడ్డాడు. ఈ దేశానికి రాజకీ య స్వాతంత్ర్యం వచ్చినా, సామాజిక, ఆర్థిక స్వాతంత్రం ఇంకా రాలేదని ఆవేదనతో, భారత దేశ భవిష్యత్తు నిర్మాణానికి యువత కర్తవ్యాన్ని ఉద్బోధిస్తూ.. ఒకానొక సందర్భం లో రవి మాట్లాడిన ఈ చిన్న వీడియోను చూస్తే, రవి వ్యక్తిత్వం అర్థమవుతుంది. ప్రియ మిత్రుడు రవి ఈరోజు మన మధ్యలో లేకపో యినా.. రవి ఆలోచనలు, ఆదర్శాలు ఎల్లప్పు డూ శిరోధార్యంగా భావిస్తామని తెలియజేస్తూ.. అశ్రు నివాళులర్పించారు డా శ్రవణ్ దాసోజు.



# కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు

## ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**విశ్వంభర, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ బాలాజీనగర్ గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ కబ్జాకు గురియై వర్షం కురిసి నీరు ఇళ్లల్లోకి మరియు రోడ్డు మీదకి వస్తున్నాడంతో స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురి అయ్యి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సోమవారం ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్య లేకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కబ్జాలకు పాల్పడుతున్న ఎవరినైనా.. ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునే ప్రసక్తి లేదని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట స్థానిక డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, ,డివిజన్ నాయకులు, కార్యకర్తలు కాలనీవాసులు తదితరులు ఉన్నారు.



# నీట్ పరీక్షను రద్దు చేసి మరల నిర్వహించాలి

## నేనావత్ కుమార్ నాయక్

**విశ్వంభర, చింతపల్లి :** ఇటీవల విడుదలైన నీట్ ఫలితాలలో అవకతవకలు జరిగిన కారణంగా అనేక మంది విద్యార్థులు ఆందోళనతో ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్ష రద్దు చేసి మరల నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్మెల్సీ వెంకట్ బాల్మూర్ పిలుపు మేరకు దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ సూచన మేరకు ఎన్ఎస్‌యూఐ చింతపల్లి మండల అధ్యక్షులు రాజేష్ ఆధ్వర్యంలో చింతపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమానికి నియోజకవర్గం అధ్యక్షుడు నేనావత్ కుమార్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా మోడీ ప్రభుత్వ మరియు NTA సంస్థ దిష్టి బొమ్మను దహనం చేసారు అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వనికి పార్టీల పొత్తులపై ఉన్న శ్రద్ధ ,విద్యార్థుల భవిష్యత్తుపై లేదని, జరిగిన ఆత్మహత్యలకు ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వం మరియు NTA(National Testing Agency) కారణం అని, విద్యార్థులకు సరియైన న్యాయం చేయకపోతే ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ పామర్, పవన్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు గోవిందు, రవి కుమార్, కొండల్, కోటేష్, జావీద్, నల్ల సతీష్, వంశీగౌడ్, బన్నీ, సాయి, శివ, సాత్విక్, అస్లాం, గౌస్, సోనూ, అష్షు తదితరులు పాల్గొన్నారు.



# తలకొండపల్లి రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

**విశ్వంభర, ఆమనగల్లు :** తలకొండపల్లి మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు నత్త నడకన సాగుతున్నాయని బీజేవైఎం జిల్లా పబ్లిక్ సెల్ కన్వీనర్ పోతుగంటి మహేష్ అన్నారు. గత నరేంద్ర మోడీ హయాంలో కేంద్ర ప్రభుత్వం ఈ రోడ్డుకు రూ.37 కోట్లు మంజూరు చేసిందన్నారు. తలకొండపల్లి ఆమనగల్లు రోడ్డు విస్తరణ పనులు రెండు సంవత్సరాల నుంచి గుత్తేదారు పట్టించుకోకుండా రోడ్డు విస్తరణ పనులుగాలికి వదిలేసారని, ఇంకా ఎన్ని సంవత్సరాలకు పూర్తి చేస్తారని దుయ్యబట్టారు. ప్రస్తుతం స్వామి వివేకానంద చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు మాత్రమే పూర్తి చేయడం జరిగిందని బస్ స్టాండ్ నుంచి లింగాయకుంట వరకు ఇంకా పనులు పూర్తి కాలేదని ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో తెలపాలని లేదంటే భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి ఆందోళన చేస్తామని అన్నారు. కావున వెంటనే ఈ రోడ్డు విస్తరణ పనులు తొందరగా పూర్తిచేయాలని కోరారు.





# మీడియా వార్

## వేమూరి వర్సెస్ నూకారపు

**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో మరో కొత్త మీడియా వార్ ప్రారంభమైంది. ఆంధ్రజ్యోతికి, సాక్షికి మధ్య వార్ సహజమైందే. కానీ ఈసారి ఆంధ్రజ్యోతికి, సూర్య దినపత్రికకు మధ్య చేటు చేసుకుంది. సూర్య దినపత్రిక అధినేత నూకారపు సూర్య ప్రకాశరావును మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేసినట్లు ఆంధ్రజ్యోతి ఓ వార్తను ఇచ్చింది. దీనిపై నూకారాపు సూర్యప్రకాశరావు తీ వ్రంగా మండిపడ్డారు. ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణను తప్పు పడుతూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. సూకారాపు సూర్యప్రకాశ్ రావు ప్రకటన సూర్య దినపత్రికలో అచ్చయింది. గురువారం తాను సూర్య ప్రధాన కార్యాలయంలో ఉండగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతిలో వచ్చిన స్క్రోలింగ్, ఆ తర్వాత శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 2001 నాటి కేసుకు సంబంధించి ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్‌లో మహారాష్ట్ర పోలీసులు హైదరాబాద్‌కు వచ్చి అరెస్టు చేశారని రాసిన వార్త తనను విస్మయానికి గురిచేసిందని సూర్య ప్రకాశరావు అన్నారు. తాను శుక్రవారం వరకూ హైదరాబాద్‌లోనే ఉన్నానని, కనీస వాస్తవాలు, విచారణ చేయకుండా వ్యక్తిత్వ హననానికి పాల్పడటం నీతిమాలిన జర్నలిజం కాదా? అని ప్రశ్నించారు.ఒక వ్యక్తిని పక్క రాష్ట్రాలకు చెందిన పోలీసులు అరెస్టు చేసినప్పుడు సంబంధిత పోలీసుస్టేషన్, లేదా కమిషనర్ లేదా ఎస్పీ అనుమతి తీసుకుని వస్తారన్న కనీస స్పృహ, పరిజ్ఞానం లేకుండా వార్తను ప్రచురించడం, పత్రిక నడపటం రాధాకృష్ణకే చెల్లిందని వ్యాఖ్యానించారు. 'ఇదేనా నీ జర్నలిజం? ఇదేనా నీ సంస్కారం, కుట్ర, కుయుక్తులతో ఎదుటివారిపై బురద చల్లడమేనా నీకు తెలిసిన జర్నలిజం? గతంలో బ్యాంకు కేసులో అరెస్టయినప్పుడు లక్షన్నర రూపాయల కుట్ర కేసులోనూ ఇలాగే వంకర రాతలు, విషపు వార్తలూ రాశావు. రెండుకోట్ల కుంభ కోణమని అబద్ధపు ప్రచారం చేశావు. అప్పుడు నేను కూడా కోర్టు తీర్పును గౌరవించి మౌనం వహించా. ఇప్పుడు మళ్లీ నాపై విష ప్రచారానికి ఒడిగడుతున్నావు. నేను ఆఫీసులో, హైదరాబాద్‌లోనే ఉన్నా మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారని కుట్రపూరిత వార్త రాశావు. ఇకనయినా ఇలాంటి నీతిమాలిన, సిగ్గుమాలిన, అనైతిక వార్తలు మానుకో. వ్యక్తిగా, నైతికంగా, సంస్కార యుతంగా ఎదగడం నేర్చుకో. ఇకపై నీ ఆటలు సాగవు. నీ బ్లాక్‌మెయిల్ జర్నలిజం మానుకుని, ప్రజాస్వామ్య, పత్రికాస్వామ్య పద్ధతులు పాటించు' అని నూకారపు విరుచుకుపడ్డారు. తప్పుడు రాతలు, నీతిబాహ్యమైన వార్తలతో బడుగువర్గాల శత్రువుగా మిగిలిపోయిన నీకు బడుగులు బుద్ధిచెప్పే రోజు ఇంకెంతో దూరంలో లేదన్నారు. ఇకనయినా రాధాకృష్ణ బుద్ధిగా మసలుకోవాలని, ఎదుటివారి తప్పులు ఎంచే సమయంలో తన తప్పులూ ఎంచుకోవాలని సూచించారు.ఆంధ్రజ్యోతి వార్త తనను తీవ్రంగా కలచివేసిందని, అమానుషంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడటం అనాగరికమని, ఇది మనుషులు చేసే పనికాదని నూకారపు పేర్కొన్నారు.

# వైన్స్ పర్మిట్ రూం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి



**విశ్వంభర, అంబర్‌పేట్ :** అంబర్‌పేట్ లోని రఘునాథ్‌నగర్‌లో త్రిషుల్ వైన్స్ ని ఇండ్ల మధ్యలో పెట్టడం ద్వారా చుట్టూ ఉన్న కాలనీ వాసులకి తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. త్రిషుల్ వైన్స్ గవర్నమెంట్ రూల్స్ కి విరుద్ధంగా 2500 లో, పర్మిట్ రూం ఏర్పాటు చేసి, టేబుల్స్ మరియు చైర్స్ వేసి జనతా బార్‌లాగా, ఐరన్ గ్రిల్స్ పెట్టి, చుట్టూ ఉన్న ఇండ్లలోకి విపరీతమైన శబ్దాలు, ధూమపాన పొగ, మూత్రల దుర్వాసనను వదులుతూ మా పిల్లలకి, పెద్దలకి, వృద్ధులకి అనారోగ్యాలు కల్గించే విధంగా ఉందని, దీనిపై కాచిగూడ అబ్కారి అధికారులు, హైదరాబాద్ కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకొని పర్మిట్ రూంని మూసి వేయాలని రఘునాథ్‌నగర్ కాలనీ వాసులు కోరుతున్నారు. సోమవారం ఉదయం జరిగిన ధర్నాలో పాల్గొన్న స్థానికులు లత... జనవాసాలను ఆనుకొని వైన్ షాపుల పర్మిట్ రూంను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేయడం చాలా బాధాకరమని అన్నారు. సమీపంలో మందిరం స్థానికుల సమస్య తెలుసుకోకుండానే ఎక్సైజ్ పోలీసు వారు పర్మిషన్ ఇవ్వడం చాలా విచారకరమని తెలిపారు. కాలనీ వాసి లక్ష్మి మాట్లాడుతూ.. ఇండ్లకు అనుకొని ఇలాంటి వ్యాపారాలను జరపడం చాలా బాధాకరమని, వైన్స్ నిర్వాహకులకు కుటుంబం ఉంది వారికి కుటుంబీకులు, బంధువులు ఉంటారు వారి వద్ద ఇలాంటి సమస్య వస్తే వారు ఎలా స్పందిస్తారో వారి విజ్ఞతకు వదిలేస్తున్నాం.






# నిబద్ధత గల నేత వీపీ సింగ్

## నేడు విశ్వనాథ ప్రతాప్ సింగ్ జయంతి

భారత దేశ రాజకీయాలలో తనదంటూ ప్రత్యేక ముద్ర వేసిన నేత విశ్వనాథ్ ప్రతాప్ సింగ్. ప్రధానమంత్రి కావడానికి ముందు అవినీతిపై పోరాడటానికి అధికారాన్ని త్యాగం చేసిన ఆదర్శ నేత ఆయన. వీపీ సింగ్ అవినీతిని జాతీయ సమస్యగా మార్చారు. వివాదాస్పదమైన బోఫోర్స్ తుపాకీ ఒప్పందంపై రాజీవ్ గాంధీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టారు. అవినీతికి వ్యతిరేకంగా తన పోరాటాన్ని వీధుల్లోకి తీసుకెళ్లడానికి కేబినెట్ నుంచి రాజీనామా చేశారు. హెచ్‌డీడబ్ల్యూ జలాంతర్గామి ఒప్పందానికి సంబంధించిన విచారణపై అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీతో విభేదాల కారణంగా తాను రాజీనామా చేశానని 2005 లో శేఖర్ గుప్తాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. రక్షణ ఒప్పందాలలో అవినీతి 1989 లోక్ సభ ఎన్నికలల్లో కేంద్ర సమస్యగా మారింది. అంతేగాక 1990 ఆగస్టులో, వీపీ సింగ్ పార్లమెంటులో చాలాకాలంగా మరచిపోయిన మండల్ కమిషన్ నివేదిక సిఫారసులను ప్రవేశపెట్టి, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో ఓబీసీ సమాజ రిజర్వేషన్లకు మార్గం సుగమం చేసిన ప్రధానిగా చరిత్రలో మిగిలి పోయారు. వీపీ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన జీవితంలో కొన్ని ముఖ్యాంశాలను గుర్తు చేసుకునే చిరు ప్రయత్నం.



విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ (జూన్ 25, 1931 నవంబరు 27, 2008) భారతదేశ ఏడవ ప్రధాన మంత్రిగా 1989 నుంచి 1990 వరకు పనిచేశారు. ఆ సమయంలోనే మండల్ కమిషన్ నివేదిక ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలలో వెనుక బడిన కులాలకు 27% రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయించారు.

వీపీ సింగ్ 1931 జూన్ 25 న మండా ఎస్టేట్ ను పరిపాలించిన రాజపుత్ర జమీందారీ కుటుంబంలో జన్మించారు. అయన డెహ్రాడూన్‌లోని కలనల్ బ్రౌన్ కేంబ్రిడ్జ్ స్కూలులో అలహాబాద్, పూణె విశ్వవిద్యాలయాలలో చదివారు. రాజస్థాన్‌లోని డియోగర్ మడారియా రాజు కుమార్తె అయిన సితా కుమారిని 1955 జూన్ 25 న వివాహం చేసుకున్నారు. ఇది పెద్దలు కుదిర్చిన పెళ్ళి. ఈ వివాహం జరిగినప్పుడు ఆయనకు 24 సంవత్సరాలు, ఆమెకు 18 సంవత్సరాలు. 1969లో ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర శాసన సభకు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున సభ్యుడయ్యారు. 1971లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1974లో ప్రధానమంత్రి ఇందిరా గాంధీ మంత్రి వర్గంలో వాణిజ్య శాఖ ఉపమంత్రిగా బాధ్యతలు స్వీకరించాడు. 1976 నుంచి 1977 వరకు వాణిజ్య శాఖామంత్రిగా తన సేవలనందించారు.

1980లో జనతా పార్టీ తరువాత ఇందిరా గాంధీ మరల ఎన్నుకో బడినప్పుడు, ఇందిర ఆయన్ని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిని చేసింది. అలా 1980-82 వరకు పని చేశారు. 1983లో తిరిగి వాణిజ్య మంత్రి పదవిని పొందారు. 1984 సార్వత్రిక ఎన్నికల తరువాత భారతదేశ 10వ కేబినెట్‌లో ఆర్థిక మంత్రిగా రాజీవ్ గాంధీచే నియమితు డయ్యారు. బహుశా గతంలో కాంగ్రెస్ పార్టీకి ఆర్థిక సహాయాన్ని అందించిన పారిశ్రామిక వేత్తలపై ఆదాయపు పన్ను శాఖ దాడులు జరుపుతున్నందున ఆ పదవి నుంచి తొలగించ బడ్డారు. ఆర్థిక మంత్రిత్వ శాఖనుంచి ప్రక్కకు తప్పించినప్పటికీ, సింగ్‌కు దేశ ప్రజలలో ఉన్న జనాదరణ కారణంగా 1987 జనవరిలో రక్షణ మంత్రి బాధ్యతలను అప్పగించారు. నాలుగు వందల 155ఎంఎం శతఘ్నులను స్వీడిష్ కంపెనీ ఏబీ బోఫోర్స్ కంపెనీ నుంచి 1437 కోట్ల రూపాయల ఖర్చుతో కొనడానికి ఒప్పందం కుదిరిన విషయంలో, భారతదేశం, స్వీడన్ ప్రభుత్వాల్లోని పెద్దల మధ్య జరిగిన అవకతవకలపై దృష్టి సారించారు. ఈ అంశం రాజీవ్ గాంధీ ప్రభుత్వాన్ని కుదిపేసింది. దానిపై దర్యాప్తు చేయించడానికి ముందే ఆయనను క్యాబినెట్ నుంచి తొలగించారు. ఫలితంగా సింగ్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి, లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశాడు. 1989 ఎన్నికలలో రాజీవ్ గాంధీని పదవినుంచి తొలగించటానికి, ఆయనకు వ్యతిరేకంగా వామపక్షాలు, భారతీయ జనతా పార్టీతో కలసి ఒక కూటమి ఏర్పాటు చేయడానికి సింగ్ బాధ్యత వహించారు. 1989లో ఆయన పాత్ర భారత రాజకీయాల దిశను మార్చింది. కాంగ్రెస్ పార్టీ నుంచి బయటికి వచ్చిన తరువాత సింగ్.. అరుణ్ నెహ్రూ, ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ లతో కలసి జనమోర్చా పేరుతో ప్రతిపక్ష పార్టీని ప్రారంభించారు. అలహాబాద్ లోక్‌సభకు జరిగిన ఉపన్నికలలో సునీల్ శాస్త్రిని ఓడించి తిరిగి ఎన్నికైనారు.1988 అక్టోబరు 11 న జనతాపార్టీ సంకీర్ణం నాయకుడు జయప్రకాశ్ నారాయణ్ జన్మదినం సందర్భంగా రాజీవ్ గాంధీని వ్యతిరేకించే పార్టీలైన జనమోర్చా, జనతాపార్టీ, లోక్‌దళ్, కాంగ్రెస్ (ఎస్) పార్టీలను కలిపి జనతాదళ్ పార్టీని స్థాపించారు. జనతాదళ్ పార్టీకి అధ్యక్షుడైనారు. ద్రవిడ మున్నేట్ర ఖగజం, తెలుగుదేశం పార్టీ, అసోం గణపరిషత్ వంటి ప్రాంతీయ పార్టీలతో కలసి జనతాదళ్ పార్టీ నేషనల్ ఫ్రంట్ పేరుతో సంకీర్ణ దళం ఏర్పడినది. దీనికి వీపీ సింగ్ కన్వీనరుగా, ఎన్‌టీ రామారావు అధ్యక్షుడిగా, పర్వతనేని ఉపేంద్ర జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు.

1989 సార్వత్రిక ఎన్నికలలో నేషనల్ ఫ్రంటు, కాంగ్రెస్ వ్యతిరేక పక్షాలైన భారతీయ జనతా పార్టీ, వామపక్ష పార్టీల (రెండు ప్రధాన ప్రతిపక్ష పార్టీలను) తో కలసి సీట్ల సర్దుబాటు చేసుకొని పోటీ చేసింది. అటల్ బిహారీ వాజపేయి, లాల్ కృష్ణ అద్వానీల నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు), కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా వంటి వామపక్షాలు ప్రభుత్వం బయటి నుంచి మద్దతు ఇవ్వడంతో ప్రభుత్వం ఏర్పడింది. పార్లెమెంటు సెంట్రల్ హాల్‌లో 1989 డిసెంబరు 1 జరిగిన సమవేశం ద్వారా వీపీ సింగ్ ప్రధానమంత్రిగా ఎన్నుకోబడి, 1989 డిసెంబరు 2 న భారత దేశ 7వ ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి, 1990 నవంబరు 10 వరకు ఒక సంవత్సరం లోపే ప్రధానమంత్రిగా పనిచేశారు. మార్చి 1990 లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో సింగ్ సంకీర్ణ పభుత్వం పార్లమెంటులోని రెండు సభలలో నియంత్రణ సాధించింది. ఈ కాలంలో జనతాదళ్ పార్టీ ఐదు రాష్ట్రాలలో అధికారం చేజిక్కించుకుంది. హర్యానా రాష్ట్రంలోని ఓం ప్రకాష్ చౌతాలా ప్రభుత్వం, గుజరాత్‌లోని చిమన్ భాయ్ పటేల్ ప్రభుత్వం, ఒడిశాలోని బిజూ పట్నాయక్ ప్రభుత్వం, బీహార్‌లోని లాలూ ప్రసాద్ యాదవ్ ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్‌లోని ములాయం సింగ్ యదవ్ ప్రభుత్వాలను జనతాదళ్ పార్టీ ఏర్పరచింది. నేషనల్ ఫ్రంటులోని మిత్రపక్షాలైన ఎన్‌టీ రమారావు, ప్రఫుల్ల కుమార్ మహంతా కూడా ప్రభుత్వాలను ఏర్పరచారు. జనతాదళ్ కేరళ రాష్ట్రంలోని ఈకే నాయనార్‌తో, రాజస్థాన్‌లో భైరాన్ సింగ్ షెకావత్‌తో కూడా అధికారాన్ని పంచుకుంది.

**మండల్ కమిషన్ నివేదిక**

మండల్ కమిషన్ భారత దేశంలోని సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల పరిస్థితులని అధ్యయనం చేసే కమిషన్. దీనిని 1979 జనవరి 1 న అప్పటి జనతాపార్టీకి చెందిన భారత ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయ్ చే ప్రారంభించ బడినది. ఆ కాలంలో ఏర్పాటు చేసిన కమిషన్ చైర్మన్‌గా బీపీ మండల్ వ్యవహరించారు. అయన రూపొందించిన మండల్ కమిషన్ నివేదిక భారత దేశంలో వెనుక బడిన తరగతులు, యితర వెనుక బడిన తరగతులుగా సూచించ బడిన కులాలకు సామాన్య జన స్రవంతిలో అనుసంధానం చేసే మార్గాలను అధ్యయనం చేసి క్రమ బద్ధము, న్యాయ బద్ధమూ అయిన విధాన నిర్మాణాన్ని ప్రభుత్వానికి సమర్పించింది. కానీ ఆ సమయానికి మురార్జీ దేశాయి ప్రధాని పదవి నుంచి వైదొలగ వలసి వచ్చింది. తరువాత కాంగ్రెస్ పాలనలో సుమారు 10 సంవత్సరాలు మండల్ కమిషన్ నివేదిక బుట్ట దాఖలు అయిపోయింది. తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం పతనమై వీపీ సింగ్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండల్ కమిషన్ నివేదికకు తన ప్రభుత్వ ఆమోద ముద్ర వేసాడు. ఓబీసీ రిజర్వేషన్లను (క్రిమీలేయర్ కంటే దిగువన) 2008 లో సుప్రీం కోర్టు సమర్థించింది.

**అయన పాలనా సమయంలో**

శ్రీలంకలోని తమిళ వేర్పాటు వాద ఉద్యమాన్ని ఎదుర్కోవడానికి అంతకు పూర్వం రాజీవ్ గాంధీ భారత సైన్యాన్ని పంపించి చేపట్టిన, విఫలమైన ఆపరేషన్‌కు ముగింపు పలకాలని నిర్ణయించారు. భారత సరిహద్దులో యుద్ధాన్ని ప్రారంభించేందుకు బెనజీర్ భుట్టో నేతృత్వంలోని పాకిస్తాన్ చేసిన ప్రయత్నాలను ఆయన అడ్డుకున్నారు. వీపీ సింగ్ 2008 నవంబరు 27 న న్యూఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో మరణించారు. 2008 నవంబరు 29న అలహాబాదు లోని గంగా నదీ తీరంలో దహనం చేశారు.


- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



# ఆహారాన్ని ఎవరు వృథా చెయ్యొద్దు

## అతిగా తిని ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దు

హోటలల్లో, ఫంక్షన్ హాల్స్ లో ఆహారం వృథా చేసేవారిపై జరిమానాలు విధించబడును అని తప్పనిసరిగా బోర్డులు పెట్టాలి. ప్రతి ఒక్కరూ ఆహారం, ఆహార పదార్థాల వినియోగంలో బాధ్యతగా ప్రవర్తించాలి. వృథా చేసే హక్కు ఎవరికీ లేదు. దీనిపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన నిబంధనలను రూపొందించి, ప్రజలందరికీ అవగాహన కలిగేలా విస్తృత ప్రచారం చెయ్యాలి. నిబంధనలను, ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. జరిమానాలు విధించాలి. ప్రతి సంవత్సరం ఆహారం లేక, పోషకాహారం అందక ప్రజలు బాధపడుతున్న విషయాలను గమనించి ప్రతీ ఒక్కరు చేయాల్సిన మొదటి పని కావాల్సినన్ని ఆహార పదార్థాలను మాత్రమే వినియోగించాలి. ఒక్క మెతుకును సైతం వృథా చేసే అధికారం మనకు లేదు అనే సత్యాన్ని గమనించాలి. వృధాను అరికడితే ఆహార పదార్థాలను పండిచినట్టే. నేనొక్కడిని వృథా చేస్తే ఏమవుతుంది అనే భావన ఎక్కువ మందిలో కనిపిస్తుంది. ఆహారాన్ని వృథా చేయడం గొప్పగా ఫీల్ అవుతున్నట్లుగా కనిపిస్తుంది. హోదాగా అనుకుంటున్నారు. అది పూర్తిగా తప్పు. ఆహారాన్ని వృథా చేస్తే దేశ ద్రోహం చేసినట్లే అని ముఖ్యంగా ఆహారం వృథా చేసే వారు తెలుసుకోవాలి. ముఖ్యంగా ఫంక్షన్లలో, హోటల్లో ఆహార పదార్థాలు కావలసినన్ని అందుబాటులో ఉండడం వల్ల అన్ని ఆహార పదార్థాలను వడ్డించుకుని కొన్ని ఆహార పదార్థాలు మాత్రమే భుజించి 50% పైగా ఆహార పదార్థాలను వదిలేస్తున్నారు. దీనిని గమనించి ప్రతీ ఒక్కరూ వృధాను అరికట్టే విధంగా ఎవరికి వారు స్వతహాగా ఆహారాన్ని వృథా చేయము అని నిబంధనను అమలు చేసుకోవాలి. చినుకు చినుకు కలిసి వర్షంగా మారి వరదగా, వాగులు, వంకలు ద్వారా నీరు భూమిలోకి ఇంకుతూ, సముద్రంలో చేరినట్లుగా ప్రతి మెతుకు వృధాను ప్రతి ఒక్కరూ అరికట్టడం ద్వారా కొన్ని లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలు మిగులు జరుగుతుంది. అదే క్రమంలో పరిమితికి మించి ఆహార పదార్థాలను భుజించడం వల్ల కోట్ల రూపాయల విలువైన మీ ఆరోగ్యం అస్వస్థతకు, అనారోగ్యానికి గురిఅయ్యే పరిస్థితికి మన చేజేతులా మనకు మనమే హాని చేసుకుంటున్నాము. ఇదే విషయాన్ని డాక్టర్లు, పెద్దలు, యోగ నిపుణులు చెబుతున్న పట్టించుకోవడం లేదు. అస్వస్థతకు, అనారోగ్యానికి చికిత్స కోసం మళ్ళీ డబ్బును ఖర్చుచేస్తున్నం. దీనివల్ల మనం పొదుపు చేసుకున్న డబ్బు వృథా అవుతుంది. అనారోగ్యం కుదుటపడడానికి కనీసం కొంత కాలం పడుతుంది. ఆ సమయం వృథా అవుతుంది. ఈ విధంగా అతిగా ఆహారం తీసుకోవడం వల్ల, ఆహారాన్ని వృథా చెయ్యడం వల్ల ఎన్నో నష్టాలు వున్న విషయాలను ప్రజలందరూ తెలుసుకొని ఆహారాన్ని చెయ్యకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రజలందరిది. దేశం అభివృద్ధి, తన అభివృద్ధి అని కోరుకునే ప్రతీ ఒక్కరు ఈ చిన్న విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే దేశానికి మేలు చేసిన పౌరులుగా మిగులుతాము.



- కాచం సుష్మ
తెలంగాణ రాష్ట్ర వైశ్య మహాసభ
ప్రధాన కార్యదర్శి
సెల్: 9849632429

# మట్టి అక్రమ రవాణాను అరికట్టాలి



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లపై, ఇటుక బట్టీల వద్ద అక్రమంగా నిల్వ చేసిన షిల్ట్ (బంక మట్టి)లపై, అక్రమంగా మట్టి, షీల్డ్ తరలింపు చేస్తున్న వారిపై జరిమానాలు విధించాలి, కేసులు నమోదు చెయ్యాలి, అనుమతులు లేని, అనుమతి పరిమాణంను పరిమితిని మించి నిల్వలు చేసిన వారిపై జరిమానాలు విధించాలి. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వారిపై కఠినచర్యలు తీసుకోవాలి. ప్రజలు ఫిర్యాదులు చేసిన వెంటనే, సమాచారం అందించిన వెంటనే రెవిన్యూ శాఖ, గనులు భూగర్భ శాఖ, నీటి పారుదల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, లేబర్(కార్మిక) శాఖ సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చెయ్యాలి, అదే క్రమంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ.. గోరంత పరిమాణానికి అనుమతులు తీసుకుని అపరిమితంగా మట్టిని తరలిస్తున్న వారిపై పర్యవేక్షణ లేకపోవడం వల్ల, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై, ఇష్టారాజ్యంగా చెరువుల్లోని షీల్‌డ్‌ను తీస్తూ, తరలిస్తున్నా.. పట్టించుకోవడం లేదు.

స్థానిక ప్రజలు అడిగితే ప్రభుత్వ శాఖలు అనుమతులు వున్నాయని చెప్పడం, వారికి వున్న అనుమతులు పత్రాలు ప్రజలకు చూపక పోవడం, అనుమతులు పత్రాల్లో వున్న విషయాలు స్థానిక ప్రజలకు అర్థం అయ్యేలా తెలుగులో లేకపోవడం, తక్కువ పరిమాణంనకు అనుమతులు పొంది పరిమితిని మించి మట్టి, షీల్‌డ్‌ను తరలించడం, అనుమతులు లేకుండా చెరువుల్లోని బంక మట్టి(షిల్ట్)నీ అక్రమంగా తరలించి ఇటుక బట్టిల వద్ద భారీ పరిమాణంలో చేసిన నిల్వలను తనిఖీ చేసి సీజ్ చెయ్యాలి. కేసులు నమోదు చెయ్యాలి. జరిమానాలు విధించాలి. నిల్వ పరిమాణానికి తగిన రాయల్టీకి 10 రెట్లు జరిమానా విధించాలని మైనింగ్ చట్టంలో వున్న దాన్ని సేక్షన్లను అమలు చెయ్యాలి.

**సమాచార హక్కు**
**వికాస సమితి డిమాండ్ చేస్తుంది**

ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ఎవరిని వదలవద్దని, తక్షణమే ఇటుక బట్టీల వద్ద గల అనుమతులు లేని మట్టి నిల్వలను లెక్కించి కేసులు నమోదు చెయ్యాలని, NALA (నాలా) అనుమతి లేని వారిపై (వ్యవసాయ భూమిని వ్యాపార అవసరాలకు వాడుటకు ముందు RDO(రెవిన్యూ డివిజనల్ అధికారి) గారి ద్వారా అనుమతితో, తగిన రుసుములు చెల్లించి మార్పిడి చేసుకోవాలి. ఇటుక బట్టిలకు వినియోగించే భూమి విస్తీర్ణం రైతు బంధు సహాయం నిలిపివేయాలి. ఒకవైపు ప్రభుత్వానికి ఆదాయం రావలసి వుండగా, రైతు బంధు పథకం ద్వారా నిధులు పొందడం అంటే ప్రభుత్వం నష్టపోవడం) సంబంధిత రెవెన్యూ శాఖ, నీటిపారుదల శాఖ, మైనింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడంలో సంబంధిత శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరించడం, మట్టి తరలింపు సమయంలో ఫిర్యాదులు చేసిన వెంటనే అధికారులు స్పందించి తరలింపును అడ్డుకోకుండా జాప్యం చెయ్యడం, నిర్లక్ష్యంగా వుండడం, అక్రమంగా, అనుమతులు లేకుండా మట్టి తరలింపు చేయు అక్రమార్కులకు మీపై ఫిర్యాదులు వచ్చినవి అని వారికి సమాచారం తెలియజేసి ఫిర్యాదు చేసిన వారి వివరాలు వారికి తెలియజేయడం వల్ల ఫిర్యాదు దారులపై దాడులు జరుగుతున్నవి. సంబంధిత శాఖల అధికారులు సకాలంలో స్పందించి అక్రమంగా మట్టి తరలింపు చేస్తున్న వాహనములను పోలీసు శాఖ వారి సహకారంతో ప్రభుత్వం అధీనంలోకి తీసుకొని కేసులు పెట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. తద్వారా అక్రమార్కులు రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా అధికారుల అండదండలు మాకు పుష్కలంగా వున్నాయని, మీరు ఎవరికి ఫిర్యాదు చేసిన మాకు ఏమీకాదు అని బాహాటంగా మాట్లాడుతున్న విషయాలు వున్నవి. ప్రభుత్వ శాఖలు మట్టి తరలింపులో చర్యలు తీసుకోవడంలో ఆలస్యం అయినా పక్షంలో, అట్టి మట్టి నిలవ చేసిన ప్రదేశాలను తనిఖీ చేసి అనుమతులు లేకుండా నిలవ చేసిన వాటిపై, పొందిన అనుమతులు పరిమాణానికి మించి నిల్వ చేసిన మట్టి, షీల్డ్ లను సంబంధిత శాఖల అధికారులు లెక్కించి చట్ట ప్రకారం కేసులు నమోదు చెయ్యాలి. జరిమానాలు విధించాలి. ప్రభుత్వానికి ప్రతి సంవత్సరానికి దాదాపుగా ఒక వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వచ్చే అవకాశం వుంది. ఈ ఆదాయంతో ప్రతీ చెరువును అభివృద్ధి చేయవచ్చు. ఈ అక్రమ వ్యవహారంలో అధికారుల పాత్ర, సహకారం ఉందని ప్రజలు అనుకుంటున్నారు. ప్రజలు తమ పరిధిలో ఎవరైన అక్రమంగా మట్టి తరలింపు చేస్తున్నచో జిల్లా కలెక్టర్‌కు, సంబంధిత శాఖల అధికారులకు ఫిర్యాదులు చెయ్యాలి. ప్రజా వనరులను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకునే పని సంబంధిత శాఖల అధికారులది. చర్యలు తీసుకోవడంలో, కేసులు నమోదు చెయ్యడంలో, జరిమానాలు విధించడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అక్రమార్కులకు సహకరిస్తున్నారని జనం అనుకుంటున్న విషయంలో వాస్తవం లేదు అనే విధంగా అధికారులు పారదర్శకంగా, జవాబుదారీతనంతో, వేగంగా చర్యలు తీసుకోవాలి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే వారిపై కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.



- డాక్టర్ యర్రమాద కృష్ణారెడ్డి,
సమాచార హక్కు వికాస సమితి
వ్యవస్థాపక అధ్యక్షుడు
ఫోన్ : 99496 49766

## ప్రజావాణిలో విన్నపాల వెల్లువ



**విశ్వంభర, హైదరాబాద్ :** జీహెచ్ఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అధికారులకు విన్నవించిన విన్నపాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి అధికారులకు పంపించారు. ఈ ప్రజావాణిలో అడిషనల్ కమిషనర్లు కే శ్రీనివాస్, సత్యనారాయణ, ఉపేందర్ రెడ్డి, నళిని ప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి, సీసీపీ రాజేంద్ర ప్రసాద్ నాయక్ లు ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు టౌన్ ప్లానింగ్, డబుల్ బెడ్ రూం, ఇంజనీరింగ్ శాఖలకు సంబంధించిన ఎక్కువగా వచ్చాయి. మొత్తం 137భౌతికంగా విన్నపాలు రాగా 15 విన్నపాలు ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా స్వీకరించారు. భౌతికంగా మొత్తం 137 లలో హౌసింగ్ 53 విన్నపాలు వచ్చాయి. అదే విధంగా టౌన్ ప్లానింగ్ 42, ఇంజనీరింగ్ 15, అడ్మిన్ 6, ఎస్టేట్ 5, ఎలక్ట్రికల్ 2, ట్యాక్స్ 8, ఎంటమాలజీ 1, ట్రేడ్ లైసెన్స్ 1 విన్నపాలు వచ్చాయి. జీహెచ్ఎంసీ పరిధిలో 6 జోన్లలో 105 విన్నపాలు రాగా చార్మినార్ జోన్ లో 9, సికింద్రాబాద్ జోన్ లో 12, కూకట్ పల్లి జోన్ లో 49, శేరిలింగంపల్లి జోన్ 21, ఖైరతాబాద్ జోన్ 4, ఎల్బీనగర్ జోన్ లో 10 విన్నపాలు వచ్చాయి. టౌన్ ప్లానింగ్ కు సంబంధించిన విన్నపాలు ఎక్కువగా వచ్చాయి. టెలిఫోన్ ద్వారా 15 విన్నపాలు రాగా అందులో టౌన్ ప్లానింగ్, రేషన్ కార్డు, జీహెచ్ఎంసీకి సంబంధించినవి కాకుండా ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలు కూడా తీసుకొని అట్టి సమస్యను ఆయా శాఖలకు పంపించారు. టెలిఫోన్ ద్వారా వచ్చిన సమస్య అతని పేరు మొబైల్ నెంబర్ సమస్య గురించి తెలుసుకొని అడిషనల్ కమిషనర్ సేకరించి సంబంధిత విభాగం ఉన్నతాధికారులకు పరిష్కారం కోసం పంపించారు.

ఈ ప్రజావాణిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ, చీఫ్ ఎంటమాలజీ డా.రాంబాబు, హౌసింగ్ ఎస్ఈ విద్యాసాగర్, డిప్యూటీ సీఈ కేఎస్ రెడ్డి, కంట్రోల్ రూం ఓఎస్డీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# బదిలీల జాతర!

- రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీ
- ఒకేసారి 44 మంది అధికారులను ట్రాన్స్‌ఫర్ చేసిన ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతి కుమారి
- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. ఒకేసారి 44 మంది అధికారులను ప్రభుత్వం ట్రాన్స్‌ఫర్ చేసింది. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సుల్తానియాను నియమించింది. ఆయనకు ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శిగా కూడా ఆయన కొనసాగనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జీవో విడుదల చేశారు. చేనేత, హస్త కళల ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యను బదిలీ చేశారు. ఆమెకు హ్యాండ్లూమ్స్, టీజీసీవో హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో కొనసాగిన రొనాల్డ్ రోస్‌ను విద్యుత్ శాఖ కమిషనర్‌గా ట్రాన్స్‌ఫర్ చేశారు. ఆయనకు జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీగా అదనపు బాధ్యతలు కేటాయించారు.

ఇక పాఠశాల విద్యా శాఖ కమిషనర్‌గా ఉన్న శ్రీదేవసేనను కళాశాల, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్, కార్మిక, ఉపాధి శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా సంజయ్‌కుమార్, యువజన సర్వీసులు, పర్యాటక, క్రీడల శాఖ ముఖ్యకార్యదర్శిగా వాణి ప్రసాద్, అటవీ, పర్యావరణ శాఖల ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమించారు. ఆయనకు టీపీటీఆర్ఐ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా ఉన్న రిజ్వీని వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా బదిలీ చేశారు. జీఏడీ ముఖ్య కార్యదర్శిగా సుదర్శన్‌రెడ్డిని నియమించారు. దాసరి హరిచందనను రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, హెచ్ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్‌ను నియమించారు.

### బదిలీ అయిన ఐఏఎస్‌ల జాబితా

- పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్
- కార్మిక, ఉపాధి శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా సంజయ్ కుమార్
- యువజన సర్వీసులు, పర్యాటక, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శిగా వాణి ప్రసాద్..
- చేనేత, హస్త కళల ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్య
- హ్యాండ్లూమ్స్, టీజీసీవో హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎండీగా శైలజకు అదనపు బాధ్యతలు
- అటవీ, పర్యావరణ శాఖల ముఖ్య కార్యదర్శిగా అహ్మద్ నదీమ్
- టీపీటీఆర్ఐ డీజీగా అహ్మద్ నదీమ్‌కు అదనపు బాధ్యతలు
- వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శిగా రిజ్వీ
- జీఏడీ ముఖ్య కార్యదర్శిగా సుదర్శన్ రెడ్డి
- హౌసింగ్, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ముఖ్య కార్యదర్శిగా జ్యోతి బుద్ధ ప్రసాద్
- స్పోర్ట్స్ అథారిటీ ఎండీగా సోనీ బాలాదేవి
- రవాణా శాఖ కమిషనర్‌గా కే. ఇలంబరితి
- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలికి అదనపు బాధ్యతలు
- జీహెచ్ఎంసీ, విజిలెన్స్, విపత్తు నిర్వహణ కమిషనర్‌గా రంగనాథ్
- హెచ్ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్
- జల మండలి ఎండీగా కే. అశోక్ రెడ్డి
- జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా స్నేహా శబరి
- జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా అనురాగ్ జయంతి
- జీహెచ్ఎంసీ ఎల్బీ నగర్ జోనల్ కమిషనర్‌గా హెచ్‌కే. పాటిల్
- జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా అపూర్వ్ చౌహాన్
- జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా ఉపేందర్ రెడ్డి
- కళాశాల, సాంకేతిక విద్యా శాఖల కమిషనర్‌గా శ్రీదేవసేన
- సెర్ప్ సీఈవోగా డీ. దివ్య
- ప్రజా వాణి నోడల్ అధికారిగా దివ్యకు అదనపు బాధ్యతలు
- రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా హరిచందన
- పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీగా ఎన్. ప్రకాశ్ రెడ్డి
- ఎస్సీ గురుకులాల కార్యదర్శిగా అలగ్ వర్షిణి
- గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా వీపీ గౌతమ్
- పురపాలక శాఖ డైరెక్టర్‌గా గౌతమ్‌కు అదనపు బాధ్యతలు
- ఉపాధి, శిక్షణ శాఖల డైరెక్టర్‌గా కృష్ణా ఆదిత్యకు అదనపు బాధ్యతలు
- ఐటీ ఉప కార్యదర్శిగా భవేష్ మిశ్రా
- కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శిగా జీ. రవి
- గ్రామీణాభివృద్ధి సీఈవోగా కే. నిఖిల
- ఉద్యాన వన డైరెక్టర్‌గా యాస్మిన్ బాషా
- ఆయిల్ ఫెడ్ ఎండీగా యాస్మిన్ బాషాకు అదనపు బాధ్యతలు
- ప్రొటోకాల్ డైరెక్టర్‌గా ఎస్. వెంకట్రావు
- వ్యవసాయ, సహకార సంయుక్త కార్యదర్శిగా జీ. ఉదయ్ కుమార్
- పశు సంవర్ధక శాఖ డైరెక్టర్‌గా గోపికి అదనపు బాధ్యతలు
- ఫిషరీస్ డైరెక్టర్‌గా ప్రియాంక
- టూరిజం డైరెక్టర్‌గా ఇలా త్రిపాఠి
- రాష్ట్ర ఆర్థిక సంఘం ఎండీగా కాత్యాయని దేవి
- పాఠశాల విద్యా డైరెక్టర్‌గా నర్సింహా రెడ్డి
- సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నర్సింహా రెడ్డికి అదనపు బాధ్యతలు
- వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఎండీగా సహదేవ రావు
- ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా అభిషేక్ అగస్త్య
- భద్రాచలం ఐటీడీఏ పీవోగా రాహుల్
- మూసీ అభివృద్ధి జేఎండీగా గౌతమి
- టీజీ ఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నిఖిల్ చక్రవర్తి



## పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- రైతులకు రెండు లక్షల రుణమాఫీ హర్షణీయం
- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఏపూరి సతీష్

**విశ్వంభర, నారాయణపూర్ :** కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గత అసెంబ్లీ ఎన్నికలలో రైతంగానికి ఇచ్చిన హామీ రెండు లక్షల రూపాయల పంట రుణమాఫీ పథకం అమలుకు ముఖ్యమంత్రి, మంత్రి మండలి తీర్మానం చేయడం హర్షనీయమని మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఏపూరి సతీష్ అన్నారు. టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మునుగోడు శాసన సభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేసిన వాగ్దానం ఖచ్చితంగా అమలు చేస్తుందన్నారు. పరాయిల పాలనా అంతం కోసం ఆనాడు కాంగ్రెస్ ఉద్యమించి దేశానికీ స్వాతంత్ర్యం తెచ్చిందని, ఆకలితో అల్లాడుతున్న ప్రజానీకానికి కూడు గూడు కల్పనా కోసం సంక్షేమ పథకాలు పెట్టి బడుగు బలహీన వర్గ పేదలను ఆదుకొని, విద్య వైద్యం అవసరాలు నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. పారిశ్రామిక అభివృద్ధితో పాటుగా వ్యవసాయ రంగం అభివృద్ధికి విప్లవత్మాకమైన మార్పులు తీసుకవచ్చి దిగుమతి స్థాయి నుంచి ఎగుమతి స్థాయి వరకు వెళ్లిందన్నారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి మార్కెట్ వసతి కల్పించి రైతు రాజ్య స్థాపన చేసిందన్నారు. కాంగ్రెస్ అంటే కన్నతల్లి పాలనా అని నేటికీ కొనియాడుతుండటం ఆనాటి ఇందిరమ్మ పాలనాతో నేడు రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతు ప్రజాపాలన చేస్తున్నారని అన్నారు. రుణమాఫీ అమలు చేస్తే హరీష్‌రావు రాజకీయ సన్యాసం చేస్తానన్న మాటకు కట్టుబడి ఉండాలని, ఎమ్మెల్యే పదవికి స్పీకర్ ఫార్మట్ లో రాజీనామాకు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రములో డీసీసీ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, ముద్దంగుల నర్సింహా, అక్బర్ ఆలీ, ఉప్పల లింగస్వామి, నోముల మాధవ రెడ్డి, కొనరెడ్డి నర్సింహా, జక్కిడి చంద్రారెడ్డి, పాలకూర్ల స్వామి రతిపల్లి యాదయ్య, అందె యాదయ్య, యాదగిరి, రాజు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కేంద్రంలో సోమవారం వరంగల్ రైతు డిక్లరేషన్ సమావేశంలో రైతులకు ఏక కాలంలో పంట రుణ మాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్ రెడ్డి తన సహచర క్యాబినెట్ మంత్రుల సహకారంతో రైతు రుణ మాఫీ ఏక కాలంలో వచ్చే ఆగస్టు 15 లోపు మాఫీ చేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టిన ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాల అభిషేకం చేసిన మండల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు.



షాద్‌నగర్ బైపాస్ దూసకల్ బై పాస్, కేశంపేట బైపాస్ వద్ద తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయని. సమస్యను పరిష్కరించేందుకు నేషనల్ హైవేస్ అథారిటీ జనరల్ మేనేజర్ కం ప్రాజెక్ట్ డైరెక్టర్ జీఎం, పీడీ నాగేశ్వరరావును హైదరాబాదులోని వారి కార్యాలయంలో కలిసి షాద్‌నగర్ బైపాస్ ప్రమాదాల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కొత్తూరు కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ గౌడ్, దేవేందర్ కోరారు.

– విశ్వంభర, షాద్‌నగర్

## ఆకట్టుకున్న రాఘవన్ కర్ణాటక సంగీత అరంగేటం



**విశ్వంభర, ఎల్బీనగర్ :** సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాఘవన్ మాడబూసి కర్ణాటక సంగీత అరంగేటం ఆకట్టుకునేలా సాగింది. సోమవారం హైదరాబాదు భాగ్ లింగంపల్లిసుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ మ్యాండలింగ్ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో రాఘవన్ మాడబూసి తన సోదరుడు మాధవన్ మాడబూసిలు మ్యాండలింగ్ వాయిద్యంతో సబికులను రంజింపజేశారు. మొదటగా నవరాగ మాలిక వర్ణం, వాతాపి గణపతి, రాగం తానం వల్లవి రాగమాలికల వాయిద్యంతో ఉర్రుతలూగించారు. ఈ సందర్భంగా రాఘవన్ గురువులు యూపీ రాజా, యూపీ నాగమణిలు మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా ఆన్లైన్లో కర్ణాటక సంగీతం నేర్చుకోని శభాష్ అనిపించుకున్నారని చెప్పారు. ఇలాంటి కళాకారులు దేశానికే గర్వకారణమన్నారు. ఘటంపై డాక్టర్ కార్తీక్, మృదగంపై డాక్టర్ రామకృష్ణ నీలమణి, వాయిలిన్పై శ్రీనివాసరావు, తాంబూరపై విఘ్నేష్‌లు వాయిద్య సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో రాఘవన్ తల్లిదండ్రులు జయకృష్ణ, రోహిణిలు పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతులు చేపట్టిన సన్ ప్రీత్ సింగ్‌ను ఎస్పీ కార్యాలయంలో ఆయనను వీ3 న్యూస్ జిల్లా పుట్టా రాంబాబు గౌడ్ బాచి మర్యాద పూర్వకంగా కలిశారు.

– విశ్వంభర, సూర్యాపేట

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

### ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**విశ్వంభర, పరిగి :** పూడూరు మండల పరిధిలోని చింతల్ పల్లి గ్రామంలో కోటి 40 లక్షల రూపాయలతో బీటీ రోడ్డు పనులను స్థానిక ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతతో త్వరితగతిన రోడ్డు పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పీఏసీఎస్ చైర్మన్



సతీష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేందర్, డీసీసీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు రఘునాథ్ రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, నర్సింలు, అజీమ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.



## ముత్యాల నరసింహా ఆశయ సాధనకు కృషి చేయాలి

### సీపీఐ మండల కార్యదర్శి భాస్కర్

**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం మండలం మహమ్మదాబాద్ గ్రామంలో అమరజీవి మాజీ సర్పంచ్ ముత్యాల నరసింహా ప్రథమ వర్ధంతిని ఆయన స్మారక స్తూపం వద్ద పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్ మాట్లాడుతూ.. నరసింహా ఆశయ సాధనకు కృషి చేయాలని, ఆయన గ్రామపంచాయతీ సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు తోకల రాం రెడ్డి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి చిలువేరు అంజయ్య, మండల కార్యవర్గ సభ్యులు కలకొండ సంజీవ, సింగల్ విండో డైరెక్టర్ ముత్యాల అంజయ్య, భీమనపల్లి గాలయ్య, పల్లె మల్లారెడ్డి, గడ్డం యాదయ్య, జనగామ ఎట్టయ్య, నరసింహా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## డిప్యూటీ సీఎం భట్టికి ఘన స్వాగతం

**విశ్వంభర, ఆమనగలు :** శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళుతున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అచ్చంపేట హాజీపూర్ ప్రాంతం వద్ద అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్ కర్నూల్, వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యేలు వంశీ కృష్ణ, కసిరెడ్డి నారాయణ మేఘారెడ్డి, రాజేష్ రెడ్డి స్వాగతం పలికి శాలువా పూలమాలతో సన్మానం చేశారు.



రాజ్యసభలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా నియమించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావును ఎంపీ రవిచంద్ర సోమవారం సాయంత్రం ఎర్రవల్లి లోని వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛమిచ్చి హృదయపూర్వక ధన్యవాదాలు చెప్పారు.

– విశ్వంభర, హైదరాబాద్

# వారం రోజుల్లో ప్రజావాణి దరఖాస్తులు పరిష్కారం చేయాలి

## భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి జిల్లా అధికారులు అత్యంత ప్రాధాన్యత నివ్వాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయపు సమావేశపు హాలులో అన్ని శాఖల జిల్లా అధికారులతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి సమస్యల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కారం కోరుతూ ప్రజలు ప్రజావాణిలో ఇచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ప్రజావాణి నుంచి కూడా జిల్లాకు సంబంధించి నటువంటి దరఖాస్తులు రావడం జరుగుతుందని దరఖాస్తులు వారం రోజుల్లో పరిష్కరించి ప్రజావాణి వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులు సత్వర పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు వారి వారి కార్యాలయ పరిధిలో ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమించుకోవాలని ఆదేశించారు. సమస్య పరిష్కారానికి అందచేసిన దరఖాస్తుదారునికి సమస్య పరిష్కార స్వభావంపై లిఖిత



పూర్వకంగా సమాచారం అందించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం చాలా ముఖ్యమైనదని అన్ని శాఖల అధికారులు నిర్దేశిత సమయానికి హాజరు కావాలని తెలిపారు. అధికారులు సమయపాలన పాటించాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి ప్రజావాణి నుంచి మన జిల్లాకు 135 ఫిర్యాదులు సిఫారసు చేసారని రానున్న వారంలో పరిష్కరించాలని పెండింగ్ ఉంచొద్దని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## కలెక్టర్ సీ నారాయణరెడ్డి

**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మండలంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ సీ నారాయణరెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలల్లో భాగంగా ఎలాంటి సమస్యలు ఉన్నా.. ఈ ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో చాలావరకు భూ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, వాటిని పరిష్కరించడం కోసం,అదేవిధంగా గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజావాణిని ఉపయోగించుకోవాలని ప్రజలకు తెలిపారు. ధరణి సమస్యలు తీవ్రంగా ఉందని ఎక్కడి భూ సమస్యలు అక్కడే ఉన్నాయని గుర్తు చేశారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే ముఖ్యంగా గ్రామాలు అభివృద్ధి చెందాలన్నారు. వీటికి గ్రామంలో పనిచేసే గ్రామ పంచాయతీ కార్యదర్శులే ముఖ్య పాత్ర వహించాలన్నారు.గ్రామాల్లో ఆసరా పింఛన్, కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నాయని వాటిని ఎలా పరిష్కరం చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని మండల అధికారుల దృష్టికి పంచాయతీ కార్యదర్శులు తీసుకురావాలని కలెక్టర్ గుర్తు చేశారు. ఈ ప్రజావాణిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి సమస్యలు పరిష్కరించే విధంగా మండల అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమం ప్రతీ సోమవారం ఉంటుందని ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణ కేంద్రం రాజీవ్ గాంధీ చౌరస్తాలో కడ్తాల్ మండల కేంద్రంలో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్యఅతిథులుగా టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తున్న శుభ సందర్భంగా సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, మండల అధ్యక్షులు జగన్, బిచానాయక్ మాజీ మండల అధ్యక్షుడు మంగ్లీ రాములు, కృష్ణ నాయక్, పసుపుల శ్రీశైలం, హలీం, ఫిరోజ్, కుమార్, నాజర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు న్యాయం జరుగుతుందని భరోసా కల్పించాలి : ఎస్పీ కిరణ్ ఖరే

**విశ్వంభర, భూపాలపల్లి :** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి బాధితులకు అండగా ఉంటూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుపై విచారణ జరిపి వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజాదివాస్ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పలు సమస్యలపై 15 మంది బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజాదివాస్‌లో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఆయా పోలీసు స్టేషన్‌ల అధికారులతో మాట్లాడుతూ.. పోలీసు పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని, పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా కల్పించాలన్నారు. అలాగే చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతల పరిస్థితులకు భంగం కలిగించేవారి పట్ల, కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు.



# ఆయిల్ పామ్ తోటలకు ప్రోత్సహిక రాయితీ విడుదల

**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 2022-2023 సంవత్సరానికి గాను ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులకు73,42,860 లక్షల రూపాయలు ప్రోత్సాక రాయితీ నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తికర రైతులు తమ భూ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పుస్తకం జిరాక్స్ కాపీలతోపాటు ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోను సమీప ఉద్యాన శాఖ అధికారులకు కానీ జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో కానీ ఇవ్వాలని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ మొక్కలను, బిందు సేద్యం పరికరాలను 12.5 ఎకరాల వరకు రాయితీపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు సమీప ఉద్యాన అధికారులైన భూపాలపల్లి డివిజన్ హార్టికల్చరల్ ఆఫీసర్ సునీల్‌కుమార్ 8977714064, మహాదేవపూర్ డివిజన్ హార్టికల్చరల్ ఆఫీసర్ రమేష్ 8977714065ను సంప్రదించవలెనని ఆయన తెలిపారు.

# కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నది



**విశ్వంభర, భూపాలపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రైతులకు 2 లక్షలు రుణమాఫీ ప్రకటించిన సందర్భంగా మహా ముత్తారం మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షులు పక్కల సడువలి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంతరెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం టపాసులు కాల్చి మిఠాయి పంచి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పక్కల సడవలి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారని, రుణమాఫీ రైతులకు ఎంతో మేలు అన్నారు. డిసెంబర్ 12, 2018 నుంచి డిసెంబర్ 9, 2023 మధ్య ఐదేళ్ల కాలంలో రైతులు తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించిందన్నారు. ఆగస్టు 15, 2024 లోపు 48 లక్షల మంది రైతుల యొక్క రుణాలను సుమారు రూ31 వేల కోట్ల తో రుణమాఫీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ సందర్భంగా మహా ముత్తారం మండల రైతాంగం పక్షాన కాంగ్రెస్ పార్టీ తరపున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మంత్రి వర్గానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పీసీసీ మెంబర్ బెల్లంకొండ కృష్ణయ్య, సీనియర్ నాయకులు లింగమల్ల దుర్గయ్య, తాటి లచ్చయ్య గౌడ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ ముక్కెర రాజమల్లు, పక్కల రాజబాబు, సకినాల రాజు, భాస్కర్, మేకల మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# పార్టీ మారిన ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

**విశ్వంభర, మెట్పల్లి :** మెట్పల్లి పట్టణ స్థానిక శాస్త్రీయ చౌరస్తా వద్ద ఎంపీపీ మారుసాయిరెడ్డి ఆధ్వర్యంలో టీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ధర్నా నిర్వహించి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి మారడం సిగ్గుచేటని నమ్ముకున్న కార్యకర్తలకు ఓటు వేసి గెలిపించిన ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఎమ్మెల్యేగా రాజీనామా చేసి పార్టీ మారి కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ కూడా సంపాదించలేవని రెండుసార్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ప్రజలు పార్టీ మీద అభిమానంతో గెలిపించారని, అర్ధరాత్రి పార్టీ మారడం ఏందని హేళన చేశారు. మెట్పల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 'ఘర్ ధడక్నే దో' కాంపెయిన్ ప్రారంభించిన ఎవాస్

**విశ్వంభర, బషీర్ బాగ్ :** భారతదేశపు ప్రముఖ నిర్మాణ సామగ్రి కంపెనీ ఇన్ఫ్రా మార్కెట్, తన డైరెక్ట్-టు-కన్స్యూమర్ (డీటుసీ) బ్రాండ్ ద్వారా 'ఘర్ ధడక్నే దో' కాంపెయిన్ ప్రారంభించినట్టు ప్రకటించింది. గృహిణులు, వారి గృహాల మధ్య వేళ్ళూనుకున్న బలమైన సంబంధం సారాన్ని గుర్తిస్తూ, మనలాగే మన ఇళ్ళుకూడా శ్వాసిస్తాయని, జీవిస్తాయన్న వాస్తవాన్ని ఈ కాంపెయిన్ వేడుకచేస్తోంది. భావావేశపరంగా ఇళ్ళతో ఎన్నో బంధాలు ఏర్పరుచుకుంటామన్న విషయాన్ని గుర్తిస్తూ, మన ఇళ్ళని మెరుగు పరుచుకోడాన్ని, ప్రత్యేకశ్రద్ధ వహించడాన్ని ఎవాస్ ప్రోత్సహిస్తుందని ప్రకటించింది.



# నిరుపేద, అనాధలకు అండగా ఉంటాం

## ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్

**విశ్వంభర, భూపాలపల్లి :** తల్లి తండ్రులు లేని నిరుపేద, అనాథ పిల్లలుకు అండగా ఉంటామని ప్రముఖ సంస్థ ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి తెలిపారు. నిరుపేద అనాథ పిల్లలు విద్యను అభ్యశించడానికి ఒకటవ తరగతి నుండి10 వ తరగతి వరకు వారిని ఉచితంగా చదివించి వారికి ఉన్నత భవిష్యత్తు కోసం పూర్తి బాధ్యతలు తీసుకుంటామని మారుతి అన్నారు. వారికీ అన్ని విద్య వసతులు ఉచితంగా అందజేస్తామన్నారు. తల్లితండ్రులు లేనిఅనాథ పిల్లలు జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల వారికీ ఈ అవకాశం కలిపిస్తున్నట్లు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి తెలిపారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలు ఎవరైనా ఉంటే ఫౌండేషన్ వారి 9391075767, 8309369104 ఈ నేబర్ల లో సంప్రదించాలని కోరారు.

# కాళేశ్వరం మద్యం షాపులపై చర్యలు తీసుకోవాలి

## ప్రజావాణిలో దరఖాస్తు

**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వర గ్రామంలో రెండు మద్యం దుకాణాలను ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే మద్యం దుకాణాల టెండర్ దక్కిచ్చుకున్న యజమానులు నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇక్కడి రెండు మద్యం దుకాణాల నుంచి అక్రమంగా మహారాష్ట్రకు మద్యాన్ని పెద్ద ఎత్తున సరఫరా చేస్తూ.. అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారని, అలాగే మద్యం దుకాణాలో కొన్ని రకాల మద్యం కింగ్ ఫిషర్ బీర్లు, ఐబీ, ఓసీ క్వాటర్లు అందుబాటులో ఉంచకుండా ఆ మద్యాన్ని అంతా బెల్టు షాపులకు అధిక రేట్లకు విక్రయిస్తూ.. సొమ్ము చేసుకుంటున్న యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో వినూత్న రీతిలో దరఖాస్తు చేసి విన్నవించాడు కాళేశ్వరం గ్రామానికి చెందిన యువకుడు కోల



మహేష్..స్పంచించిన జిల్లా కలెక్టర్ వెంటనే జిల్లా ఎక్సైజ్ సుపరిండెంట్‌ను విచారణకు ఆదేశించారు. మద్యం ప్రియులకు అందుబాటులో సరైన మద్యం అందుబాటులో లేకుంటే సంబంధిత షాప్ యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో కలెక్టర్ రాహుల్ శర్మకు యువకుడు కృతజ్ఞతలు తెలిపాడు.



# డిండిలో దర్జాగా ఇసుక డంపింగ్

## పట్టించుకోని అధికారులు

**విశ్వంభర, డిండి :** డిండి మండలానికి సరిహద్దు ప్రాంతమైన నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు ఉప్పునుంతల మండలాల నుంచి ఇతర ప్రాంతాలకు ఇసుక ట్రాక్టర్లతో విచ్చలవిడిగా ఇసుక దందా నిర్వహిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. డిండి మండల కేంద్రంలో చెన్నకేశవ దేవాలయం వెనకాల ఒక ప్లాట్ లో ఇసుక డంపింగ్ చేయడం తోపాటు డంపింగ్ చేసుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తూ.. విచ్చలవిడిగా ప్రజల దగ్గర ఒక్క ఇసుక ట్రాక్టర్‌కు 5000 వేల నుంచి 6000 వేల వరకు అమ్ముతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పత్రికా విలేకరులకు పోలీసులకు, ఇసుక ట్రాక్టర్ యజమానుల నుంచి నెలకు వేళల్లో ముడుపులు చెందుతున్నాయని ఆరోపణలు ఇస్తున్నాయి. అధికారులు ఇకనైనా పట్టించుకోని పర్మిషన్ లేకుండా నడిపిస్తున్న ట్రాక్టర్ యజమానులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




# 26 నుంచి హైదరాబాద్ రియలైజేషన్ టూర్

**విశ్వంభర, బషీర్ బాగ్ :** తెలంగాణలో ఉన్న ప్రతీ మనషికి సహజ యోగ ద్వారా వచ్చే ప్రశాంతతను, ఆనందాన్ని అం దించటానికి ఈనెల 26 నుంచి 30 వరకు 'హైదరాబాద్ రియలైజేషన్ టూర్ ని' పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు సహజ యోగ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు గౌరు కృష్ణ పేర్కొ న్నారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్ర మానికి సంబందించిన బ్రోచర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సుమారు 500 మంది ప్రతినిదులు భారత దేశంలోని వివిధ రాష్ట్రాల, విదేశాల నుంచి హాజరవుతానని చెప్పారు. వీరందరూ ఈ నాలుగు రోజులు ఉ. నుంచి సా.4 వరకు సహజయోగా పరిచయ కార్యక్ర మాలు, స్ట్రెస్ మానేజ్ మెంట్ సెషన్స్ ని వివిధ కళాశాలల్లో, పాఠశాలాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం మెగా సహజయోగ పరిచయ, సంగీత కార్యక్రమాలు నిర్వ హించబడతాయని చెప్పారు. సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జూన్ 28న సా.5 గం.కు, నిజాంకాలేజ్ గ్రౌండ్స్‌లో జూన్ 29న సా.5 గంటలకు పీజేఆర్ స్టేడియం చందానగర్‌లో సా.5 గంటలకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సహజయోగ ద్వారా వచ్చే అన్ని రకాల ప్రయోజనాలను ఆస్వాదించాలని కోరారు. సహజ యోగ అభ్యాసం ఇప్పుడైనా, ఎక్కడైనా ఉచితం అని, ఎలాంటి రుసుము చెల్లించావలిసిన అవసరం లేదని తెలిపారు. వివరాల కోసం ఫోన్ : 8988982200లో సంప్రదించాలని అన్నారు. కార్యక్రమంలో సుబ్బిరెడ్డి, రామ్మోహన్‌రావు, మల్లారెడ్డి, సుప్రజ, సునీల్ అగర్వాల్ పాల్గొన్నారు.



## తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి కలెక్టర్ ఛాంబర్‌లో హాకింపేట, కరీంనగర్, ఆదిలాబాద్ క్రీడా పాఠశాలల్లో ప్రవేశాల వాల్ పోస్టర్‌ను కలెక్టర్ రాహుల్ శర్మ అవిష్కరించారు. 28వ తేదీన జిల్లా కేంద్రంలోని డా బీఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్లో తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశానికి విద్యార్థిని, విద్యార్థుల ఎంపిక వాల్ పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 28వ తేదీన జిల్లా స్థాయిలో నిర్వహించనున్న ఎంపికకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా క్రీడల అధికారిని ఆదేశించారు. ఇతర వివరాలకు 96180 22096, 832857765 2 నంబర్లును సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి సీహెచ్ రఘు, విద్యాశాఖ అధికారి ఎన్ రాం కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మల్లంపేట గ్రామంలోని కాజిపల్లి రోడ్‌లో..బ్యాటెల్ఫీడ్స్ స్పోర్ట్స్ ఎరినాను సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని దారా రత్నాకర్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ స్టేట్ సెక్రెటరీ, కొదుమూరి దయాకర్ రావు, దార భరత్, రామ జోగయ్య శాలువాకప్పి సన్మానించారు.

**– విశ్వంభర, హైదరాబాద్**

## రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష



**విశ్వంభర, షాద్‌నగర్ :** ప్రభుత్వం రైతులకు అనుకూలంగా ఉందని రైతుల సమస్యలపై రెవెన్యూ అధికారులు తప్పనిసరిగా దృష్టి సారించాలని, రైతులతో అధికారులు గౌరవంగా వ్యవహారించాలని ఎమ్మెల్యే అన్నారు. రైతుల పొలాల సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలంగా వివరించ కూడదని సర్వేయర్లు రైతులకు అందుబాటులో ఉండి భూమి కొలతలు త్వరగా పూర్తి చేసి ప్రభుత్వ భూముల ను అన్యాక్రాంతకం కాకుండా చూడాలని పేర్కొన్నారు. రైతులు పొలాలకు చాలా కాలంగా ఉపయోగిస్తున్న బాటలను కొనసాగిం చే యూస్ మెంట్ రైట్ కొనసాగించాలని ఎమ్మెల్యే అన్నారు. రేషన్ షాపులను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## మున్సిపాలిటీలో లోపించిన పారిశుధ్యం

**ఒకటో వార్డులో పారిశుధ్యం పరిస్థితి ఇలాగేనా**

**అగ్రహించిన మైనార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ అలీ ఖాన్ బాబర్**



**విశ్వంభర, షాద్‌నగర్ :** మున్సిపాలిటీ టౌన్ అభివృద్ధి పేరుతో పైపై మేరుగులు చూపించడం కాదని, మునిసిపాలిటీలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని మున్సిపల్ సిబ్బంది తీరుపై కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నేత పీసీసీ సభ్యుడు మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ ధ్వజమెత్తారు. షాద్ నగర్ పట్టణం ఒకటో వార్డులో ఫర్టిలైజర్ గోదాం పక్కన పెద్ద ఎత్తున చెత్తాచెదారం పేరుకుపోయినా పట్టించుకోరా అంటు అగ్రహించారు. మున్సిపల్ సిబ్బందిని తీసుకెల్లి చూపించారు. అసలు పరిశ్యుద్ధం చేయకుండా ఇన్నాళ్లు ఎలా ఉన్నారని, ఇది సమంజసమేనా అంటూ సిబ్బందిని ప్రశ్నించారు. సీజనల్ వ్యాధులు వచ్చే సమయం ఆసన్నమైందని, కాబట్టి వెంటనే చెత్తాచెదారం తొలగించాలని డిమాండ్ చేశారు. అసలు స్వచ్ఛభారత్ కార్యక్రమాలు ఉన్నాయా లేవా ఎక్కడ నిర్వహిస్తున్నారంటూ బాబర్ ఖాన్ ప్రశ్నించారు. మున్సిపాలిటీ సిబ్బంది తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అసలు మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారంటూ ఘాటుగా స్పందించారు. అసలే వర్షాకాలం సీజన్ అధికారులు, సిబ్బంది స్పందించి అన్ని వార్డుల్లో పారిశుద్ధ్యం లోపం లేకుండా చూసుకోవాలని కోరుతున్నారు.

# జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలి

- నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కిన బీజేవైఎం నాయకులు
- ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- చేతి గుర్తు పార్టీ అధికారంలోకి వచ్చి నిరుద్యోగులకు మొండి చేయి చూపిస్తుంది
- నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వానికి తేడా ఏమీ లేదు
- బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దురిశెట్టి సంపత్



**విశ్వంభర, కరీంనగర్ :** నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ.. భారతీయ జనతా యువమోర్చా కరీంనగర్ జిల్లా శాఖ నగరంలోని తెలంగాణ చౌక్ లో ఆందోళన చేపట్టింది. నిరుద్యోగుల పట్ల కాంగ్రెస్ సర్కార్ అవలంబిస్తున్న వైఖరిని నిర్వహిస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దురిశెట్టి సంపత్ మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల పట్ల మొసలి కన్నీరు కార్చిందని, నిరుద్యోగులకు చేయూత నిస్తామని నేడు మొండి చేయి ఇచ్చిందని ఆయన విమర్శించారు. నిరుద్యోగులు అనేక సమస్యలతో సతమతమవుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందన్నారు. గత పది ఏళ్లు రాష్ట్రాన్ని ఏలిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడిందని, అందుకే ఆ ప్రభుత్వానికి నిరుద్యోగులు తగిన గుణపాఠం చెప్పారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా.. నిరుద్యోగుల ఏ ఒక్క సమస్యలను పరిష్కరించలేదని, నిరుద్యోగులకు ప్రతినెలా అందిస్తామన్న భృతి నేటికీ ఇవ్వలేకపోయిందన్నారు. లోగడ రాష్ట్రాన్ని ఏలిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా ఏమీ లేదన్నారు. నిరుద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ప్రధానంగా గ్రూప్ వన్ ప్రిలిమ్స్ లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలని, గ్రూప్ 2 గ్రూప్ 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలని, 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీనీ నిర్వహించాలని, జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలోని నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గల మెత్తిన బీజేవైఎం నాయకులపై రాష్ట్ర ప్రభుత్వం దాడి చేయించడం అమానుషమని, దీన్ని బీజేవైఎం జిల్లా పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి శశి, ఉపాధ్యక్షులు గుండరాపు సంపత్, అజయ్, తోట సాయి, అనిల్, ఇసపెల్లి మహేష్, మంత్నునూరు హరీష్, ఎడ్ల ప్రసన్న, శివా రెడ్డి, నాగసముద్రాల ప్రవీణ్, మునిగంటి కుమార్, ఉప్పరాపెళ్ళి శ్రీనివాస్, పొన్నాల రాము, కుకట్ల రమేష్, శ్రీమంతుల అక్షయ్, సతీష్, వినయ్, ఎడ్ల సాగర్, వెంకటేష్, కిరణ్, సాయి చందు, ప్రవీణ్, అరవింద్, భారత్, నరేష్, శ్రీనివాస్ నాయక్, తణుకు సాయి, వెంకటేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.





## టెలిఫోన్ కాలనీ 15వ డివిజన్ 60 ఫీట్ల బీటీ రోడ్డును త్వరగా ఏర్పరచాలి

- 2023లో సాంక్షన్ అయినా నేటి వరకు పనుల జాప్యం
- మట్టి రోడ్డుతో కాలనీ వాసుల ఇబ్బందులు
- అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి

**విశ్వంభర, మేడ్చల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్పొరేషన్‌లో ఎలాంటి సమస్య ఉన్న ప్రజావాణి కార్యక్రమంలో మేయర్‌కు కమిషనర్‌కు ప్రత్యక్షంగా విన్నపించుకుని అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా టెలిఫోన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో టెలిఫోన్ కాలనీలో 60 ఫీట్ల బీటీ రోడ్డు నిర్మాణంపై మేయర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15వ డివిజన్ టెలిఫోన్ కాలనీ లో గల కొంత భాగంలో 60 ఫీట్ల వీటి రోడ్డు నిర్మాణనికై 2023లోనే తీర్మానం చేసి ఆమోదించిన టెలిఫోన్ కాలనీ ప్రధాన రహదారి అయినటువంటి గణేష్ మండపం నుంచి హనుమాన్ ఆలయం వరకు ఉన్న 60 ఫీట్ల మట్టి రోడ్డుపై బీటీ రోడ్డు నిర్మించాలని అప్పుడున్న కమిషనర్ మరియు అధికారుల ఆధ్వర్యంలో శిలాఫలకం ఏర్పాటు చేసి శంకుస్థాపన కూడా చేయడం జరిగిందని, పనుల వ్యవధి కోసం ఎనిమిది నెలల గడువు కావాలి అని తీసుకుని ఇప్పటివరకు పని ప్రారంభించకపోవడంపై కాలనీవాసులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను తీర్చడానికి ముందుండాలని కానీ కొంతమంది ప్రతినిధులు ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్న పట్టించుకోకుండా చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నరని, రోడ్డు నిర్మాణానికై కాంట్రాక్ట్ ఆమోదం చేయించిన 60 ఫీట్ల బీటీ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని మేయర్కి వినతి పత్రం అందజేశామని తెలిపారు. అంతేకాకుండా వర్షాకాలం ప్రారంభమైందని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని కాలనీకి ఏకైక ప్రధాన రహదారి అయినటువంటి రోడ్డును త్వరగా పూర్తి చేయాలని ఇప్పుడు ఉన్నటువంటి మట్టి రోడ్డు గుంతలు గుంతలుగా వరద నీటితో నిండిపోయి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, స్కూల్ కు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలకు వెళ్లేవారు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, నీటితో నిండిన గుంటలు ఏర్పడక కింద పడడం కూడా జరుగుతుందని, కాలినీవాసులు ప్రమాదాలు జరుగుతాయేమో అని భయాందోళనలకు గురవుతున్నారని, త్వరగా మా సమస్యను పరిష్కరించి రోడ్డు నిర్మాణాన్నికై అనుమతించాలని కోరుకుంటున్నామని, సాంక్షన్ అయినప్పటికీ ఈరోజు వరకు రోడ్డు పనులను ప్రారంభించకపోవడం సబబు కాదుఅని, త్వరలోనే రోడ్డు పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, కోశాధికారి బాల నరసింహ, ఉపాధ్యక్షులు మహేందర్, టెలిఫోన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా రోడ్లపై షెడ్లు, రాంపుల నిర్మాణం

**వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు**

**తక్షణమే పరిష్కరించాలి ప్రజావాణి ద్వారా ఫిర్యాదు**

**విశ్వంభర, మేడ్చల్ :** రోడ్లను ఆక్రమించి షెడ్లు, రాంపుల నిర్మాణాలు చేయడం ద్వారా రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నాయని, ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేశారు. ఫిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో కమిషనర్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి శ్రీపాద ఎంక్లీవ్ సమస్యలపై కమిషనర్ త్రిలేశ్వరరావుకి ప్రజావాణి ద్వారా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..



తాను నివాసముంటున్న పిర్జాదిగూడ కార్పొరేషన్ శ్రీపాద ఎంక్లేవ్ కాలనీ లో ఇల్లు నిర్మాణం చేసుకునేవారు ర్యాంపులను రోడ్లపైకి, అలాగే రోడ్డుకు ఇరు ప్రక్కల పర్మినెంట్ షెడ్లను ఏర్పాటు చేస్తున్నారని, అంతేకాకుండా ఇళ్ల నిర్మాణపు వ్యర్థాలను సంవత్సరాల తరబడి రోడ్డు ప్రక్కనే వదిలేస్తూన్నారని, రోడ్డు నుంచి వెళ్లే ప్రజలు, కాలనీ వాసులు ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుందని వీటిపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. రోడ్డు ఇరుపక్కల దాదాపు 5 ఫీట్ల వ్యవధితో నిర్మాణాలు ఏర్పాటు చేయడం ద్వారా స్కూలు వాహనాలు, కార్లు, వెళ్లడానికి కూడా అనుగుణంగా లేదని ఆక్రమించి నిర్మించిన షడ్స్ ,రాంప్ లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ పాద ఎంక్లేవ్ కాలనీవాసులు పాల్గొన్నారు.



## ఇంటింటి సర్వే తొందరగా పూర్తి చేయాలి

**విశ్వంభర, నారాయణఖేడ్ :** గ్రామాల్లో ఇంటింటి మిషన్ భగీరథ సర్వే తొందరగా పూర్తి చేయాలని పేట ఎంపీడీవో రఫిక్ ఉనీసా అన్నారు. పెద్ద శంకరంపేట మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను తొందరగా పూర్తి చేయాలని పెద్దశంకరంపేట ఎంపీడీవో రఫిక్ ఉన్నిసా పేర్కొన్నారు. సోమవారం పేట ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాలలో ఇంటింటికీ మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులు ఆదేశించారు. గ్రామాల్లో మురికి కాలువలు శుభ్రం చేయించాలని పారిశుధ్యం పాటించాలని ఆమె సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ గ్రామాలలో నెలకొన్న సమస్యలను తొందరగా పరిష్కరించాలని సూచించారు. హరితహార కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం లక్ష్యం మేరకు గ్రామాలలో చెట్లు నాటించాలని నాటి నచ్చుట్లను పరిరక్షించాలని ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థి బంధువులపై పాఠశాల యాజమాన్యం దాడి

- అక్రమ అరెస్టులు చేస్తున్నారంటూ ఏబీవీపీ నాయకులు ఆరోపణ
- పోలీసుల తీరుపై మండిపడ్డ కుటుంబ సభ్యులు

**విశ్వంభర, షాద్‌నగర్ :** పట్టణంలోని మేధా హైస్కూల్లో గత శనివారం ఒక విద్యార్థి పాఠశాలలోని ట్రాన్స్ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్కు గురయ్యాడు. ఆ విద్యార్థి ప్రస్తుతం హైదరాబాదులోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై స్కూల్ యాజమాన్యం స్పందించడం లేదని సోమవారం విద్యార్థి సంఘాలు మరియు విద్యార్థి యొక్క కుటుంబ సభ్యులు పాఠశాల వద్దకు చేరుకొని ధర్నా చేశారు. ధర్నా చేస్తున్న సమయంలో స్కూల్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు స్కూల్ వద్దకు వచ్చి విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేశారు. విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న సమయంలో స్కూల్ యాజమాన్యంలో ఒక టీచర్ విద్యార్థుల యొక్క బంధువులపై దాడికి పాల్పడం వల్ల విద్యార్థి సంఘాలు మరియు బంధువులు ఆగ్రహానికి గురై పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటి

విశ్వంభర, న్యూఢిల్లీ : తెలంగాణ బిడ్డ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రిగా పదవీస్వీకారం చేసిన సందర్భంగా బండి సంజయ్‌ని ఢిల్లీలో సోమవారం తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మర్యదపూర్వకంగా కలిసి సత్కరించారు. గత పదేండ్ల తెలంగాణ విధ్వంసాన్ని సరిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్ర ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. అలాగే వారు కూడా సహృదయంతో రాష్ట్ర అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అండగా ఉంటామని చెప్పారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ముఖ్యంగా జాతీయ రహదారుల మంజూరీలో తెలంగాణకు అగ్రస్థానం లభించేలా ప్రత్యేక చొరవ చూపాలని కోరగా.. నా సంపూర్ణ సహకారం ఎప్పుడూ ఉంటుందని బండి సంజయ్ చెప్పడం చాలా సంతోషంగా ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.





## సరైన విధివిధానాలు లేకుండా అండర్ పాస్ నిర్మాణం

**అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**విశ్వంభర, కొత్తూరు :** అండర్ పాస్ రోడ్డు సరైన ప్రణాళిక లేకపోవడం వల్ల సాంకేతిక లోపాల మూలంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తూరు మున్సిపాలిటీలో వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన అండర్పాస్ రోడ్డును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేషనల్ అథారిటీ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు కొత్తూరు వై జంక్షన్ నుంచి వినాయక స్టీల్ కంపెనీ వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. ఇట్టి విషయంపై పై అధికారులతో చర్చించడానికి వెంటనే ఏర్పాటు చేయాలని అక్కడికి వచ్చిన అధికారులకు ఆదేశించారు. వీలైనంత త్వరలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని నేషనల్ అథారిటీ అధికారులతో మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అథారిటీ ఏఈ భాను శర్మ, ప్రాజెక్టు మేనేజర్ ఇబ్రహీం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, మాజీ సర్పంచ్ జే సుదర్శన్ గౌడ్, వీరమోని దేవేందర్ ముదిరాజ్, జై గోవర్ధన్ గౌడ్, మాజీ సర్పంచ్ జగన్, ఇందూరి శ్రీనివాస్, మామిడి సిద్ధార్థ రెడ్డి, చిలకమర్రి నరసింహ, సత్తయ్య, ఆంజనేయు లు గౌడ్, జగన్ గౌడ్, రామకృష్ణ, టీ రమేష్, గోవిందనాయక్, హసన్, నరసింహ ముదిరాజ్, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా సత్యనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

**విశ్వంభర, దిల్‌సుఖ్‌నగర్ :** దిల్‌సుఖ్‌నగర్లో సుప్రసిద్ధమైన వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం ఉదయం యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, గరుడ ప్రసాదం, తదితర ప్రత్యేక పూజలు, సాయంత్రం దేవతాహ్వానం, మూలమంత్ర హెూమం, పూర్ణాహుతి, తీర్థప్రసాద గోష్టి తదితర పూజాకార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉ .మూలమంత్ర హవనములు, స్నపనం, అలంకారము, సుదర్శన ఇష్టి హెూమం, సాయంత్రం నిత్యహెూమం, ఎదురుకోలు, గరుడ వాహనసేవ, తీర్థప్రసాద గోష్టి తదితర ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలలో ప్రత్యేక పూజలు చేయదలిచిన వారు ఆలయ సిబ్బందిని సంప్రదించాలని అలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు పల్గొని స్వామి వారి కృపకు పాత్రులుకాగలరని వారు కోరారు.



## నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**విశ్వంభర, ఆమనగలు :** విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వెల్దండ ఎంఈఓకి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ స్కూల్స్ లో తనిఖీ చేసి పాఠ్యపుస్తకాలు టై, బెల్టు యూనిఫాం లాంటివి అమ్ముతున్న స్కూల్స్ పై, ఫిట్నెస్ లేని బస్సులు నడుపుతున్న స్కూల్స్ పై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూల్స్ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో %ూణూఖ% రాష్ట్ర నాయకులు సంతోష్, గిరిజన విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



## మిస్టరీ వీడిన మిస్సింగ్ కేసు

**విశ్వంభర, ఘట్కేసర్ :** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. మాజీ ఎంపీటీసీ గడ్డం మహేష్ డంపింగ్ యార్డ్లో సోమవారం శవమై తేలాడు. ఈ నెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహేష్ ఆ తర్వాత ఇంటికి రాలేదు. దీంతో ఆయన సోదరుడు విఠల్ ఘట్కేసర్ పోలీసులకు మిస్సింగ్ కంప్లైంట్ ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా.. అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఏసీపీ చక్రపాణి సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రధాన నిందితుడు ప్రవీణ్, చిన్నా వెల్లడించిన ఆధారంగా ఘట్కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ డంపింగ్ యార్డ్లో మృతదేహాన్ని పాతిపెట్టినట్లు తెలిసింది. దీంతో జేసీబీ సాయంతో సోమవారం మృతదేహాన్ని బయటకు తీశారు. హత్యకు ముందు మహేష్ను ఓ గదిలో బంధించి చిత్రహింసలకు గురి చేసినట్లు తేలింది. చిన్నా, ప్రవీణ్ ఆర్థికలావాదేవిల కారణంతో మహేశ్‌ను చంపినట్లు ఏసీపీ తెలియజేశారు.



## రైతులకు అవగాహన

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్ మండలం లోని రామునూతల గ్రామంలో ఆచార్యఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వరి ప్రధాన శాస్త్రవేత్త సీహెచ్ దామోదర్ రాజు, మృత్తిక శాస్త్రవేత్త పవన్ చంద్ర రెడ్డి రైతులతో వానకాలం సంబంధించి వరి పంటలు వేసిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామనూతల గ్రామాన్ని ప్రధాన శాస్త్రవేత్త దత్తత గ్రామంగా ప్రకటించారు. ఇందులో భాగంగా రైతులకు రాబోయే మూడు సంవత్సరాల వరకు వ్యవసాయపరమైన సలహాలు, సూచనలు అందజేయనున్నారు. ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ రైతులు విత్తన ఎంపిక నుంచి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి మట్టి నమూనా సేకరణ భూసార పరీక్ష యొక్క లాభాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఆదిలక్ష్మి, వ్యవసాయ అధికారి డీ అరుణకుమారి, విస్తరణ అధికారులు శివతేజ, మీనాక్షి, రైతులు గడిగె సత్తయ్య, గుండమోని నరసింహ, పుట్టి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.




## అంగన్వాడీల వేతనాలు పెంచాలి

- రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని అమలు చేయాలి
- ఏఐటీయూసీ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి డిమాండ్

**విశ్వంభర, నల్లగొండ :** అంగన్వాడీల వేతనాలు 18 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తక్షణమే వేతనాలు పెంచాలని ఇతర హామీలు అమలు చేయాలని ఏఐటీయూసీ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా2023 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4 వరకు 24 రోజుల సమ్మె చేస్తే గత ప్రభుత్వం పట్టించుకోలేదని, కాంగ్రెస్ పార్టీ అంగన్వాడీ సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చిన విధంగా అంగన్వాడీలకు తక్షణమే 18 వేల వేతనం చెల్లించాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు పది లక్షలు హెల్పర్ కు రూ.5 లక్షలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్ కు లక్ష రూపాయలు, ఆయాకు రూ.50 వేలు మాత్రమే చెల్లిస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందని అన్నారు. అంగన్వాడీలపై పనిబారం తగ్గించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, ఖాళీగా ఉన్న సూపర్వైజర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్థాయిలో అన్ని రకాల పనులు అంగన్వాడీల చేత చేయిస్తూ అంగన్వాడీలను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. అంగన్వాడీ సెంటర్‌కు గుడ్లు నాణ్యత లేకుండా వస్తున్నాయని, సొంత భవనాలు నిర్మించాలని కోరారు. గత ప్రభుత్వం జారీ చేసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కు సంబంధించిన జీవో నెంబర్ 10ని వెంటనే రద్దు చేయాలని కోరారు. గతంలో సమ్మె కాలపు 24 రోజుల వేతనం వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ వెబ్సైట్లో అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపుతున్నారని దీనివలన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు అందడం లేదన్నారు. అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడమ సుమతమ్మ మాట్లాడుతూ.. గత 50 సంవత్సరాలుగా అంగన్వాడీ టీచర్లు గా ఆయాలుగా పనిచేస్తున్న నేటికీ గౌరవ వేతనం పొందుతూ వెట్టిచాకిరి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇంటి అద్దెలు కూరగాయల బిల్లులు గ్యాస్ బిల్లులు సకాలంలో చెల్లించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియే షన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడమ సుమతమ్మ, జిల్లా ఉపాధ్యక్షురాలు శాంత కుమారి, కోట్ల శోభ, శంతాబాయి, సాయి సుజిత, రాణి, అన్నపూర్ణ, ప్రభావతి, అంజలి, రమ ణ, వణజా, విజయ, టీ సరిత, దస్లి, జగదేశ్వరీ, పద్మావతి, సునీత, కేదారి, స్వప్న బక్కమ్మ, సీహెచ్ తారక, జయంతి జంగమ్మ, జ్యోతి, ప్రమీల, అరుణ విజయలక్ష్మి, భద్రమ్మ, రెడ్డి బాయ్, డివిజన్ కార్యదర్శి విశ్వనాథులు లెనిన్, జిల్లా ప్రధాన కార్యదర్శి పీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా జోనల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హేమంత కేశవ్ పాటిల్‌ని సోమవారం మర్యాద పూర్వకంగా కలిసిన హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్. తిప్పర్తి యాదయ్య
– విశ్వంభర, హైదరాబాద్

## సమాజసేవకులు కలిసే వేదిక సంఘమిత్ర



**విశ్వంభర, కల్వకుర్తి :** ప్రతినెలా జరుపుకునే సంఘమిత్ర సమావేశం కల్వకుర్తి లోని వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షర వనంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 60కి పైగా సామాజిక సేవా సంస్థలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమానికి మాజీ రాజ్య సభ సభ్యుడు బసవరాజు పాటిల్, ఏకలవ్య ఫౌండేషన్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, దాదాపు పది రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామాజిక సేవ చేస్తున్న ఎన్జీవోలు, ప్రతినిధులు వారి వారి అనుభవాలను పంచుకున్నారు. ప్రతినెలా సంఘమిత్ర సమావేశం నాలుగో ఆదివారం జరుగుతుందని కన్వీనర్ మాధవ రెడ్డి తెలిపారు.

## తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక



**విశ్వంభర, ఎల్బీనగర్ :** జీహెచ్ఎంసీ తెలంగాణ ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గం నూతన సభ్యులను ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్ నాగన్న, జనరల్ సెక్రటరీ కిషోర్, అడిషనల్ జనరల్ సెక్రటరీగా శ్రీనివాస్ తదితరులను కార్యవర్గం సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందకిషోర్ అధ్యక్షతన ఐఎన్‌టీయూసీ చాలా ఘనంగా ముందుకు సాగుతూ రానున్న రోజుల్లో ఘన విజయం సాధించే విధంగా సాగుతుందన్నారు. జీహెచ్ఎంసీలో ఎటువంటి సమస్యలు ఉన్న అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తామని, లేనియెడల ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సభ ఇంత ఘనంగా నిర్వహించిన అడిషనల్ జనరల్ సెక్రెటరీ శంకర్, దామోదర్ ట్రెజరర్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ నందకిషోర్, జనరల్ సెక్రెటరీ రామాంజనేయులు, అడ్వైజర్ మల్లికార్జున్, జనరల్ సెక్రెటరీ నాగన్న గౌడ్, ప్రెసిడెంట్ దిలీప్ బంటిసింగ్ తదితరులు ఉన్నారు.




## ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా హేమంత పాటిల్ కేశవ్

**విశ్వంభర, ఎల్బీనగర్ :** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నటువంటి బదిలీల నేపథ్యంలో ఎల్బీనగర్ నూతన జోనల్ కమిషనర్‌గా హేమంత పాటిల్ కేశవ్ నియామితులయ్యారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హేమంత పార్టీ కేశవ్ మాట్లాడుతూ.. జోనల్ పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

# రాజ్యాంగాన్ని ఏ శక్తి తాకలేదు

- ప్రభుత్వాన్ని రక్షించుకునే పనిలో మోడీ ఉన్నారు
- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ



**విశ్వంభర, ఢిల్లీ :** దేశ రాజ్యాంగంపై ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షా దాడికి పాల్పడుతున్నట్లు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. జవాబు ఇవ్వకుండా ప్రధాని మోదీని ప్రతిపక్షాలు తప్పించుకోనివ్వ యని ఆయన అన్నారు. పార్లమెంట్ ఆవరణలో సోమవారం రాహుల్ మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగం పై దాడిని ఆమోదించబోమన్నారు. రాజ్యాంగం పుస్తక కాపీలను చేతుల్లో పట్టుకున్న ఇండియా కూటమి నేతలు లోక్‌సభకు మార్చ్ చేశారు. మీరు ఇచ్చే సందేశం ప్రజలకు చేరుతుందా అని అడిగిన ప్రశ్నకు ఆయన బదులిస్తూ.. తమ సందేశం ప్రజలకు చేరుతోందని, భారత రాజ్యాంగాన్ని ఏ శక్తి కూడా తాకలేదని, దాన్ని తాము పరిరక్షించనున్నట్లు రాహుల్ తెలిపారు. మానసికంగా బలహీనంగా ఉన్న ప్రధాని మోడీ తన ప్రభుత్వాన్ని రక్షించుకునే పనిలో పడినట్లు ఎక్స్ అకౌంట్‌లో రాహుల్ ఆరోపించారు. ఎన్డీఏ ప్రభుత్వం తొలి 15 రోజుల్లో అనేక రకాల దారుణ సంఘటనలు జరిగినట్లు చెప్పారు. భయానక రైలు ప్రమాదం, కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడి, రైళ్లలో ప్రయాణికుల ఇబ్బందులు, నీట్ స్కామ్, నీట్ పీజీ రద్దు, యూజీసీ నెట్ పేపర్ లీకేజీ, పాలు, పప్పుదినుసులు, పెట్రోల్, టోల్ ధరలు పెరగడం, అడవులు అంటుకోవడం, నీటి సంక్షోభం లాంటి ఘటనలు జరిగినట్లు రాహుల్ తెలిపారు.

# మీ ప్రేమే నన్ను కాపాడింది

- వయనాడ్ ప్రజలకు అండగా ఉంటా
- ఎంపీ రాహుల్ గాంధీ లేఖ
- విద్వేషం, హింసపై పోరాటం కొనసాగిస్తా
- మీ ప్రతినిధిగా నా సోదరి వస్తోంది
- వయనాడ్ స్థానాన్ని వదులుకోవడంపై రాహుల్ భావోద్వేగం



**విశ్వంభర, వయనాడ్:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్ సభ ఎన్నికల్లో యూపీలోని రాయ్‌బరేలీ, కేరళలోని వయనాడ్ స్థానాల నుంచి గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఈ రెండింటిలో ఒక సీటు వదులుకోవాల్సి వచ్చింది. దీంతో ఆయన వయనాడ్‌ను వదులుకుంటున్నట్లు ఇటీవలే ప్రకటించారు. ఈ నేపథ్యంలో వయనాడ్ ప్రజలకు రాహుల్ భావోద్వేగంతో ఓ లేఖ రాశారు. "ప్రియమైన వయనాడ్ సోదర సోదరీ మణులారా.. మీరంతా క్షేమంగా ఉన్నారని ఆశిస్తున్నా. ఐదేళ్ల కిందట నేను మిమ్మల్ని కలిశాను. మీ మద్దతు కోరేందుకు తొలిసారి వచ్చాను. అయినా నాపై ప్రేమ, ఆప్యాయతతో హత్తుకున్నారు. నేను వేధింపులను ఎదుర్కొంటున్న సమయంలో ఎదురైన పరిస్థితుల్లో మీరుచూపిన ప్రేమే నన్ను కాపాడాయి. నాకు ఆశ్రయం కల్పించి ఒక కుటుంబసభ్యుడిలా చూసుకున్నారు. వేలాదిమంది ఎదుట తన ప్రసంగాలను అనువాదం చేసేందుకు ధైర్యసాహసాలు ప్రదర్శించిన ధీరవనితల విశ్వాసాన్ని ఎలా మర్చిపోగలను. మీకందరికీ మాటిస్తున్నా దేశంలో విద్వేషం, హింసపై పోరాటం కొనసాగిస్తా. మీకు ప్రతినిధిగా నా సోదరి ప్రియాంకాగాంధీ వస్తోంది. ఇక నాకు ధైర్యంగా ఉంది. వయనాడ్ ప్రజలంతా తన కుటుంబసభ్యులని ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటాను. ధన్యవాదాలు..' అంటూ రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు.

# రాజ్యసభ ఫ్లోర్ లీడర్‌గా జేపీ నడ్డా నియామకం

- ఇంతకుముందు పీయూష్ గోయల్ ఈ సభకు బాధ్యతలు



**విశ్వంభర, ఢిల్లీ :** కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ సీనియర్ నేత జేపీ నడ్డా.. రాజ్యసభ సభా నాయకుడి గా నియమితులయ్యారు. జేపీ నడ్డాను రాజ్యసభలో సభాపక్ష నేతగా చేయాలని బీజేపీ నిర్ణయించింది. ఇంతకుముందు.. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సభలో ఈ బాధ్యతను నిర్వహించేవారు.. అయితే అతను నార్త్ ముంబై లోక్‌సభ స్థానం నుండి ఎంపీగా ఎన్నికైన తరువాత, అతను రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో.. ఈ బాధ్యతను జేపీ నడ్డాకు అప్పగించారు. ఈ నెల ప్రారంభంలో.. జేపీ నడ్డా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ బాధ్యతలను స్వీకరించారు. అంతేకాకుండా.. రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ కూడా కేటాయించారు. త్వరలో బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి నుంచి జేపీ నడ్డా రిలీవ్ అయ్యే అవకాశ ఉంది. ఈ క్రమంలో తర్వాత పార్టీ జాతీయ అధ్యక్షుడు కోసం అన్వేషణ ముమ్మరం చేసింది. కాగా.. మరికొన్ని రోజుల్లో బీజేపీ కొత్త అధ్యక్షుడిని ప్రకటించనుంది. పార్టీ చట్టాల ప్రకారం.. అన్ని రాష్ట్రాలలో 50 శాతం సంస్థ ఎన్నికలు పూర్తయిన తర్వాత మాత్రమే జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. నడ్డా రాజకీయ జీవితం 1975లో జేపీ ఉద్యమం ద్వారా.. ఓ కార్యకర్తగా వెలుగులోకి వచ్చారు. ఆ తరువాత.. అతను అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ)లో చేరాడు. పాట్నా విశ్వవిద్యాల యంలో విద్యార్థి సెంట్రల్ అసోసియేషన్ ఎన్నికలలో పోటీ చేశారు. 1977లో కార్యదర్శిగా నియమితులయ్యారు. జేపీ నడ్డా.. 1977–1979 మధ్య రాంచీ లో విద్యార్థి రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. 2012లో తొలిసారిగా హిమాచల్ ప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ఆయన.. 2014లో బీజేపీ పార్లమెంటరీ బోర్డులో సభ్యుడయ్యారు. అంతకుముం దు.. హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్ అసెంబ్లీకి 1993–2007 వరకు మూడుసార్లు ఎమ్మెల్యేగా కూడా పనిచేశారు.

# కల్తీసారా ఘటనలో 58కి పెరిగిన మృతుల సంఖ్య

**విశ్వంభర, తమిళనాడు :** తమిళనాడులోని కళ్లకురిచి నాటు సారా ఘటనలో మృతుల సంఖ్య 58కి పెరిగిందని అధికారులు వెల్లడించారు. కల్తీ మద్యం సేవించిన అనంతరం రాష్ట్రంలోని వివిధ ఆస్పత్రుల్లో 156 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో 110 మంది కళ్లకురిచి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇక కళ్లకురిచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇప్పటివరకూ 32 మంది మరణించగా, సేలం ప్రభుత్వ ఆస్పత్రిలో 18 మంది, విల్లుపురం ఆస్పత్రిలో నలుగురు, పుదుచ్చేరి ఆస్పత్రిలో ముగ్గురు మరణించారు. కల్తీ సారా ఘటనలో మరణించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించగా, కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాల్లోని పిల్లల విద్య, హాస్టల్ ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ తెలిపారు. తల్లితండ్రులను కోల్పోయిన పిల్లలకు వారికి 18 ఏండ్లు వచ్చేవరకూ నెలకు రూ. 5000 భృతి ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. తల్లితండ్రులు ఇద్దరినీ కోల్పోయిన పిల్లల పేరిట రూ. 5 లక్షల ఫిక్సడ్ డిపాజిట్ వేస్తామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిలో వారికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

# మోడీ 3.0 టీమ్

- 18వ లోక్‌సభ సెషన్స్ ప్రారంభం
- అట్టహాసంగా ఎంపీల ప్రమాణ స్వీకారం
- న్యూ లుక్‌లో అదరగొట్టిన కిషన్ రెడ్డి
- సైకిల్‌పై పార్లమెంట్‌కు టీడీపీ ఎంపీ
- లోక్‌సభలో 'నీట్' పరీక్ష నినాదం



**విశ్వంభర, ఢిల్లీ:** 18వ లోక్‌సభ సమావేశాల్లో తొలిరోజు పలు ఆసక్తికర సంఘటనలు చోటుచేసుకున్నాయి. తెలంగాణ, ఏపీ నుంచి లోక్‌సభ సభ్యులు ఇవాళ ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో పలువురు పంచెకట్టులో సంప్రదాయబద్ధంగా సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు తెలుగులో ప్రమాణం చేశారు. మరోవైపు టీడీపీ ఎంపీ ఏకంగా సైకిల్‌పై పార్లమెంట్‌కు చేరుకుని పార్టీపై తన అభిమానాన్ని చాటుకున్నారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ప్రమాణం చేశారు. కిషన్ రెడ్డి తెలుపు రంగు పంచెకట్టులో పార్లమెంటుకు చేరుకోగా, బండి సంజయ్ ఎప్పటిమాదిరి వైట్ కలర్ డ్రెస్సులో వచ్చారు. ఈ ఇద్దరూ తెలుగులోనే ప్రమాణ స్వీకారం చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎన్నికైన ఎంపీలు లోక్‌సభలో ప్రమాణ స్వీకారం చేశారు. తెలుగుదేశం పార్టీ ఎంపీలు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. రామ్మోహన్ నాయుడు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రిగా, చంద్రశేఖర్ కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రిగా, బీజేపీ ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మ భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ కేంద్ర సహాయ మంత్రి గతంలోనే బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ సమావేశాల తొలి రోజు ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. పార్లమెంట్ హౌస్కు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు సైకిల్‌పై చేరుకున్నారు. లోక్‌సభలో తొలిసారి అడుగుపెట్టిన అప్పలనాయుడు, ఢిల్లీలో తన అతిథి గృహం నుంచి సైకిల్‌పై పార్లమెంట్‌కు చేరుకున్నారు. సైకిల్ గుర్తుపై ఎంపీగా గెలిచిన తాను, మొదటి రోజు పార్లమెంట్‌లో అడుగు పెడుతున్న వేళ ఇలా సైకిల్‌పై చేరుకొని తన అభిమానాన్ని చాటుకున్నారు. కూటమికి చెందిన మిగిలిన ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీ భరత్, వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్ తెలుగులో ప్రమాణ స్వీకారం చేయగా, సీఎం రమేశ్, ఉదయ్ శ్రీనివాస్, హరీశ్ బాలయోగి, పుట్టా మహేశ్‌కుమార్ తదితరులు ఆంగ్లంలో ప్రమాణ స్వీకారం చేశారు.

## మంత్రి ధర్మేంద్రప్రదాన్‌కు నిరసన సెగ!

లోక్‌సభలో కొత్త ఎంపీల ప్రమాణస్వీకార కార్యక్రమం సందర్భంగా మోడీ 3.0 ప్రభుత్వానికి నీట్ పరీక్ష అక్రమాల సెగ తగిలింది. లోక్‌సభలో కేంద్ర మానవవనరుల శాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్ ఎంపీగా ప్రమాణం చేసేందుకు సీట్‌లో నుంచి వెళుతుండగా ప్రతిపక్ష సభ్యులు నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో సభను హోరెత్తించారు. ఇవేవీ పట్టించుకోకుండా ప్రదాన్ ఆయన ప్రమాణస్వీకారాన్ని పూర్తి చేశారు. దేశవ్యాప్తంగా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్ష పేపర్ లీక్‌తో పాటు మార్కులు ఇష్టం వచ్చినట్లుగా వేశారన్న ఆరోపణలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. నీట్ అక్రమాలపై దేశవ్యాప్త నిరసనలు జరగడంతో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ విషయంలో సీబీఐ దర్యాప్తునకు ఆదేశించింది. సీబీఐ కేసు నమోదు చేసి రంగంలోకి దిగింది.

# దేశ చరిత్రలో 'ఎమర్జెన్సీ' ఒక మచ్చ

- ఆ పొరపాటు మళ్లీ జరగొద్దు
- 18వ లోక్‌సభ తొలి సమావేశాలు ప్రారంభం
- ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీలు
- సామాన్య ప్రజల సంకల్పం నెరవేర్చుదాం
- లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకెళ్దాం
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ



**విశ్వంభర, న్యూఢిల్లీ :** 18వ లోక్‌సభ తొలి సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రధాని నరేంద్ర మోడీ సహా కొత్తగా ఎన్నికైన సభ్యులందరూ ప్రమాణ స్వీకారం చేశారు. సెషన్‌కు ముందు ప్రసంగించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ.. సభ్యులందరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈరోజు ప్రజాస్వామ్యానికి గర్వకారణమని అభివర్ణించారు. అంతేకాకుండా.. ఎమర్జెన్సీని ప్రస్తావించారు. ప్రజల అంచనాలకు అనుగుణంగా జీవించడం గురించి మాట్లాడారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో అద్భుతమైన రోజు అని ప్రధాని మోడీ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా ఈ ప్రమాణ స్వీకారోత్సవం కొత్త పార్లమెంట్ భవనంలో జరుగుతోంది. కొత్తగా ఎన్నికైన ఎంపీలందరికీ ప్రధాని మోడీ హృదయపూర్వకంగా స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. 18వ లోక్‌సభ ఏర్పాటు వల్ల సామాన్య ప్రజల సంకల్పం నెరవేరుతుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. కొత్త ఉత్సాహంతో కొత్త ఊపును, కొత్త ఎత్తులను సాధించడానికి ఇది చాలా ముఖ్యమైన అవకాశం. 2047 నాటికి మెరుగైన భారతదేశాన్ని, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలనే లక్ష్యంతో 18వ లోక్‌సభ ప్రారంభమవుతుందని మోడీ తెలిపారు. ఈ ఎన్నికలు చాలా ముఖ్యమైనవి.. ఎందుకంటే దేశ ప్రజలు వరుసగా మూడవసారి ప్రభుత్వానికి సేవ చేసే అవకాశాన్ని ఇచ్చారని అన్నారు. ఇది స్వతహాగా చాలా గర్వించదగ్గ విషయం. రాజ్యాంగ గౌరవాన్ని పాటిస్తూనే నిర్ణయాలను వేగవంతం చేయాలనుకుంటున్నాను. సభ్యులందరినీ కలుపుకొని 2047 వికసిత భారత్ సంకల్పం. ఆ లక్ష్యాన్ని నెరవేర్చే దిశగా సాగుతాం. కొత్త లక్ష్యాలు నిర్దేశించుకుని మనమంతా ముందుకెళ్దాం" అని ఎంపీలకు పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, వారసత్వంలో 18వ సంఖ్యకు గొప్ప సాత్విక విలువ ఉందని చెప్పారు. మోడీ తన ప్రసంగంలో 'ఎమర్జెన్సీ' గురించి ప్రస్తావించారు. భారతదేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలపై నమ్మకం ఉన్నవారికి జూన్ 25 మరపురాని రోజు అని తెలిపారు. భారత ప్రజాస్వామ్యం జూన్ 25తో తుడిచిపెట్టుకుపోయి 50 ఏళ్లు పూర్తవుతోంది. దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ ఓ మచ్చలా మిగిలిపోయింది. 50 ఏళ్ల క్రితం జరిగిన పొరపాటు పునరావృతం కాకూడదు" అని మోడీ పేర్కొన్నారు. తమ బాధ్యతలు మూడు రెట్లు పెరిగాయి.. మూడో టర్మ్‌లో మూడు రెట్లు కష్టపడి పనిచేస్తామని దేశప్రజలకు హామీ ఇస్తున్నానని మోడీ తెలిపారు. కొత్త ఎంపీల పట్ల దేశం చాలా అంచనాలు పెట్టుకుందని ప్రధాని మోడీ చెప్పారు. ప్రజాప్రయోజనాలు, ప్రజా సేవ కోసం ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఎంపీలను కోరారు. అభివృద్ధి చెందిన భారతదేశం అనే మన సంకల్పాన్ని నెరవేర్చడం మనందరి బాధ్యత. అందరూ కలిసి ఆ బాధ్యతను నిర్వర్తించాలని మోడీ తెలిపారు.

# గత పదేళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ

- ఇంకెన్నాళ్లు దానిపై మాట్లాడతారు?
- ఆ వంకతో ఇంకెన్నాళ్లు పాలిస్తారు
- ప్రధాని మోడీపై ఖర్గే ధ్వజం



**విశ్వంభర, ఢిల్లీ :** లోక్‌సభ సమావేశాలు ప్రారంభమైన వేళ ప్రధాని మోడీ ఇందిరా గాంధీ హయాంలోని ఎమర్జెన్సీ గురించి ప్రస్తావించారు. ఈ క్రమంలో ఆయన కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. రేపటికి (జూన్ 25) ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు నిండుతాయని, ఇది దేశ ప్రజాస్వామ్యానికి నల్ల మచ్చ అని మోడీ అభివర్ణించారు. భారత రాజ్యాంగాన్ని ఎలా రద్దు చేశారో, దేశాన్ని జైలుగా ఎలా మార్చారో కొత్తతరం మరిచిపోదని, 50 ఏళ్ల క్రితం జరిగిన పొరపా టు మళ్లీ పునరావృతం కాకూడదని మోడీ వ్యాఖ్యానించా రు. కాగా, ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. 'ప్రధాని మోడీ ఎమర్జెనీ గురించి పదేపదే మాట్లాడతారు. వందసార్లైనా ఈ అంశాన్ని ఆయన లేవనెత్తుతారు. గత పదేళ్లుగా ప్రధాని దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ విధించారు. మోడీ ఇంకెన్నిసార్లు ఎమర్జెన్సీ గు రించి మాట్లడతారు? దాని వంకతో ఇంకెన్నాళ్లు పాలిస్తా రు? అని ఆయన ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన నీట్ ఎగ్జామ్, మణిపూర్‌లో జరుగుతున్న హింస, ఇటీవల పశ్చిమబెంగాల్‌లో జరిగిన రైలు ప్రమాదంపై వంటి విషయాలపై మోడీ మీడియా ముందు మాట్లాడలే దు. వీటి గురించి ఆయన మాట్లాడినట్లైతే బాగుంటుంది. అస్సాం రాష్ట్రంతోపాటు, ఈశాన్య రాష్ట్రాల్లో వరదలు ఉన్నాయి. దేశంలో ద్రవ్యోల్బణం, రూపాయి పతనం, ఎగ్జిట్ పోల్– స్టార్ మార్కెట్ స్కామ్, కుల గణనపై వంటి వాటిపై మోడీ మౌనంగా ఉన్నారు.' అని ఖర్గే సామాజిక మాధ్య మం ఎక్స్‌లో చేసిన పోస్టులో మండిపడ్డారు. ఇటీవల జరిగి న సార్వత్రిక ఎన్నికల్లో మోడీని వ్యతిరేకించి ప్రజలు తమ కు మద్దతునిచ్చారు. ప్రధాని బాధ్యతలు చేపట్టిన తర్వాత పని చేయాలి. ఇప్పుడు దేశ ప్రజలకు కావాల్సిందల్లా.. మీ పనే కాని, నినాదాలు కాదు అని మీరు గుర్తుంచుకోండి అని ఖర్గే తన పోస్టులో తెలిపారు.



# ఏకపక్ష చర్చలను వ్యతిరేకిస్తున్నాం

## ప్రధాని మోడీకి సీఎం మమతా బెనర్జీ లేఖ

**విశ్వంభర, పశ్చిమ బెంగాల్:** తీస్తా నదీ జలాల పంపిణీపై ఇటీవల బంగ్లాదేశ్, కేంద్ర సర్కారు మధ్య చర్చలు జరిగా యి. ఆ చర్చలను ఏకపక్షంగా నిర్వహించినట్లు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆమె ప్రధాని మోదీకి లేఖ రాశారు. బంగ్లాదేశ్‌తో జరిగిన చర్చల కు తమను ఆహ్వానించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకోకుండా అలాంటి చర్యలు, చర్చలు చేపట్టడం సరికాదు అని, ఆమోదించలేమని ఆమె అన్నారు. గంగా నది, తీస్తా నది జలాల షేరింగ్ అంశంపై ఇటీవల ప్రధాని షేక్ హసీనా, మోదీ మధ్య చర్చలు జరిగాయి. భారత్, బంగ్లాదేశ మధ్య ఉన్న ఫరక్కా ఒప్పందాన్ని రెన్యువల్ చేయాలన్న ఆలోచనలో కేంద్ర సర్కారు ఉన్నట్లు తెలుస్తోం దని, 1996లో కుదిరిన ఆ చట్టం.. 2026లో ముగిసి పోనున్నదని, ఆ ఒప్పందం ప్రకారం భారత్, బంగ్లా మధ్య నీటి పంపిణీ జరుగుతుందని ఆమె అన్నారు. పశ్చిమ బెం గాల్‌పై ఆ ఒప్పంద ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఆమె తన లేఖలో తెలిపారు. అలాంటి ఒప్పందాల వల్ల బెంగాల్ ప్రజలు తీవ్ర ప్రభావానికి గురవుతారన్నారు. నీట్ పరీక్షా వ్యవస్థను రద్దు చేయాలని కూడా తన లేఖలో దీదీ కోరారు. పేపర్ లీకేజీని దృష్టిలో పెట్టుకుని, ఆ పరీక్షలను రాష్ట్రాలే నిర్వహించే విధంగా వ్యవస్థను రీస్టోర్ చేయాలని సీఎం మమతా కోరారు.

# నారా లోకేష్ సింప్లిసిటీ

- మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన లోకేష్
- ఎలాంటి ఆర్భాటాలు వద్దని సూచనలు
- వ్యూహాత్మకంగా వ్యవహరించిన యువ నేత



**విశ్వంభర, విజయవాడ :** టీడీపీ యువ నాయకుడు, మంత్రి నారా లోకేష్ సింప్లిసిటీ బాగుందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. మంత్రిగా ప్రమాణం అనంతరం.. ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. దీనిని కొనసాగిస్తున్నారు కూడా. ఈ క్రమంలో సాధారణ ప్రజలకు కొంత వెసులుబాటు కూడా కల్పించారు. దీంతో అందరూ హ్యాపీగా వెళ్లి నారా లోకేష్‌ను కలుస్తున్నారు. తాజాగా సచివాలయం నాలుగో బ్లాక్ లోని ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ తన కుర్చీకి ఎలాంటి ఆర్భాటాలు వద్దని తెలిపారు. ఈ క్రమంలో తన కుర్చీకి కట్టిన తెల్లటి టవల్‌ను స్వయంగా తీసేశారు. ఈ సింప్లిసిటీ బాగానే ఉంది. అయితే.. ముమ్ముందు కూడా దీనిని కొనసాగిస్తే బెటర్‌గానే ఉంటుందని అంటున్నారు పరిశీలకు లు. వ్యక్తిగత కార్యాచరణలో ఉన్న సింప్లిసిటీ వ్యవహారాల్లోకి కూడా రావాల్సి ఉంటుంది. కొన్నాళ్ల కిందట చంద్రబాబు కూడా.. కూటమి పార్టీల సమావేశంలో తనకు వేసిన ప్రత్యేక కుర్చీని మార్చుకుని అందరితో సమానంగానే కూర్చున్నారు అంతేకాదు మంత్రులు కూడా సింప్లిసిటీ పాటించేలా చూడాల్సి ఉంది. సహ జంగా ఉన్నతస్థానాల్లో ఉన్న నాయకులు ఎలా వ్యవహరిస్తారో.. కిందిస్థాయి వారు కూడా.. అలానే ముందుకు సాగుతారు కాబట్టి ఇబ్బంది ఉండకపోవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పడిన కొత్తకావడం.. ఎమ్మెల్యే అనంతరం మంత్రి కావడంతో నారా లోకేష్ కొంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. మున్ముందు కూడా.. దీనిని కొనసాగిస్తే.. ఖచ్చితంగా ఫీల్ గుడ్ మినిస్టర్ అనే పేరు రావడం ఖాయం. ఆయన కొన్ని ఫైళ్లను చూసి సంతకం చేశారు. అధికారులు, టీడీపీ నేతలు సచివాలయానికి బాధ్యతలను స్వీకరించడానికి వస్తుండటంతో పెద్దయెత్తున స్వాగతం పలికారు. పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు. బాధ్యతలను స్వీకరిం చిన తర్వాత ఆయన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ, పెన్షన్ల పెంపునకు ఆమోద ముద్ర

- ఏపీ కేబినెట్ ఏకగ్రీవ నిర్ణయం
- నూతన ప్రభుత్వ తొలి కేబినెట్ భేటీ
- కీలక అంశాలపై నిర్ణయాలు
- ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై చర్చలు
- వైద్య ఆరోగ్య విశ్వ విద్యాలయానికి ఎన్టీఆర్ పేరు
- కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి



**విశ్వంభర, అమరావతి :** ఏపీ కేబినెట్ సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వివరించారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ ఎన్నికల వేళ ఏం చెప్పారో అవన్నీ భేటీలో చర్చించామన్నారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ వేస్తామని చెప్పి.. అందుకు అనుగుణంగా 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపిన ట్లు చెప్పారు. ప్రతి ఆరు నెలలకోసారి టెట్‌ను నిర్వహిం చాల్సి ఉండగా.. గత ప్రభుత్వం నిర్వహించకపోవడంతో నిరుద్యోగులు నష్టపోయేలా వ్యవహరించిందన్నారు. 80శాతం డీఎస్సీ మార్కులు, 20శాతం టెట్ మార్కులు కలిపి టీచర్ ఉద్యోగ నియామకాలకు అర్హతగా తీసుకుంటున్నామని.. టెట్ జరుపకపోవడంతో నిరు ద్యోగులు టెట్ మార్కులను మెరుగుపరుచుకునే అవకాశం కోల్పోయారన్నారు.

### ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై సైతం చర్చించాం

కేబినెట్‌లో నాణ్యమైన విద్య అందించే విషయంపై సీఎం ప్రస్తావించారని, అందుకు జాతీయ విద్యా విధానాన్ని పరిశీలించి.. విద్యా ప్రమాణాలు పొందించాలని ఆదేశించారన్నారు. కేబినెట్‌లో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై సైతం చర్చింమన్నారు. ఈ చట్టాన్ని బీజేపీ అమలు చేశామని గత ప్రభుత్వం చెప్పిందని.. కేంద్రం, నీతి ఆయోగ్ ప్రతిపాదించిన చట్టం, అప్పటి ప్రభుత్వం ఆమోదించిన చట్టానికి తీవ్రమైన వైరుధ్యాలు ఉన్నాయన్నారు. అలాగే, కేబినెట్‌లో పెన్షన్ పెంపుపై సైతం కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామన్నారు. 65.03లక్షల మందికి లబ్ధి చేకూరేలా పెన్షన్ల పెంపునకు కేబినెట్ ఆమోదం తెలిపిం దన్నారు. పెన్షన్ల పెంపుతో ప్రభుత్వంపై నెలకు రూ.810 కోట్ల భారం పడుతుందన్నారు. సచివాలయ ఉద్యోగులే లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి పెన్షన్లు అందిస్తారని.. వలంటీర్ల అంశంపై చర్చించామని.. వారిని ఎలా ఉపయోగించుకోవాలనే విషయంపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు.

### శ్వేతపత్రాలు విడుదల చేస్తాం

రాష్ట్రంలో స్కిల్ సెన్సస్ చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు కేబినెట్ నిర్ణయిం చిందన్నారు. తొలుత 123 క్యాంటీన్లను పునరుద్ధరిస్తార ని.. మిగతా వాటిని త్వరలోనే పునరుద్ధరించనున్నట్లు తెలిపా రు. త్వరలోనే టెండర్లు ఖరారు చేయనున్నట్లు చెప్పారు. వైద్య ఆరోగ్య విశ్వ విద్యాలయానికి ఎన్టీఆర్ పేరును పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. ఏజీగా శ్రీరామ్, అదనపు ఏజీగా పొన్నవోలు సుధాకర్‌రెడ్డి రాజీనామా చేయడంతో ఆయా పదవులు ఖాళీగా ఉన్నాయని.. ఏజీగా దమ్మాలపాటి శ్రీనివాస్ నియామ కానికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. గంజాయి వ్యాప్తిని అరికట్టేం దుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామని.. కార్పొరేషన్లలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు అవసర మైన చర్యలు తీసుకోవాలని కేబినెట్ నిర్ణయించిందన్నారు. అమరావతి రాజధాని, పోలవరం, విద్యుత్, శాంతిభద్రత ల అంశాలపై జూన్ నుంచి జూలై 18 వరకు శ్వేత పత్రాలు విడుదల చేయనున్నట్లు మంత్రి వివరించారు.



# తెలుగు ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి

- పంటలు సమృద్ధిగా పండాలని దేవుని పార్థించాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న తెలంగాణ నేతలు

**విశ్వంభర, శ్రీశైలం :** ప్రపంచంలో తెలుగువారు ఎక్కడ ఉన్న వారి అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని, శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబిక అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆశించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. సోమవారం ఆయన కుటుంబ సభ్యులతో పాటు, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేష్, మెగా రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి శ్రీశైల మల్లికార్జున దర్శనం చేసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇరు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి, ఋతుపవనాలు బలంగా వీచాలని, పంటలు సమృద్ధిగా పండాలని ఆ దేవుని ప్రార్థించాను అని తెలిపారు. కరువు కాటకాలు అనేవి లేకుండా అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని, ప్రపంచంలో తెలుగువారు ఎక్కడ ఉన్నా ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఋతుపవనాలు రాకముందే శ్రీశైలం హైడల్ ప్రాజెక్టును సమీక్షించి తద్వారా పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తికి కావలసిన చర్యలు చేపట్టడమే తన పర్యటన ఉద్దేశం అన్నారు. నాటి కాంగ్రెస్ పెద్దలు ముందుచూపుతో నిర్మించిన బహుళార్థక సార్థక ప్రాజెక్టుతో మన జీవితాల్లో వెలుగులు నిండాయి. అమర జీవులకు నివాళులు అన్నారు. శ్రీశైలం హైడల్ ప్రాజెక్టు ద్వారా అత్యధిక స్థాయిలో విద్యుత్తు ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెప్పపాటు కూడా కరెంటు కోతలు లేవు, 2029-30 వరకు కావలసిన విద్యుత్ తెలంగాణ రాష్ట్రంలో అందుబాటులో ఉందని ఆయన తెలిపారు.



# వచ్చే నెలలో ఏపీ బడ్జెట్ సమావేశాలు

- పూర్తిస్థాయి బడ్జెట్‌పై సర్కార్ కసరత్తు
- ముగియనున్న ఓటాన్ అకౌంట్ బడ్జెట్ గడువు
- జూలై 3వ వారంలో నిర్వహించేలా ప్లాన్

**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం.. పూర్తిస్థాయి బడ్జెట్‌పై కసరత్తు ప్రారంభించింది.. ఎన్నికల కంటే ముందు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది అప్పటి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సర్కార్.. అయితే, వచ్చే నెలాఖరుతో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ గడువు ముగియనుంది.. ఈ నేపథ్యంలో.. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సిద్ధం అవుతోంది చంద్రబాబు నాయుడు గవర్నమెంట్.. దీని కోసం వచ్చే నెల (జులై) మూడోవారంలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు రెడీ అవుతోంది.. ఈ సమావేశాల్లో ఆగస్టు 2024 నుంచి మార్చి 2025 వరకు అవసరమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టి.. ఆమోదం తెలపడానికి ఈ అసెంబ్లీ సమావేశాలను ప్రత్యేకంగా నిర్వహించనున్నారు..
అయితే, త్వరలో అసెంబ్లీ సమావేశాల తేదీలు ఖరారయ్యే అవకాశం ఉంది.. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ గడు వు ముగియనున్న నేపథ్యంలో.. రాష్ట్రంలో తా జాగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా పూర్తిస్థాయి బడ్జెట్‌ను రూపొందించి.. అసెంబ్లీలో ప్రవేశపెట్టడం.. చర్చ అనంత రం ఆమోదింపజేయడం అజెండాగా ఈ సమావేశాలు సాగనున్నాయి.



# డిప్యూటీ సీఎం పవన్‌తో నిర్మాతల భేటీ

- ఏపీలో సినీ రంగం విస్తరణపై చర్చ!
- భేటీతో పాల్గొన్న సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్
- హాజరైన అల్లు అరవింద్, అశ్వనీదత్, సురేష్‌బాబు, దిల్‌రాజ్ తదితరులు

**విశ్వంభర, విజయవాడ:** ప్రముఖ సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో తెలుగు సినీ ప్రముఖులు భేటీ అయ్యారు. విజయవాడలోని పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఈ భేటీ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా తెలుగు చిత్ర పరిశ్రమ విజయవాడకు కదిలొచ్చింది. ప్రముఖ నిర్మాతలందరూ వచ్చి పవన్‌కల్యాణ్‌తో భేటీ కావడంతో ఆంధ్రప్రదేశ్‌లో కూడా తెలుగు చలన చిత్ర రంగ పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకునేందుకు అడుగులు ముందుకు పడనున్నాయనే చర్చ సాగుతోంది. ఈ సారి తెలుగు సినిమా రంగానికి ఆంధ్రప్రదేశ్‌లో మంచి జరుగుతుందనే అభిప్రాయం ప్రముఖుల్లో వ్యక్తం అవుతోంది. రాష్ట్రం విడిపోయిన తర్వాత గత రెండు ప్రభుత్వాల్లో ఇలాంటి భేటీ జరగ లేదు. రాష్ట్రం విడిపోయిన తర్వాత తొలిసారి ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కానీ, తర్వాత ఏర్పడిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో కానీ ఇంత మంది సినీ ప్రముఖులు వచ్చి భేటీ అయింది లేదు. సహజంగా సినీమా పరిశ్రమ అంతా హైదరాబాద్‌లో ఉండటం, అక్కడే సినీ ప్రముఖులంతా ఉండటంతో తెలంగాణ ప్రభుత్వాన్ని కలవడం, సమస్యలపై చర్చించడం, పరిష్కరించుకోవడం జరుగుతుంది. ఏదైనా పెద్ద సినిమా విడుదల సమయంలో ఏపీకి రావ డం, ఇక్కడ ప్రభుత్వ పెద్దలను కలవడం, టిక్కెట్లు విష యంలో మాట్లాడుకోవడం జరిగింది. అయితే ఈ సారి ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వం ఏర్పడటంతో తెలుగు చిత్ర పరిశ్రమ పెద్దల్లో ఆశలు చిగురించాయి. ఈ నేప థ్యంలో ప్రభుత్వ పెద్దలను కలవాలనుకోవడం విశేషం. పవన్ కల్యాణ్ సినిమా పరిశ్రమకు చెందిన వారు కావడం, మెగాస్టార్ చిరంజీవి సోదరుడు కావడం, తెలుగు అగ్ర నటుడుగా కొనసాగుతుండం, అలాంటి వ్యక్తి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలకంగా మారడం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రి స్థానంలో ఉండటం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ సైతం జనసేన నేత కావడంతో తెలుగు చిత్ర పరిశ్రమ సమస్యలు చర్చించి పరిష్కరించుకోవడం సులువు అవుతుందని భావించిన టాలీవుడ్ ప్రముఖులు కలిసేందుకు ఆసక్తి కనబరిచారు.

హైదరాబాద్ నుంచి గన్నవరం ఎయిర్ పోర్టులో దిగిన తెలుగు సినీ నిర్మాతలు నేరుగా విజయవాడలోని పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అప్పుడే తొలి మంత్రి వర్గ సమావేశం ముగించుకొని క్యాంపు కార్యాలయానికి చేరుకున్న పవన్ కల్యాణ్.. సినిమా నిర్మాతలతో భేటీ అయ్యారు. చిత్ర పరిశ్ర అభివృద్ధి, చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, ఆంధ్రప్రదేశ్‌లో సినీ రంగం విస్తరణకు ఉన్న అవకాశాలు, టిక్కెట్ల రేట్లు వంటి అంశాలపై చర్చించారు. సినీ పరిశ్రమ సమస్యలను పవన్ కల్యాణ్‌కు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటే బాగుంటుందనే అంశాలపై కూడా ప్రధానంగా చర్చించారు. పవన్ కల్యాణ్‌ను కలిసిన వారిలో ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వనీదత్, డి సురేష్‌బాబు, ఏఎం రత్నం, ఎస్ రాధాకృష్ణ, దిల్ రాజు, ఎన్వీ ప్రసాద్, భోగపల్లి ప్రసాద్, డీవీవీ దానయ్య, సుప్రియ, బన్ని వాసు, నాగవంశీ, వంశీకృష్ణ, రవిశంకర్, నవీన్ యర్నేని, టీజీ విశ్వప్రసాద్ వంటి ప్రముఖులు ఉన్నారు. అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసేందుకు అప్పాయింట్‌మెంట్ కావాలని పవన్ కల్యాణ్‌ను కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన పవన్ కల్యాణ్ అప్పాయింట్‌మెంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు బదులిచ్చారు. పవన్ కల్యాణ్‌తో భేటీ అనంతరం అల్లు అరవింగ్ మీడియాతో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి సినీ పరిశ్రమ తరపున అభినందించినట్లు తెలిపారు. అందరం కలిసి సరదగా కాసేపు మాట్లాడుకున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు ఇప్పించాలని కోరినట్లు చెప్పారు. అప్పాయింట్‌మెంట్ ఫిక్స్ అయితే తెలుగు చిత్ర పరిశ్రమలోని అన్ని అసోసియేషన్లు కలిసి వచ్చి సీఎం చంద్రబాబును అభినందించేందుకు వస్తామన్నారు. సీఎం చంద్రబాబుతో కూడా తెలుగు చిత్ర పరిశ్రమ సమస్యల గురించి చర్చిస్తామన్నారు. పరిశ్రమలో చాలా సమస్యలున్నాయని, టెక్కెట్ల రేట్లు పెంపుదల అనేది చాలా చిన్న విషయమని, ముఖ్యమంత్రిని కలిసినప్పుడు అన్ని సమస్యలకు సంబంధించిన అన్ని అంశాలను రెప్రెజెంటేషన్ రూపంలో తెలియజేస్తామని చెప్పారు.



# పవన్‌ను కలిసిన హెూంమంత్రి అనిత

**విశ్వంభర, విజయవాడ:** ఏపీ హెూంమంత్రి వంగలపూడి అనిత, పలువురు పోలీసు ఉన్నతాధికారులు ఈ సాయంత్రం విజయవాడలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిశారు. విజయవాడలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన అనిత... పవన్ కల్యాణ్ కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇరువురు పలు అంశాలపై చర్చించుకున్నారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ పీహెచ్ డీ రామకృష్ణ, డీసీపీ ఆదిరాజ్ రాణా కూడా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ను కలిశారు. వారు పవన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. పవన్ కల్యాణ్ ఈ ఉదయం నుంచి వరుస సమావేశాలతో బిజీగా ఉన్నారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర క్యాబినెట్ భేటీకి హాజరైన పవన్ కల్యాణ్... అనంతరం టాలీవుడ్ నిర్మాతలతో సమావేశమయ్యారు.

# ప్రయాణికులకు శుభవార్త

## మళ్లీ పట్టాలెక్కిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్

**విశ్వంభర, విశాఖపట్నం:** తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను రైల్వే శాఖ మళ్లీ అందుబాటులోకి తీసుకువచ్చింది. విజయవాడ డివిజన్‌లో ఆధునికీకరణ పనులు చేపట్టడంతో దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసింది. నిడదవోలు- కడియం సెక్షన్‌లో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో జూన్ 23 నుంచి ఆగస్టు 11 వరకు జన్మభూమి, రత్నాచల్, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అయితే రైళ్ల రద్దుతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పునరుద్ధరించాలని విజ్ఞప్తులు రావడంతో తిరిగి విశాఖ-లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 25 నుంచి మామూలుగానే నడపాలని నిర్ణయించింది. జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌తో పాటు విజయవాడ-కాకినాడ పోర్టు, చెంగల్‌పట్టు- కాకినాడ పోర్టు రైళ్లను కూడా పునరుద్ధరిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.



# సెమీస్‌కు టీమిండియా

## ఆస్ట్రేలియాపై 24 పరుగుల తేడాతో రోహిత్ సేన విజయం

- సూపర్ 8లో మూడు మ్యాచ్‌ల్లో హవా
- దుమ్మురేపిన కెప్టెన్ రోహిత్ శర్మ
- హెడ్ పోరాటం వృధా
- 27న ఇంగ్లాండ్‌తో సెమీ పోరు



**విశ్వంభర, స్పోర్ట్స్:** ఆస్ట్రేలియాపై టీమిండియా ప్రతీకార విజయం సాధించింది. గతేడాది వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్‌లో ఓడించి టైటిల్‌ను దూరం చేసిన ఆసీస్‌ను.. ఇప్పుడు టీ20 ప్రపంచకప్ 2024 కీలక మ్యాచ్‌లో భారత్ చిత్తుచేసింది. కాస్త రివేంజ్ తీర్చుకుంది. అలాగే, సూపర్ 8లో మూడింట మూడు గెలిచి సెమీఫైనల్‌కు టీమిండియా దూసుకెళ్లింది. సెయింట్ లూసియా వేదికగా సోమవారం జరిగిన టీ20 వరల్డ్ కప్ 2024 గ్రూప్1 సూపర్-8 మ్యాచ్‌లో టీమిండియా 24 పరుగుల తేడాతో ఆస్ట్రేలియాపై అద్భుత విజయం సాధించింది. సెమీ-స్‌కు రోహిత్ శర్మ సేన చేరింది.

### దంచికొట్టిన హెడ్

206 పరుగుల భారీ లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ (43 బంతుల్లో 76 పరుగులుబీ 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) దుమ్మురేపాడు. దూకుడైన ఆటతో రాణించాడు. గతేడాది డబ్ల్యూటీసీ ఫైనల్, వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో టీమిండియాకు దెబ్బేసిన హెడ్ మరోసారి టెన్షన్ పెట్టాడు. అయితే, 17వ ఓవర్ వరకు పోరాడిన హెడ్‌ను భారత పేసర్ బుమ్రా ఔట్ చేశాడు. మొత్తంగా ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 7 వికెట్లకు 181 పరుగులు చేసి ఓటమి పాలైంది. డేవిడ్ వార్నర్ (6)ను భారత పేసర్ అర్షదీప్ సింగ్ తొలి ఓవర్లోనే ఔట్ చేశాడు. ఆ తర్వాత హెడ్ దూకుడు చూపాడు.

### అక్షర్ పటేల్ సూపర్ క్యాచ్

టీమిండియా ప్లేయర్ అక్షర్ పటేల్ ఈ మ్యాచ్‌లో సూపర్ క్యాచ్ పట్టాడు. 9వ ఓవర్లో కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో ఆసీస్ కెప్టెన్ మిచెల్ మార్ష్ భారీ షాట్ కొట్టగా.. డీప్ మిడ్ వికెట్ బౌండరీ దగ్గర ఎగిరి ఒక్కో చేత్తో అద్భుతంగా క్యాచ్ అందుకున్నాడు అక్షర్. బౌండరీ లైన్‌కు తగలకుండా జంప్ చేశాడు. సిక్స్ వెళ్లే బంతిని క్యాచ్‌గా మలిచాడు అక్షర్. 87 పరుగులకు ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి ఆసీస్ పటిష్టమైన స్థితిలో ఉన్నప్పుడు మార్ష్ క్యాచ్ పట్టి మ్యాచ్‌ను టర్న్ చేశాడు అక్షర్ పటేల్. టీ20 ప్రపంచకప్ 2024 సెమీఫైనల్‌లో ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది. జూన్ 27వ తేదీన రాత్రి 8 గంటలకు గయానా వేదికగా ఈ సెమీస్ జరగనుంది.

### రోహిత్ సునామీ

భారత కెప్టెన్ రోహిత్ శర్మ సునామీ ఇన్నింగ్స్ ఆడటంతో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ భారీ స్కోరు చేసింది. 41 బంతుల్లోనే 224 స్ట్రైక్ రేట్‌తో 92 పరుగులు చేశాడు రోహిత్. 7 ఫోర్లు, 8 సిక్స్‌లతో దుమ్మురేపాడు. స్టార్క్ వేసిన మూడో ఓవర్లో హిట్‌మ్యాన్ ఏకంగా నాలుగు సిక్స్‌లు, ఓ ఫోర్ బాది చుక్కలు చూపించాడు. 19 బంతుల్లోనే అర్ధ శకతం మార్క్ చేరి.. ఆ తర్వాత కూడా దూకుడుగా ఆడాడు. అయితే, 8 పరుగుల తేడాతో సెంచరీ మిస్ చేసుకున్నాడు. మొత్తంగా తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగుల భారీ స్కోరు చేసింది.

# సారథిగా శుభ్‌మన్ గిల్!

- జింబాబ్వే పర్యటన షెడ్యూల్ ప్రకటన
- 15 మందితో జట్టును ప్రకటించిన బీసీసీఐ
- లక్కీ చాన్స్ కొట్టేసిన ఐపీఎల్ ప్లేయర్స్



**విశ్వంభర, స్పోర్ట్స్:** టీ20 ప్రపంచకప్ ముగియకముందే భారత జట్టు మరో పోట్టి సిరీస్‌కు సన్నద్ధం కానుంది. మెగా టోర్నీ ముగిసిన వారంలోపే జింబాబ్వేలో టీమిండియా పర్యటించనుంది. ఇప్పటికే ఈ సిరీస్‌ను ఖరారు చేసిన భారత క్రికెట్ బోర్డు సోమవారం మ్యాచ్ తేదీలను వెల్లడించింది. యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా 15 మందితో కూడిన స్క్వాడ్‌ను అజిత్ అగార్ నేతృత్వంలోని సెలెక్టర్లు వెల్లడించారు. వికెట్ కీపర్లుగా సంజూ శాంసన్, రాంచీ టెస్టు హీరో ధ్రువ్ జురెల్ లు చోటు దక్కించుకున్నారు. ఐపీఎల్ 17వ సీజన్‌లో అద్భుతంగా రాణించిన కుర్రాళ్లు అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్, నితీశ్ కుమార్, తుషార్ దేశ్‌పాండేలు తొలిసారి బ్లూ జెర్సీ వేసుకోనున్నారు. సీనియర్ పేసర్ ఖలీల్ అహ్మద్ సైతం బృందంలో ఉన్నాడు. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జూలై 6వ తేదీన జరిగే తొలి మ్యాచ్‌తో టీ20 సిరీస్ ఆరంభం కానుంది. భారత్, జింబాబ్వే జట్లు జూలై 6వ తేదిన తొలి మ్యాచ్ ఆడనున్నాయి. మొత్తం ఐదు మ్యాచ్‌లకు హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదిక కానుంది. జూలై 7 వ తేదీన రెండో టీ20, జూలై 10న మూడో టీ20, జూలై 13న నాలుగో టీ20, జూలై 14న ఐదో టీ20 జరుగనుంది. మధ్యాహ్నం 1 గంటకు మ్యాచ్‌లు షురూ అవుతాయి.

### జింబాబ్వే సిరీస్‌కు ఆయనేనా!

జింబాబ్వే పర్యటనకు పలువురు సీనియర్లను బీసీసీఐ పక్కన పెట్టనుంది. టీ20 వరల్డ్ కప్ ఆడుతున్నకెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, పేసర్ జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యాలతో పాటు సూర్యకుమార్ యాదవ్‌కు భారత బోర్డు విశ్రాంతి ఇవ్వనుంది. దాంతో, యువకులతో నిండిన జట్టును జింబాబ్వేకు పంపాలని సెలెక్టర్లు భావిస్తున్నారు. ఇప్పటివరకూ ప్రధాన కోచ్ ఎవరో తేలలేదు. టీ20 వరల్డ్ కప్ ముగిసేలోపు గౌతం గంభీర్‌ను హెడ్‌కోచ్ గా ప్రకటిస్తారో? లేదో తెలియదు. దాంతో, నేషనల్ క్రికెట్ అకాడమీ చైర్మన్‌గా కొనసాగుతున్న వీవీఎస్ లక్ష్మణ్ జింబాబ్వే సిరీస్‌కు కోచ్‌గా వ్యవహరించే చాన్స్ ఉంది.

**టీమిండియా జట్టు :** శుభ్‌మన్ గిల్(కెప్టెన్), యశస్వీ జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, రింకూ సింగ్, సంజూ శాంసన్(వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్(వికెట్ కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, రియాన్ పరాగ్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్, ముకేశ్ కుమార్, తుషార్ దేశ్‌పాండే.

## ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్‌కు టీమిండియాలో చోటు!

**విశ్వంభర, స్పోర్ట్స్:** సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ తొలిసారి టీమిండియా పిలుపును అందుకున్నాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో సంచలన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ పంజాబ్ ఆటగాడు జింబాబ్వే పర్యటనకు వెళ్లే భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఐదు టీ20ల సిరీస్ కోసం ఈ పర్యటనకు వెళ్లే భారత జట్టును భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) సోమవారం ప్రకటించింది. 15 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ వెల్లడించారు. అందరూ ఊహించినట్లుగానే ఈ సిరీస్ నుంచి సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతి కల్పించారు. ఐపీఎల్ 2024 సీజన్‌లో సత్తా చాటిన ప్లేయర్లకు సెలెక్టర్లు అవకాశం కల్పించారు. ఈ పర్యటనలో శుభ్‌మన్ గిల్ భారత జట్టును నడిపించనున్నాడు. అభిషేక్ శర్మతో పాటు యశస్వి జైస్వాల్, రుతురాజ్ గైక్వాడ్, రింకూ సింగ్, సంజూ శాంసన్, ధ్రువ్ జురెల్, నితీష్ కుమార్ రెడ్డి, రియాన్ పరాగ్ ఈ పర్యటనకు ఎంపికైన వారిలో ఉన్నారు. ఐపీఎల్ 2024 సీజన్‌లో అభిషేక్ శర్మ అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో పవర్ ప్లేలో పరుగుల మోత మోగించాడు. సన్‌రైజర్స్ రికార్డ్ స్కోర్లు నమోదు చేయడంలో అభిషేక్ శర్మ కీలక పాత్ర పోషించాడు. అతని పవర్ హిట్టింగ్‌కు ఫిదా అయిన సెలెక్టర్లు జాతీయ జట్టుకు ఎంపిక చేశారు. జింబాబ్వే పర్యటనలోనూ అతను అదే జోరు కొనసాగిస్తే అభిషేక్ శర్మ టీమిండియాకు రెగ్యులర్ ఓపెనర్‌గా మారే అవకాశం ఉంది.



# భారీగా పెరగనున్న హీరో బైక్స్ ధరలు

**విశ్వంభర, ముంబై:** దేశంలోని అతిపెద్ద ద్విచక్ర వాహన సంస్థ హీరో మోటోకార్ప్ తన కస్టమర్లకు బ్యాడ్ న్యూస్ చెప్పింది. జూలై 1 నుంచి ధరలు పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. దీని ప్రకారం మీరు జూన్ 30 లోపు హీరో టూ వీలర్లను కొనుగోలు చేస్తే తక్కువ ధరకే లభిస్తాయి. ఇన్‌పుట్ ధర పెరగడం వల్ల ద్విచక్ర వాహనాల ధరలను పెంచాల్సి వచ్చిందని హీరో మోటోకార్ప్ తెలిపింది. వచ్చే నెల నుండి మీరు కొత్త హీరో బైక్ లేదా స్కూటర్ కొనుగోలు చేయడానికి ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉంటుంది. కొన్నేళ్ల క్రితం వరకు వాహనాల ధరలు ఏడాదికి ఒక్కసారి మాత్రమే పెరిగేవని, కానీ ఇప్పుడు ఏడాదికి రెండు, మూడు సార్లు ధరలు పెంచుతున్నారు. హీరో మోటోకార్ప్ బైక్‌లు, స్కూటర్ల ధరలను రూ. 1500 వరకు పెంచింది. ఇది జూలై 1 నుండి అమలులోకి వస్తుంది. ధరల పెరుగుదల అనేది మోడల్, దాని వేరియంట్‌లపై ఆధారపడి ఉంటుంది. అంటే బైక్ ఎంత ఖరీదైతే అంత ధర పెరుగుతుంది. ప్రస్తుతం హీరో వద్ద 100 సీసీ నుంచి ప్రీమియం బైక్‌లు ఉన్నాయి. కంపెనీ స్కూటర్ పోర్ట్‌ఫోలియో కూడా చాలా పెద్దది. కంపెనీ నిరంతరం అనేక కొత్త మోడల్స్‌ను తీసుకొస్తుంది. స్ప్లెండర్ ప్లస్ నెం.1 బైక్‌గా అవతరించింది. మే నెలలో బెస్ట్ సెల్లింగ్ బైక్‌ల జాబితాలో స్ప్లెండర్ ప్లస్ ముందంజలో ఉంది. గత నెలలో 3,04,663 యూనిట్ల స్ప్లెండర్ విక్రయించగా, గతేడాది మే నెలలోనే 3,42,526 యూనిట్ల స్ప్లెండర్ అమ్ముడైంది. ప్రస్తుతం ఈ బైక్ మార్కెట్ వాటా 36.03 శాతం. కస్టమర్‌లు ఈ బైక్‌ను ఎంతగానో ఇష్టపడుతున్నారు. కాబట్టి ఈ బైక్‌లోని టాప్ ఫీచర్ల గురించి తెలుసుకుందాం. ఇంజన్ గురించి మాట్లాడితే బైక్ 100 సీసీ సింగిల్-సిలిండర్ ఇంజన్‌ను కలిగి ఉంది. ఇది 7.9 బీహెచ్‌పీ పవర్, 8.05 ఎన్‌ఎం టార్క్‌ను రిలీజ్ చేస్తుంది. ఈ ఇంజన్ 4 స్పీడ్ గేర్‌బాక్స్‌తో అమర్చబడి ఉంటుంది. ఈ ఇంజన్‌లో ఫ్యూయల్ ఇంజెక్షన్ టెక్నాలజీతో తీసుకొచ్చారు. ఇంజన్ పవర్, పర్ఫామెన్స్ పరంగా ఇది చాలా బెటర్ బైక్.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు!



**విశ్వంభర, ఢిల్లీ:** అంతర్జాతీయ బలహీన పరిస్థితులకు తోడు క్వాంట్ మ్యూచువల్ ఫండ్‌లో గందరగోళంతో సోమవారం ఉదయం నుంచి నష్టాల్లో కొనసాగిన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ ముగిసే సమయానికి లాభాలతో స్థిరపడ్డాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ ట్రేడింగ్ ముగిసే సమయానికి 131 పాయింట్లు (0.17శాతం) లబ్ధి పొంది 77,341 పాయింట్ల వద్ద స్థిర పడింది. మరోవైపు, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 37 పాయింట్లు పుంజుకుని 23,538 పాయింట్ల వద్ద ముగిసింది.మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్ గ్రిడ్, సన్ ఫార్మా, నెస్లే ఇండియా, ఆల్ట్రాటెక్ సిమెంట్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీ, ఎన్టీపీసీ, భారతీ ఎయిర్ టెల్ తదితర సంస్థలు మూడు శాతం వరకూ పుంజుకున్నాయి. మరోవైపు ఇండస్ ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, ఎస్బీఐ తదితర సంస్థలు 2.4 శాతం వరకూ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ 0.37 శాతం, స్మాల్ క్యాప్ 0.27 శాతం లాభాలతో ముగిశాయి. మరోవైపు నిఫ్టీ మీడియా 1.8 శాతం నష్టపోతే నిఫ్టీ మెటల్, నిఫ్టీ ప్రభుత్వ బ్యాంక్స్ 0.6 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీ ఆటో 0.9 శాతం పుంజుకున్నది. మరోవైపు ఫారెక్స్ మార్కెట్లో యూఎస్ డాలర్‌పై రూపాయి మారకం విలువ రూ.83.47 వద్ద స్థిరపడింది.

# వాట్సాప్ నుంచి ఫ్లైట్ టికెట్ బుకింగ్!




**విశ్వంభర, ఢిల్లీ:** విమానాల టికెట్ బుక్ చేయాలంటే ఏం చేస్తాం? ఎయిర్‌పోర్టుకు వెళ్తాం.. లేదా వివిధ ఆన్‌లైన్ ప్లాట్‌ఫారంల ఆధారంగా బుక్ చేసుకుంటాం. అయితే ఈ ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ భారతీయ విమానయాన సంస్థ ఇండిగో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. మనం రోజూ వాడే వాట్సాప్ యాప్ ద్వారా విమాన టికెట్లను బుక్ చేసుకునే వెసులుబాటును కల్పించింది. అందు కోసం ప్రత్యేకమైన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) బుకింగ్ అసిస్టెంట్‌ను ఆవిష్కరించింది. దానికి 6ఈస్కై అని పేరు పెట్టింది. దీని సాయంతో మీరు స్నేహితులతో చాట్ చేస్తూనే మీ ప్రయాణ ప్రణాళికలను క్రమబద్ధీకరించుకోవచ్చు. దీనిని గూగుల్ పార్టనర్ అయినా రియాఫై ద్వారా ఏఐ ప్లాట్‌ఫారమ్‌పై నిర్మించారు. 6ఈస్కై అనేది డిజిటల్ ట్రావెల్ ఏజెంట్ లాంటిది. ఇది మీకు టిక్కెట్‌లను బుక్ చేయడం, చెక్-ఇన్ చేయడం, బోర్డింగ్ పాస్‌లను రూపొందించడం, ఫ్లైట్ స్టేటస్‌లను చెక్ చేయడం, మీ యాదృచ్ఛిక ప్రయాణ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడంలో కూడా సహాయపడుతుంది. పైగా అన్నింటిని వాట్సాప్‌లోనే అందిస్తుంది. అంటే మీ చేతిలో ఓ వ్యక్తిగత ట్రావెల్ ఏజెంట్‌ను కలిగి ఉన్నట్లుగా ఉంటుంది. అంతేకాక ఇది మీ భాషలోనే మాట్లాడుతుంది. ఇంగ్లిష్, హిందీ, తమిళం వంటి భాషలను సపోర్టు చేస్తుంది. ఈ సేవలను ప్రారంభించడానికి మీ వాట్సాప్ నంబర్‌నుంచి o91 70651 45858కి వాట్సాప్ సందేశాన్ని పంపాలి. గూగుల్ క్లౌడ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ద్వారా ఆధారంగా 6ఈస్కై పనిచేస్తుంది. తరచుగా ప్రయాణించే వారికి ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది. అంతేకాక కొన్ని ఉన్నత-స్థాయి ప్రాంప్ట్ ఇంజినీరింగ్‌తో, ఇది మీ భావోద్వేగాలను అర్థం చేసుకోగలుగుతుంది. కొంచెం హాస్యాన్ని పంచుతుంది. మీ పరస్పర చర్యలను ఆనందదాయకంగా చేస్తుంది. ఈ అసిస్టెంట్ కేవలం పనిని పూర్తి చేయడమే కాదు, నైపుణ్యంతో ఆనందదాయకంగా చేస్తాడు. 6ఈస్కై మీరు చెప్పే ప్రతి పనిని నిర్వహిస్తుంది. టిక్కెట్లను బుక్ చేసుకోవాలా, డిస్కౌంట్‌లను వర్తింపజేయాలా లేదా ఆన్‌లైన్‌లో చెక్-ఇన్ చేయాలా? ఏమి ఇబ్బంది లేదు. మీ సీటును ఎంచుకోవాలనుకుంటున్నారా, యాత్రను ప్లాన్ చేయాలనుకుంటున్నారా లేదా ప్రశ్న అడగాలనుకుంటున్నారా? చాలా సులభం. మీరు ఎప్పుడైనా నిజమైన వ్యక్తితో మాట్లాడవలసి వస్తే, 6ఈస్కై మిమ్మల్ని ఏజెంట్‌తో కూడా కనెక్ట్ చేయగలగుతుంది.

విశ్వంభర V3 NEWS

# జాక్ పాట్ కొట్టేసిన సామ్!

విశ్వంభర, సినిమా: వరుస ప్లాపుల్లో అవకాశాలు లేక సతమతం అవుతున్న సమంత ఇప్పుడు జాక్ పాట్ కొట్టేసింది. ఏకంగా బాలీవుడ్ టాప్ హీరో శారుఖ్ ఖాన్, టాప్ డైరెక్టర్ రాజ్ కుమార్ హిరాని సినిమాలో ఛాన్స్ కొట్టేసింది. ఇక డంకి సినిమా తర్వాత, షారుఖ్ ఖాన్ మరోసారి రాజ్‌కుమార్ హిరానీతో మళ్లీ సినిమా చేస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ సినిమా యాక్షన్-అడ్వెంచర్-దేశభక్తి చిత్రం అని అంటున్నారు. ఇక ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.ఈ వార్తలు కనుక నిజమైతే అభిమానులకు ఖచ్చితంగా ట్రీట్‌గా మారడం ఖాయం. తెరపై హ్యూమన్ ఎమోషన్స్‌ని పెంపొందించడంలో పేరుగాంచిన రాజ్ కుమార్ హిరానీ సినిమాలో ఛాన్స్ అంటే సమంతకి మామూలు విషయం కాదు. ఇలా చాలా విరామం తర్వాత సమంతకు ఓ సువర్ణావకాశం దక్కింది. శారుఖ్ రాజ్ కుమార్ హిరానితో చేసిన డంకి చిత్రం బాక్సాఫీస్ వద్ద పర్వాలేదనిపించుకుంది. ప్రపంచ బాక్సాఫీస్‌లో 500 కోట్ల వసూళ్ళని సంపాదించింది. ఇది 2023లో షారుఖ్ ఖాన్ కి మూడవ చిత్రం. అయితే షారుఖ్ ఖాన్ నుంచి సినిమా ఈ ఏడాది విడుదల ఉండకపోవచ్చు. అయన తన రాబోయే చిత్రాలను కూడా ప్రకటించలేదు. అయితే కేజీఎఫ్ ఫేమ్ నటుడు యష్ తదుపరి చిత్రం 'టాక్సిక్'లో షారుఖ్ ఖాన్ అతిధి పాత్రలో నటించవచ్చని నివేదికలు సూచిస్తున్నాయి. ఇంకా అంతేకాకుండా, అతను పఠాన్ ఫేమ్ సిద్ధార్థ్ ఆనంద్ 'కింగ్' సినిమా కూడా పైప్‌లైన్‌లో ఉన్నాడు. ఈ సినిమా ఆయన కూతురు సుహానా ఖాన్ రంగస్థల ప్రవేశాన్ని కూడా సూచిస్తుంది. ఇక మరోవైపు సమంతా రూత్ ప్రభు విషయానికి వస్తే ఆమె చివరిసారిగా 2023 వ సంవత్సరంలో విజయ్ దేవరకొండతో కలిసి కుషి చిత్రంలో కనిపించారు. ఈమె మైయోసిటిస్ బారిన పడ్డ తర్వాత గత సంవత్సరం నటన నుండి సుదీర్ఘ విరామం తీసుకున్నారు. ఆమె తదుపరి ప్రాజెక్ట్ సిటాడెల్. ఇందులో సమంత యంగ్ వరుణ్ ధావన్ సరసన నటించనుంది. ఈ సిరీస్‌ను ఫ్యామిలీ మ్యాన్, ఫర్జీ, రాజ్, డీకే నిర్మిస్తూ డైరెక్ట్ చేస్తున్నారు.





## కేజీఎఫ్ భామతో రానా రొమాన్స్!

విశ్వంభర, సినిమా: టాలీవుడ్ హల్క్ రానా దగ్గుబాటి ‘రానా నాయుడు’ వెబ్ సిరీస్ తరువాత కొంత గ్యాప్ తీసుకున్నాడు. ఇప్పటికే ఆయన తన నెక్ట్స్ సినిమాలను అనౌన్స్ చేసినా, అవి పట్టాలెక్కకపోవడంతో అభిమానులు నిరాశ చెందుతున్నారు. దర్శకుడు తేజ దర్శకత్వంలో ‘రాక్షస రాజు’ అనే సినిమాను అనౌన్స్ చేసిన రానా, ఆ సినిమా షూటింగ్ ను ఇంకా స్టార్ట్ చేయలేదు. గతంలో దర్శకుడు గుణశేఖర్ తో కలిసి ‘హిరణ్యకశ్యప’ను ప్రకటించారు. ఈ సినిమా కూడా హోల్డ్ లోనే ఉంది. దీంతో ఇప్పుడు ఓ కొత్త దర్శకుడితో తన నెక్ట్స్ మూవీని స్టార్ట్ చేసేందుకు రానా సిద్ధమయ్యాడట. ఈ సినిమాను ‘బాహుబలి’ నిర్మాతలు ఆర్కా మీడియా వర్క్స్ ప్రొడ్యూస్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ సినిమాలో ‘కేజీఎఫ్’ హీరోయిన్ శ్రీనిధిని తీసుకునేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. ఈ కాంబినేషన్ తెలుగు ఆడియెన్స్ కు రిఫ్రెషింగ్ గా కనిపిస్తుందని వారు భావిస్తున్నారట. ఇక ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్ మెంట్ త్వరలోనే రానున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

## రాములమ్మ ఈజ్ బ్యాక్



విశ్వంభర, సినిమా: టాలీవుడ్ స్క్రీన్‌పై లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతో విజయాలు అందుకున్న నటి విజయశాంతి. హీరోల కు దీటుగా యాక్షన్ ఎపిసోడ్స్‌లో నటించి సంచలనం సృష్టించారు. లేడీ అమితాబ్, లేడీ సూపర్ స్టార్ గా పేరు సంపాదించుకున్నారు. అయితే ఆమె నటించిన పలు హిట్ చిత్రాల్లో కర్తవ్యం కూడా ఒకటి. తెలుగు తెరపై ఒక చరిత్ర సృష్టించిన ఈ చిత్రంలో పోలీస్ ఆఫీసర్ వైజయంతిగా నటించి విజయశాంతి సూపర్ స్టార్ అయ్యారు. అప్పటి వరకు పోలీసు పాత్రలో ఇతర ఏ నటి కూడా అంత పవర్ ఫుల్‌గా నటించలేదు. కానీ విజయశాంతి మాత్రం నటించి సెన్సేషన్ క్రియేట్ చేశారు. ఆ సినిమా అప్పట్లో ప్రేక్షకులపై చాలా ప్రభావం చూపించింది. ఎందరికో స్ఫూర్తిని కూడా ఇచ్చింది. ఇప్పుడు చాలా ఏళ్ల తర్వాత మళ్ళీ విజయశాంతి పోలీస్ ఆఫీసర్ వైజయంతిగా కనపడనున్నారు. అది నందమూరి కల్యాణ్‌రామ్ చిత్రం కోసం. డెవిల్ సక్సెస్ తర్వాత నందమూరి కల్యాణ్‌రామ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ ఎన్‌కేఆర్ 21. యాక్షన్ జానర్‌లో రానున్న ఈ చిత్రంతో ప్రదీప్ చిలుకూరి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అయితే నేడు (జూన్ 24) విజయశాంతి పుట్టినరోజు సందర్భంగా మూవీ నుంచి రాములమ్మ ఫస్ట్ లుక్‌తో పాటు స్పెషల్ అండ్ పవర్‌ఫుల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు మేకర్స్ . "వైజయంతి ఐపీఎ. తను పట్టుకుంటే పోలీసు తుపాకీకి ధైర్యం వస్తుంది. వేసుకుంటే యూనిఫామ్ కు పౌరుషం వస్తుంది. తనే ఒక యుద్ధం. నేనే తన సైన్యం" అంటూ విజయశాంతిని ఉద్దేశిస్తూ కల్యాణ్ రామ్ చెప్పే డైలాగ్ గూస్ బంప్స్ తెప్పిస్తోంది. ఇందులో విజయశాంతి యాక్షన్ మోడ్‌లోనూ కనిపించింది. బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా అదిరిపోయింది . కాగా, సినిమాను అశోక క్రియేషన్స్ నిర్మిస్తోంది. అశోక్ వర్ధన్ ముప్ప, సునీల్ బలుసు, ఎన్టీఆర్ ఆర్ట్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ నుంచి విడుదలైన కల్యాణ్ రామ్ ఫస్ట్ లుక్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంది.

## పెళ్లి పీటలు ఎక్కబోతున్న మలయాళ బ్యూటీ?




విశ్వంభర, సినిమా: మలయాళం, తమిళ, తెలుగు సినిమాల్లో నటించి మంచి క్రేజ్ తెచ్చుకుంది నివేదా థామస్. తమిళ్ , మలయాళంలో వరుసగా సినిమాలు చేసింది. తెలుగులో నాని నటించిన జెంటిల్ మేన్ సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది. తొలి సినిమాతోనే మంచి క్రేజ్ ను సొంతం చేసుకుంది. తెలుగులో నాని నటించిన జెంటిల్ మేన్ సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది. తొలి సినిమాతోనే మంచి క్రేజ్ ను సొంతం చేసుకుంది. ఆ తర్వాత కూడా నాని తో మరో సినిమా చేసింది. నిన్ను కోరి సినిమాలో హీరోయిన్‌గా చేసింది నివేదా థామస్. ఈ సినిమా కూడా సూపర్ హిట్ అయ్యింది. ఆ తర్వాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన వకీల్ సాబ్ సినిమాలో సైతం నటించి దీంతో మరో భారీ విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత అప్పుడెప్పుడో షాకిని డాకిని అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన నివేదా ఈ సినిమాతో పరవాలేదు అనిపించుకుంది. అయితే తాజాగా నివేదా తన సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ షేర్ చేసింది. దాంతో ఆమె షేర్ చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతుంది. అయితే ప్రస్తుతం నివేద సినిమాలేవీ చేయకపోయినప్పటికీ సోషల్ మీడియా వేదికగా మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. అప్పుడెప్పుడో తన షేర్ చేసిన ఫోటోలో చాలా సన్నగా ఉన్న నివేద థామస్ ఇప్పుడిప్పుడు మాత్రం చాలా లావు అయింది. బొద్దుగా కనిపిస్తూ అందరినీ ఆకట్టుకుంటుంది ఈ బ్యూటీ. అయితే తాజాగా ఏమి షేర్ చేసిన ఫోటో ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం . . తాజాగా ఎక్స్ వేదికగా ఒక స్పెషల్ పోస్ట్ పెట్టింది. చాలా కాలం గడిచింది... కానీ.. చివరిగా అంటూ లవ్ ఎమోజీని జత చేసింది. ఇక ఈ పోస్ట్ చూసిన కొందరు నెటిజన్లు నివేతా పెళ్లి చేసుకోబోతుంది అంటూ కామెంట్లు పెడుతుండగా.. మరికొందరు మూవీ అప్‌డేట్ అయ్యింటుందని కామెంట్లు పెడుతున్నారు. కాగా దీనిపై నివేతా క్లారిటీ ఇవ్వవలసి ఉంది. దీంతో ప్రస్తుతం నివేద షేర్ చేసిన ఈ ఫోటో సోషల్ మీడియా వేదికగా వైరల్ అవుతుంది.

## బిజీ మోడ్‌లో సాయి పల్లవి!



విశ్వంభర, సినిమా: సాయి పల్లవి గతేడాది ఒక్క సినిమా కూడా విడుదల చెయ్యలేదు. పూర్తిగా రెస్ట్ తీసుకొంది. కానీ ఈ ఏడాది (2024)లో మాత్రం ఆమె రెస్ట్ దొరకడం లేదు. అంతగా బిజీ అయింది. 2022లో “విరాట పర్వం” విడుదల తర్వాత బ్రేక్ తీసుకొంది. గతేడాది చివర్లో కొత్త సినిమాలు సైన్ చెయ్యడం మొదలు పెట్టింది. ప్రస్తుతం మూడు చిత్రాలు సెట్స్ పై ఉన్నాయి. అన్నీ షూటింగ్ దశలోనే ఉన్నాయి. అందుకే ఆమె ఊపిరి సలపనంత బిజీగా ఉంది. తెలుగులో ఆమె నాగ చైతన్య సరసన “తండేల్” అనే సినిమాలో నటిస్తోంది. ఇటీవలే విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేశారు. ఇంకా చాలా భాగం మిగిలే ఉంది. డిసెంబర్ లో విడుదలయ్యే “తండేల్” కోసం ఆమె కష్టపడుతోంది. ఇక బాలీవుడ్ లో అమీర్ ఖాన్ కొడుకు జునైద్ ఖాన్ రెండో చిత్రంలో ఆమె హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకొంది. ఇప్పుడు రణబీర్ కపూర్ సరసన “రామాయణ”లో సీతగా నటిస్తోంది. ఈ రెండు హిందీ సినిమాలు కూడా వచ్చే ఈఏడాది విడుదల అవుతాయి.

## పచ్చబొట్లు సమస్యలకు దారి తీయవచ్చు!



విశ్వంభర, ఫీచర్: గత కొన్ని సంవత్సరాలలో పచ్చబొట్లు బాగా ప్రజాదరణ పొందాయి. అన్ని వయసుల ప్రజలు వీటిని శరీరంపై వేసుకుంటున్నారు. అయితే పచ్చబొట్లు ఒకరి శరీరానికి అందాన్ని చేకూర్చినప్పటికీ, వాటితో సంబంధం ఉన్న ప్రతికూలతలు, అనేక ఆరోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. పచ్చబొట్టు వేయించుకోవడమంటే ముఖ్య సమస్య అది శాశ్వతంగా ఉండడమే. అంతేకాకుండా పచ్చబొట్లను సులభంగా తొలగించలేము. పచ్చబొట్లను తొలిగించాలంటే చాలామంది లేజర్ ట్రీట్మెంట్ ద్వారా తొలిగించుకుంటారు. అయితే ఈ తొలగింపు ఖరీదైనది మాత్రమే కాకుండా బాధాకరమైనది కూడా. అంతే కాదు చాలా సమయం తీసుకుంటుంది. ఈ టాటూ ఇంక్ లోని కొన్ని రసాయనాలు లింఫోమా ప్రమాదాన్ని పెంచుతాయి. పచ్చబొట్లు నేరుగా క్యాన్సర్ కు కారణమవుతాయని చాలా మంది భావిస్తారు. కాకపోతే, పచ్చబొట్లలలో వాడే కెమికల్స్ వల్ల అది నిర్ణయం జరుగుతుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం లింఫోమా క్యాన్సర్. అయితే దీని వల్ల పెద్దగా ప్రమాదం ఉండకపోవొచ్చు. ఇకపోతే టాటూ వేసుకోవాలని ఆలోచిస్తున్నట్లయితే.. దానిని ముందుగా అర్థం చేసుకోవాలి. కచ్చితంగా ప్రొఫెషనల్ టాటూ ఆర్టిస్ట్ ద్వారా మాత్రమే దీన్ని వేయించుకోవాలి. పరిశుభ్రత పాటించే, నాణ్యమైన ఇంక్ వాడే ప్రదేశంలో మాత్రమే పచ్చబొట్టు వేయించుకోవాలి. ఒకవేళ ఏదైనా తీవ్రమైన వ్యాధి కనుక మీకు ఉంటే.. నిపుణుల నుంచి కూడా సలహా తీసుకోవాలి.

## నేరేడు పండ్లతో ఈ సమస్యలకు చెక్!



విశ్వంభర, ఫీచర్: నలుపు, ఊదా రంగుల మిశ్రమంతో మిలమిలా మెరుస్తూ కనిపించే నేరేడు పండ్ల గురించి అందరికీ తెలుసు. కానీ వాటిని తినే వారు మాత్రం చాలా తక్కువ మందే ఉంటారు. వీటిలో ఉండే పోషకాల గురించి తెలిస్తే మాత్రం తినకుండా అస్సలు వదిలిపెట్టరు. నేరేడు ఆరోగ్యానికి అంత గొప్ప దివ్య ఔషధమని నిపుణులు చెబుతుంటారు. నేరేడు పండ్లు తినడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు తెలుసుకుందాం.వర్షాకాలంలో ఎక్కువగా దొరికే నేరేడు పండ్లు ఆరోగ్యానికి దివ్యౌషధాలు. ఎన్నో రోగాలకు సహజ నివారిణిగా ఇవి పనిచేస్తాయి. అందుకే నేరేడు పండ్లు ఎక్కువగా దొరికే రోజుల్లో వీటిని అస్సలు మిస్సవ్వద్దు. నేరేడు పండ్లు తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి.

**రోగనిరోధక శక్తి పెరుగుతుంది:**

నేరేడు పండ్లు చూడటానికి చక్కని రంగుతో మిలమిలా మెరిసిపోతూ ఉంటాయి. అంతే స్థాయిలో ఆరోగ్యానికి కూడా ఇవి మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. నేరేడు పండ్లలో పుష్కలంగా ఉండే విటమిన్ సి, ఫైటోకెమికల్స్, ఫినాలిక్ ఆమ్లంతో పాటు ఇతర పోషకాలు రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి.

**ఇన్ఫెక్షన్లకు చెక్:**

అతిసారం, కలరా వ్యాధులతో పాటు ఇతరత్రా ఇన్ఫెక్షన్ల నుంచి మన శరీరాన్ని నేరేడు పండ్లు తినడం వల్ల కాపాడుకోవచ్చు. అంతే కాకుండా ఇవి దీర్ఘకాలిక దగ్గు, ఆస్తమా వ్యాధులు రాకుండా చేస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తింటే కోరింత దగ్గు, బీపీ వంటివి తగ్గుతాయి.

**జీర్ణక్రియ మెరుగుపడుతుంది:**

నేరేడు పండ్లను తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఫలితంగా మలబద్ధకం, గ్యాస్ ట్రబుల్, అజీర్తి వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. అధిక దాహం, అధిక మూత్రం వంటి లక్షణాలను కూడా ఇవి తగ్గిస్తాయి.


### గుండె ఆరోగ్యం ఆరోగ్యానికి మేలు

నేరేడు పండ్లలో క్యాలరీలు తక్కువగా ఉండడం వల్ల బరువు తగ్గాలనుకునేవారికి ఇవి మంచి చిరుతిండ్లుగా ఉపయోగపడతాయి. అంతేకాకుండా వీటిలో ఉండే ఫైటో కెమికల్స్ గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. క్రమం తప్పకుండా నేరేడు పండ్లు తినడం వల్ల గుండె జబ్బులు అదుపులో ఉంటాయని పలు అధ్యయనాల్లో వెల్లడైంది.

**మధుమేహం నియంత్రణ:**

మధుమేహ వ్యాధిగ్రస్తులకు నేరేడు పండ్లు తినడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం, రక్తంలో చక్కెర స్థాయిలను తొందరగా పెరగకుండా నియంత్రిస్తుంది. వారంలో ఒకటి నుంచి రెండు సార్లు తక్కువ మోతాదులో నేరేడు పండ్లు తీసుకోవడం మంచిది.

## ఉసిరికాయ తింటే బాడీలో జరిగే మార్పులు!



విశ్వంభర, ఫీచర్స్: పోషకాలతో నిండి విటమిన్ సి యొక్క గొప్ప సహజ మూలం ఉసిరి. దీనిని ఇండియన్ గూస్బెర్రీ అని కూడా పిలుస్తారు. ఉసిరిని రెగ్యులర్‌గా ఉపయోగించడం వల్ల అనేక ఆరోగ్య సమస్యల నుంచి తప్పించుకోవచ్చు అని చెబుతున్నారు నిపుణులు. దీని వల్ల రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ఆయుర్వేదం ప్రకారం, ఉసిరి చర్మాన్ని ప్రకాశవంతం చేయడానికి, రక్తాన్ని శుద్ధి చేయడానికి ఉపయోగపడటంతో పాటు.. కంటి చూపును మెరుగుపరచడానికి కూడా ఎంతో ఉత్తమైనదని తెలుస్తుంది. ఆమ్లా జీర్ణక్రియను మెరుగుపరచడానికి సహాయపడుతుంది. అయితే.. ఇన్ని ఔషధ గుణాలు ఉన్న ఉసిరిని రోజుకొకటి తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com